


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




గురువారం | 27-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 313 | విజయవాడ సిటీ*

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చవితి పూర్తి; నక్షత్రం: రేవతి రా. 1.09 తదుపరి అశ్విని; వర్జ్యం: ఉ. 11.39-1.27; దుర్ముహూర్తం: ఉ. 10.32-11.19, మ. 3.12-3.58; అమృతఘడియలు: రా. 10.27-12.15; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.18

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore




*ఆహా... అమ్మ ఒడి!*

*వారెవ్వా... జగనన్న వసతి దీవెన!*

*వందశాతం ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ ఇస్తామంటూ... 'విద్యా దీవెన'!*

సర్కారు వారు గొప్పగా చెప్పుకొంటున్న పథకాలు! పైకి చూస్తే... మేడిపండులా 'నవరత్నాల' మిలమిల! లోపలికి వెళ్లి చూస్తేనే అసలు గుట్టు రట్టవుతుంది. లక్షల సంఖ్యలో విద్యార్థులకు అన్యాయం జరిగిన వైనం వెలుగు చూస్తుంది. చదువులు, మెస్ చార్జీలకు ప్రతి నెలా ఆదుకునే పథకాలు పోయి... ఏడాదికోసారి ఇచ్చే పద్ధతి వచ్చింది. వచ్చిన మొత్తాన్ని వేర్వేరు అవసరాలకు ఒకేసారి ఖర్చు చేసే వారే ఎక్కువ! ఆ తర్వాత పిల్లల చదువులకు మళ్లీ కష్టాలే?

# జగనన్నా.. ఇంత దగానా!

## పాత విద్యా పథకాలకే కొత్త పేర్లు

## తరగతులు, కోర్సులు కలగాపులగం

### షరతులు, నిబంధనలతో 23 లక్షల మంది

## విద్యార్థులకు కోత

### కొసరుగా కొంత లబ్ధి పెంచి లబ్ధిదారుల సంఖ్య భారీగా కుదింపు

**ప్రీ మెట్రిక్‌లో 18 లక్షలు, పోస్ట్ మెట్రిక్‌లో 5 లక్షల మంది విద్యార్థులకు కట్**

**అప్పుడు నెలనెలా చదువుల ఖర్చు తీరేలా**

**ఇప్పుడు ఏడాదికి ఒకేసారి 'అమ్మ ఒడి'**

**ఇంటర్ కూడా అదే పథకం పరిధిలో**

**'వసతి దీవెన' సొమ్ములూ తల్లికే**

**వసూలు ఎలా అంటున్న కాలేజీలు!**

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కొత్త పథకం ప్రవేశ పెడితే... అదే తరహాలో ఉన్న పాత దాని కంటే మెరుగ్గా ఉండాలి! మరి కొందరికి, మరింత మొత్తంలో లబ్ధి చేకూరాలి. కానీ... పాత పథకాలను కలిపేసి, కలగాపులగం చేసి, మసిపూసి మారేడుకాయ చేసి కొత్తగా ఓ పేరు పెట్టేసి... అదనంగా జరిగే కొంత లబ్ధికి ఎంతోమందిని దూరం చేస్తే? దానిని దగా... అనే అంటారు! అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన విషయంలో జరుగుతున్నది ఇదే! ఒక్కసారిగా పెద్దమొత్తంలో డబ్బు ఇచ్చేసి... భ్రమల్లో ముంచేసి... ప్రతినెలా పద్ధతిగా వాడుకునేందుకు ఉద్దేశించిన పథకాలను రద్దు చేశారు. ఈ పథకాలు లక్షలాది మంది విద్యార్థులకు శాపంగా మారాయి. ఆరు నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు అర్హతను బట్టి... స్కాలర్‌షిప్, కాస్మెటిక్ చార్జీలు, ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఇలా పలు పథకాలు

మిగతా 10వ పేజీలో...

**లబ్ధిదారులు**

| నాడు | నేడు |
|---|---|
| ప్రీ మెట్రిక్ 60 లక్షలు | అమ్మ ఒడి 42 లక్షలు |
| ఇంటర్ స్కాలర్‌షిప్స్ 8-9 లక్షలు | షరతుల తర్వాత 4.5 లక్షలు |
| పోస్ట్ మెట్రిక్ 16 లక్షలు | కోతల తర్వాత 11 లక్షలు |

## ఉద్రిక్తంగానే.. ఢిల్లీ

**27** ఇప్పటి దాకా మృతుల సంఖ్య



ఢిల్లీలో అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

### 250 మంది గాయాలపాలు!

**డ్రైనేజీలో ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి శవం**

**ఆప్ నేతపై కుటుంబ సభ్యుల అనుమానం**

**క్షతగాత్రుల్లో 30% మందికి తూటా గాయాలు**

**పెద్ద ఎత్తున వేరే చోట్లకు తరలిపోతున్న ప్రజలు**

**106మంది అరెస్టు.. 18 ఎఫ్ఐఆర్‌ల నమోదు**

**ఘర్షణ జరిగిన ప్రాంతాల్లో దోబాల్ పర్యటన**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళనలతో అట్టుడికిన దేశ రాజధాని ఢిల్లీలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఢిల్లీ శివార్లలో.. యూపీలోని జోహార్‌పురిలో ఆందోళనకారులు, భద్రతా దళాల మధ్య బుధవారం కూడా ఘర్షణలు జరిగాయి. అల్లర్లు జరుగుతున్న చాంద్‌బాగ్, జఫ్రాబాద్, భజన్‌పురా, యమునావిహార్, మౌజ్‌పూర్ ప్రాంతాలు భద్రతాదళాలు నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ పదఘట్టనలతో మారుమోగాయి. ఆయా ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెల్లాచెదురుగా రాళ్లు, పగిలిన

మిగతా 11వ పేజీలో...



**పోలీసులకు స్వేచ్ఛ లేదు**

ఉంటే ఢిల్లీలో అల్లర్లు జరిగేవి కావు

ఆజ్ఞల కోసం ఎదురుచూపే: సుప్రీం

**మరో 1984 కానివ్వం**

అర్ధరాత్రి రంగంలోకి దిగిన ఢిల్లీ హైకోర్టు

**అమిత్ షా రాజీనామా చేయాలి**

కేంద్రం, ఢిల్లీ సర్కార్ రెంటిదీ బాధ్యతే

పథకం ప్రకారం హింస: సోనియా

సీడబ్ల్యూసీ భేటీ అనంతరం విమర్శలు

డిమాండ్ హాస్యాస్పదం: బీజేపీ

---

### 2,000 నోట్ల కథ కంచికి?



ఏటీఎంల్లోనూ బంద్.. నోట్ల ముద్రణా లేదు 8

### సారు సభకు చందాలు..!

కర్నూలులో సీఎం పర్యటనకు వసూళ్ల పనీ అధికారులకే

ఒక్కో కార్యాలయానికి వాటాగా రూ.50 వేలు

భోజనం, వసతి భారం కొన్నింటిపై

మరికొన్నిటిపై బొకే, బాటిల్స్ ఖర్చు 11






## మీ ఇష్టం కుదరదు

**మా విధానమే కొనసాగాలి**

4 ఏళ్ల డిగ్రీ, 5 ఏళ్ల ఇంజనీరింగ్‌కు 'నో' చెప్పిన యూజీసీ, ఏఐసీటీఈ

దేశవ్యాప్తంగా ఒకే విధానమని వెల్లడి

సీఎం జగన్ నిర్ణయానికి ఆదిలోనే బ్రేక్

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సుల కాల వ్యవధిని మరో ఏడాది పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని జాతీయ ఉన్నత, సాంకేతిక విద్యల నియంత్రణ, పర్యవేక్షణ సంస్థలు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చాయి. జాతీయ విద్యా విధానానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం తమ ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోరాదని స్పష్టం చేశాయి. కోర్సుల కాల వ్యవధి ఎలా ఉండాలన్నది రాష్ట్రాలకు సూచిస్తామని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ)లు తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపాయి. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ, ఐదేళ్ల

మిగతా 2వ పేజీలో...

### 'పైడా' కాలేజీలో సచివాలయం?



**ఆ భవనాలు రోశయ్య అల్లుడివి**

**నాలుగేళ్ల కిందే కౌశిక్ కాలేజీ మూసివేత**

**రెండో కాలేజీలో రెండేళ్లుగా అడ్మిషన్లు లేవు**

**మరో రెండేళ్లలో అది కూడా మూతే!**

**వాటి యజమానితో మంత్రి అవంతి చర్చలు**

**పరిశీలించి వెళ్లిన విజయసాయి బృందం** 9

### మా పోరు ఆగదు

**ప్రభుత్వం దిగి రావాల్సిందే**

**రాజధాని భూములు పంచితే ఊరుకోం**

**అమరావతి రైతుల తీవ్ర ఆగ్రహం**

**71వ రోజు కొనసాగిన ఆందోళనలు**




తుళ్లూరులో పెళ్లి మండపం నుంచి వధూవరుల 'జై అమరావతి' నినాదాలు



నెల్లూరు జిల్లాలో ఓ వలంటీర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్డు

## విద్యార్థి వలంటీర్లు!

**డబుల్.. ట్రబుల్**

### వైసీపీ నేతల పిల్లల డబుల్ రోల్

**ఇప్పటికే ప్రతినెలా రూ.5వేల గౌరవ వేతనం**

**జగనన్న వసతి దీవెనలోనూ లబ్ధికి యత్నం**

**వారందరి గుట్టు రట్టుచేసిన బయోమెట్రిక్**

**నెల్లూరు జిల్లాలో 55మంది విద్యార్థుల గుర్తింపు**

**తమ పిల్లల్నే నియమించుకున్న వైసీపీ నేతలు**

**వారి తరఫున బినామీలుగా విధుల నిర్వహణ**

**వలంటీర్ల అడ్డగోలు నియామకాలకు నిదర్శనం**

అమరావతి/నెల్లూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రామ వలంటీర్లుగా ఉద్యోగాలు పొందిన విద్యార్థుల గుట్టు రట్టయింది. 'జగనన్న వసతి దీవెన'లో లబ్ధి పొందాలని ప్రయత్నించిన వారి బండారం బయటపడింది. ఈ పథకం ద్వారా ఏడాదికి ఐటీఐ విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నిక్ వారికి రూ.15వేలు, ఆపై కోర్సులు చదివేవారికి రూ.20వేలు వసతి, భోజన ఖర్చుల కింద చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా మొదటి విడత చెల్లింపు ప్రక్రియ ప్రారంభించింది. ఇప్పటికే వలంటీర్లుగా చేరి పలు గ్రామ, వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు విద్యార్థులు ప్రతినెలా రూ.5వేలు గౌరవ వేతనం

మిగతా 2వ పేజీలో...



### పరీక్షల గంట మోగింది

**4 నుంచి ఇంటర్, 23 నుంచి టెన్త్**

అవసరమైన చోట ఇన్విజిలేటర్లుగా గ్రామ సచివాలయ సిబ్బంది: మంత్రి 2

### ఎంసెట్ నోటిఫికేషన్ నేడే

29 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఆలస్య రుసుంతో ఏప్రిల్ 19 వరకు

ఏప్రిల్ 20-24 వరకు పరీక్షలు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు



పరంజ్యోతి

# గురువే బ్రహ్మ.. గురువే విష్ణు.. గురువే శివుడు

*గురు కుమ్హార్ శిష్ కుంబ్ హై, ఘడి ఘడి కాఢై ఖోట్*
*అంతర్ హాథ్ సహార్ దై బాహార్ బాహై చోట్*

"కుమ్మరి సారెమీద తయారైన కుండయొక్క వంకర్లను చెక్కతో కొడుతూ ఎలాగైతే దాన్ని అందంగా తయారు చేస్తాడో గురువూ అలాగే తన చెంతచేరిన శిష్యునికి మంచి చెడుల మర్మాలు విప్పి చెబుతూ అతన్ని గుణవంతునిగా మలుస్తాడు" అంటాడు మహాత్మా కబీరు. తల్లిదండ్రుల తరువాత గురువే పూజనీయుడు అని ఆర్యోక్తి.

శ్రీ కైవల్య సారథి అనే గ్రంథంలో "ఏ మహాత్ముని రూపం నీలో నిలిచి పోతుందో.. ఏ సన్యాసి నీకు స్వప్నంలో కనిపించి సన్మార్గాన్ని బోధిస్తాడో.. ఏ సాధువు చెప్పిన ధర్మసూత్రాలు నీలో నిలిచిపోతాయో.. ఏ మహనీయుని దగ్గరకు వెళ్లగానే నీ సందేహాలు నివృత్తి అవుతాయో.. ఏ వ్యక్తి దగ్గర నీకు ప్రశాంతత, ఆనందం కలుగుతాయో ఆ మహనీయుడే నీకు గురువు" అన్నారు శ్రీ కోవి సారథి. "మనల్ని దారి తప్పకుండా పరమాత్ముని చెంతకు చేర్చగల సమర్థుడైన ఏకైక వ్యక్తి గురువే" అన్నారు స్వామి వివేకానంద. "తాను కష్టపడి తెలుసుకున్న సత్యాన్ని స్వయంగా ఆచరిస్తూ నలుగురిని మార్చగల మహనీయుడే నా దృష్టిలో నిజమైన గురువు" అన్నారు జాతిపిత మహాత్మాగాంధీ.

మన వేద పురాణాలు కూడా గురువుకు భగవంతునితో సమానమైన స్థానాన్ని కల్పించాయి. స్కాందపురాణంలోని గురుగీతలో పరమశివుడు పార్వతీదేవికి గురువు త్రిమూర్తుల అవతారం అని చెబుతాడు. దాన్నే ఆధ్యాత్మికవేత్తలు వివరిస్తూ "గురువును సృష్టికర్తయైన బ్రహ్మ అంటారు.. ఎందుకంటే మనకు ఆయన కాలానుగుణమైన విషయాల్ని బోధిస్తూ కొత్త దారులనుండి నడిపిస్తాడు కాబట్టి. గురువును రక్షకుడైన శివుడు అంటారు.. ఎందుకంటే ఆయన మనలో ప్రతికూలభావాలు కలుగకుండా కాపాడుతూ లక్ష్యం వైపు నడిపిస్తాడు కాబట్టి. గురువును లయకారుడైన శివుడు అంటారు.. ఎందుకంటే ఆయన మనం జీవితంలో ఎదుర్కొనే కష్టాలను అంతం చేస్తూ ధైర్యాన్నిచ్చి ముందుకు నడిపిస్తాడు కాబట్టి" అని చెబుతారు.



భారతదేశంలో ఆధ్యాత్మికంగాను, సామాజికంగాను గురువుకు చాలా ప్రాధాన్యత ఉంది. అనాదిగా భారతీయ సంస్కృతిలో గురు పరంపర వస్తూనే ఉంది. గురు సంప్రదాయానికి మూల పురుషుడు సదాశివుడు. ఆయన్ని దక్షిణామూర్తి అని కూడా అంటారు. విశ్వామిత్రునివద్ద రామలక్ష్మణులు, సాందీపుని వద్ద బలరామ కృష్ణులు, పరశురాముని వద్ద భీష్ముడు, ద్రోణునివద్ద అర్జునుడు, గోవింద భగవత్పాదుల వద్ద ఆదిశంకరాచార్యులు, స్వామి వివేకానందుని వద్ద సంత్ కబీరు దాసు, రామకృష్ణ పరమహంస వద్ద స్వామి వివేకానంద... ఇలా ఎందరో గురు కృపతో ధన్యజీవులైనారు.

**- పరికిపండ్ల సారంగపాణి, 984930290**



మాచర్ల ప్రాంతంలో పేదలకు ఉచితంగా మంచినీటిని అందిస్తున్న ట్యాంకర్లు

# పసుపంటే పడదంతే..!

- శుభసూచకమైన రంగుపై మాచర్ల వైసీపీ నేతల ఆంక్షలు
- పేదలకు ఉచిత మంచినీటి సరఫరా ట్యాంకర్ల అడ్డగింత
- గుంటూరులో దివ్యాంగ కళాకారులపై వైసీపీ మూకల దాడి

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): కాదేదీ వివాదానికి అనర్హం అన్నట్టుగా వైసీపీ శ్రేణుల పోకడలు ఉంటున్నాయి. స్వగ్రామంపై మమకారంతో పేదలకు ఉచిత సేవలందిస్తున్న ఎన్నారైలకు సైతం రాజకీయ రంగు పులుముతున్నారు. గుంటూరు జిల్లా మాచర్ల ప్రాంతంలో పెమ్మసాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఏడేళ్లుగా సొంతంగా ట్యాంకర్లు ఏర్పాటుచేసి పేదలు నివసించే ప్రాంతాలకు మంచినీటిని ఉచితంగా సరఫరా చేస్తున్నారు. మాచర్లలో ఓ ద్వితీయ స్థాయి వైసీపీ నేత, ఎమ్మెల్యే అనుచరుడి కన్ను ఈ ట్యాంకర్లపై పడింది. వాటికి ఉన్న పచ్చరంగు చెరిపివేస్తేనే ట్యాంకర్లను తిరగనిస్తామని, లేకుంటే మున్సిపల్ నీటిని ఇచ్చేదిలేదని హెచ్చరించారు. దీంతో ఉచిత మంచినీటి సరఫరా కార్యక్రమానికి బ్రేక్ పడింది. పార్టీలకు అతీతంగా వ్యవహరించే అ సంస్థ నిర్వాహకులు సదరు నేత పోకడను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఉన్నారు. రంగుల వంకతో ఉచితంగా అందిస్తున్న సేవలను అడ్డగించడం ఏంటని స్థానికులు మండిపడుతున్నారు. శుభసూచకంగా ఇంటి గడపకు వేసుకునే పసుపుపచ్చ రంగుపై ఇంత అక్కసు ఏమిటని నిలదీస్తున్నారు. ఇదిలాఉండగా, గుంటూరు నగరంలోని స్వామి థియేటర్ సమీపంలో కొంతమంది దివ్యాంగ పేద కళాకారులు మంగళవారం రాత్రి కచేరీ ఏర్పాటు చేసుకున్నారు. మేజర్ చంద్రకాంత్ సినిమాలోని 'పుణ్యభూమి నాదేశం' పాటను ఆలపిస్తుండగా వైసీపీ వీరాభిమానులు వారిపై దాడిచేసి కొట్టారు. మా ప్రాంతంలో ఈ పాటలు పాడతారా అంటూ మైకులు పీకి పారేశారు. దాడిపై ఫిర్యాదు చేసేందుకు పోలీసుస్టేషన్‌కు వెళ్లిన బాధితులకు చుక్కెదురైంది. ఎదురు కేసులు పెడతామని పోలీసులు బెదిరించడంతో తమకు జరిగిన అన్యాయానికి కుమిలిపోతూ ఇంటిబాట పట్టారు. కాగా, దివ్యాంగులపై దాడి చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అర్బన్ ఎస్పీకి విభిన్న ప్రతిభావంతుల సంస్థ ఏపీ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

# పరీక్షల గంట మోగింది

## 4 నుంచి ఇంటర్, 23 నుంచి 10 ఎగ్జామ్స్



- అవసరమైన చోట ఇన్విజిలేటర్లుగా గ్రామ సచివాలయ సిబ్బంది
- హాల్ టికెట్లపై 'క్యూఆర్' కోడ్
- త్వరలో పరీక్షా కేంద్రం 'లొకేషన్' యాప్
- విజయవాడలో కంట్రోల్ రూమ్
- మార్చి తొలివారంలో పరీక్షలపై సదస్సులు
- విద్యా శాఖ మంత్రి సురేశ్ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కీలకమైన పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు ప్రభుత్వం గంట కొట్టింది. మార్చి 4 నుంచి ఇంటర్, అదే నెల 23 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ రెండు పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ తెలిపారు. హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షల్లో అవసరమైన కేంద్రాల్లో ఇన్విజిలేటర్లుగా గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందిని నియమిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. మార్చి 4వ తేదీ నుంచి 23 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, 1,411 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మార్చి 23 నుంచి ఏప్రిల్ 8 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామనారు. పదో తరగతి పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,923 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థులు కింద కూర్చుని పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పరీక్షా సమయంలో స్థానికంగా ఉంటే జిరాక్స్ కేంద్రాలు కూడా మూసివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్విజిలేటర్లను జంబ్లింగ్ విధానంలో కేటాయిస్తామన్నారు. పదోతరగతి పరీక్షల్లో స్వల్ప మార్పులు చేసినందున విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేసేందుకు రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో మార్చి మొదటి వారంలో అవగాహనా సదస్సులు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను వెబ్‌సైట్ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. హాల్‌టికెట్ నెంబర్ మార్చినా పేరు మార్చినా వెంటనే తెలిసిపోతుందన్నారు. పరీక్షా కేంద్రాలు తెలుసుకునేందుకు 'సెంటర్ లోకేషన్' యాప్‌ను సిద్ధం చేశామని, పదో తరగతి, ఇంటర్‌కు ఈ యాప్‌ను వేరు వేరుగా సిద్ధం చేస్తున్నామని వివరించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి రాకముందే యాప్‌లో హాల్‌టికెట్ నెంబర్, పుట్టిన తేదీని ఎంటర్ చేస్తే విద్యార్థి కూర్చునే సీటు వివరాలు తెలుస్తాయన్నారు. కాపీయింగ్ నిరోధానికి సీసీ కెమెరాలు పెడుతున్నట్టు తెలిపారు.

### గ్రేడింగ్‌తోపాటు మార్కులు కూడా

ఇంటర్‌లో గ్రేడింగ్‌తో పాటు మార్కులు కూడా ఇస్తామని మంత్రి సురేశ్ తెలిపారు. దీనివల్ల పొరుగు రాష్ట్రాల్లో చదువుకునేందుకు ఎలాంటి ఇబ్బందులూ ఉండబోవన్నారు. పరీక్షల నిర్వహణకు రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటర్ పరీక్షలకు మార్చి 4 నుంచి, పదో తరగతి పరీక్షలకు 14 తేదీ నుంచి విజయవాడ కేంద్రంగా కంట్రోల్ రూమ్ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో 638 'సీ' సెంటర్లు ఉన్నాయని, ఈ కేంద్రాల్లో పటిష్ఠ తనిఖీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### రెండు పేపర్లున్నా భయం వద్దు

పదో తరగతి పరీక్షల్లో ప్రతి సబ్జెక్టుకు 2 పేపర్లు ఉంటాయని, ఒక్కో పేపర్‌కు 50 మార్కులుంటాయని మంత్రి సురేశ్ తెలిపారు. ఈ రెండు పేపర్లలో పాస్ కావాలనేమీ లేదని, రెండు పేపర్లలో వచ్చిన మార్కులు మొత్తం 35 ఉంటే పాస్ అవుతారని, ఏ ఒక్క పేపర్‌లో 35 మార్కులు వచ్చినా పాసైనట్లేనని, ఈ విషయంలో భయం అవసరం లేదని వివరించారు. ప్రతి పేపర్‌లో పాస్ కావాలనే కావాలని వచ్చే వదంతులను నమ్మవద్దని మంత్రి పేర్కొన్నారు. గతంలో పదో తరగతి జవాబు పత్రం 4 పేజీల్లో ఉండేదని, ఇప్పుడు 24పేజీల బుక్‌లెట్ రూపంలో ఉండనుందన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. నూజివీడు ఐఐఐటీ ఘటనలో కమిటీ వేశామని దీనిపై నివేదిక వచ్చిన తర్వాత చర్యలు చేపడతామని మంత్రి వివరించారు.

**పదో తరగతి పరీక్షల**
**కంట్రోల్ రూం నెంబర్...**

- ల్యాండ్‌లైన్ ఫోన్ 0866-2974540 0866-2974550
- ఈమెయిల్ ఐడీ.... dir_goveexams@yahoo.com& dgepeshi@gmail.com
- ఇంటర్ కంట్రోల్ రూం నెంబర్..

Land Line Number: 08662974130
Toll Free Number : 1800 274 9868
Email Id : ourbieap@gmail.com
Whatsapp Number : 9391282578

# ఎంసెట్ నోటిఫికేషన్ నేడే

- 29 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఆలస్య రుసుంతో ఏప్రిల్ 19 వరకు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్-2020 నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఈనెల 29 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది. ఆలస్య రుసుం లేకుండా మార్చి 29వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ.500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 5వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 10వరకు, రూ.5000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏప్రిల్ 16నుంచి వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రూ.10,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 19వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఎంసెట్- ఇంజనీరింగ్ పరీక్ష ఏప్రిల్ 20, 21, 22, 23 తేదీల్లో జరగనుంది. ఎంసెట్- అగ్రికల్చర్ స్ట్రీమ్ పరీక్ష ఏప్రిల్ 23-24 తేదీల్లో జరగనుంది. రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 22-23తేదీల్లో ఎంసెట్ నిర్వహిస్తారు. ఒక స్ట్రీమ్‌కు రూ.500, రెండు స్ట్రీమ్‌లకు రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈసారి (ఎంసెట్-2020) దరఖాస్తులోనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుకానుందని, అర్హులైనవారు వినియోగించుకోవచ్చని పొందుపరచనున్నారు. ప్రస్తుతం రిజర్వేషన్లు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ కేటగిరీ అభ్యర్థులు మినహా.. అంటే ఓసీ అభ్యర్థులకు నిబంధనల ప్రకారం 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తిస్తుంది.

### 'సెట్స్' నిర్వహణకు 'ఏపీ ఆన్‌లైన్' సేవలు

2017-18 విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షల (సెట్స్)కు ఏపీఆన్‌లైన్-టీసీఎస్ సేవలు వినియోగించుకున్న సర్కారు 2020-21లోనూ వాటి సేవలను వాడుకోనుంది. ఇందులో భాగంగా సెట్స్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తరపున చెల్లించాల్సిన ఫీజులపై ఏపీ ఆన్‌లైన్‌తో రాష్ట్ర ఉన్నత విద్యామండలి తాజాగా సంప్రదింపులు జరిపింది. పరీక్షా కేంద్రాల ఎంపిక, కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహణ, మూల్యాంకనం, మాక్ టెస్ట్ నిర్వహణ, ఆధార్ వెరిఫికేషన్, హాల్‌టికెట్ల జనరేషన్‌తోపాటు పరీక్ష తర్వాత వివిధ ప్రక్రియలు చేపట్టేందుకు గాను ఒక్కో విద్యార్థి తరపున రూ.287(18%జీఎస్టీ కలపకుండా) చెల్లించేలా అవగాహనకు వచ్చారు. 2019-20లో ఇది రూ.305గా ఉంది. అంటే గతేడాదితో పోలిస్తే ఇది రూ.18 తక్కువ. ఉన్నత విద్యామండలి తాజా ప్రతిపాదనను ఆమోదించిన ఉన్నత విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఏపీ ఆన్‌లైన్‌తో - రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంటుంది. ఇందుకయ్యే ఖర్చులను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సమకూర్చనుంది. మరోసారి ఆన్‌లైన్‌లో మల్టిపుల్ సెషన్స్‌లో నిర్వహిస్తున్నందున ప్రశ్నపత్రాల క్లిష్టతను సమానం చేసేందుకు నార్మలైజేషన్ ఫార్ములాను అమలు చేయడం అనివార్యంగా మారింది. సబ్జెక్టులవారీగా ప్రతి సెషన్‌లోనూ పరీక్ష రాసిన అభ్యర్థుల మార్కులు సరాసరి చేస్తూ.. అన్ని సెషన్స్ నార్మల్ స్థాయికి తీసుకువస్తారు. ఫలితంగా ఫలానా సెషన్‌లో ప్రశ్నలు కష్టంగా ఉన్నందున మార్కులు తక్కువ వచ్చాయని, ఫలానా సెషన్‌లో ప్రశ్నలు సులభంగా ఉన్నందున మార్కులు ఎక్కువగా వచ్చాయని అభ్యర్థుల్లో తేడాలు రాకుండా గతేడాది కూడా ఈ ఫార్ములా అమలు చేశారు. ఇది శాస్త్రీయమైన విధానమేనని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఎంసెట్ ర్యాంకుల నిర్ధారణలో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజి ఇవ్వడం ఈసారీ అమలు చేయనున్నారు. ఎంసెట్ మార్కులను 75 శాతం మార్కుల కింద, ఇంటర్ మార్కులను 25 శాతం కింద పరిగణిస్తారు.

# విద్యార్థి వలంటీర్లు!

(మొదటి పేజీ తరువాయి)

అందుకుంటున్నారు. వీరు ఇప్పుడు ఈ పథకం కింద కూడా లబ్ధి పొందడానికి బయోమెట్రిక్‌లో వేలు పెట్టడంతో అసలువిషయం బయటపడింది. ఇప్పటికే వీరంతా వలంటీర్లుగా ఉద్యోగం చేస్తున్నారని తేటతెల్లమైంది. ఈనెల 24నుంచి విద్యాదీవెన, వసతి దీవెన కార్డులు పంపిణీ చేస్తున్నారు. వీటిని తీసుకునే క్రమంలో విద్యార్థులు బయోమెట్రిక్‌లో వేలిముద్రలు వేయాలి. వలంటీర్లుగా నియమితులైన సందర్భంలో వీరి వేలిముద్రలు ఆధార్‌తో లింక్ చేశారు. కార్డు కోసం వేలిముద్ర వేయగానే వీరి మొత్తం వ్యక్తిగత వివరాలు, వలంటీరు అనే విషయంతో సహా తెలిసిపోయింది. నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలో 45మంది విద్యార్థులు వలంటీర్లుగా పని చేస్తున్నట్లు తేలింది. జలదంకి మండలంలో ఇలాంటి వారు పదిమంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు.

### నియామకాల్లో పైరవీలు

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2.5లక్షల మంది వలంటీర్లను నియమించింది. నిబంధనల ప్రకారం నిరుద్యోగులైన విద్యావంతులతో మాత్రమే ఈ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఈ నియమాకాలు పూర్తిగా అధికార పార్టీ నేతల అభీష్టం మేరకే జరిగాయని, అధికారుల పాత్ర నామమాత్రంగా మిగిలిందనే ఆరోపణలొచ్చాయి. పోస్టులన్నీ తమవారికే దక్కాలన్న ఉద్దేశంతో వైసీపీ కార్యకర్తలు, గ్రామ, వార్డు స్థాయి నేతలు తమ పిల్లలు కళాశాలల్లో చదువుతున్నప్పటికీ ఈ ఉద్యోగాల్లో చేర్పించారు. ఇందుకోసం భారీగా పైరవీలు చేసుకున్నారు. బయటివారికి అవకాశమివ్వకుండా తమ పిల్లల్నే వలంటీర్లుగా నియమించుకునేలా పావులు కదిపారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. దీంతో పలుచోట్ల విద్యార్థులను వలంటీర్ల పోస్టుల నుంచి తొలగించారు. అయినా కొన్నిచోట్ల ఇంకా విద్యార్థులు పదవుల్లో కొనసాగుతూనే ఉన్నారు. నెల్లూరు జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో వైసీపీ గ్రామస్థాయి నేత... సీఏ చదువుతున్న తన కుమార్తెను వలంటీరుగా నియమించుకున్నారు. ఆమె నగరంలో చదువుతుంటే ఆయనే ఆ బాధ్యతలు నిర్వర్తించారు. అయితే వలంటీరుగా విద్యార్థిని నియమించారని ఆమెకు కేటాయించిన కుటుంబాలు స్థానిక ఎంపీడీఓకు ఫిర్యాదు చేశాయి. దీంతో సదరు నేత తన కూతురుతో రాజీనామా చేయించి ఆ స్థానంలో ఇంజనీరింగ్ చదువుతున్న కొడుకును నియమించుకున్నారు. ఇప్పుడు కూడా కొడుకు ఉద్యోగాన్ని ఆయనే బినామీగా చేస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల బినామీ వలంటీర్లు పని చేస్తున్నారని చెబుతున్నారు.

# మీ ఇష్టం కుదరదు

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశ పెట్టాలని భావించిన సీఎం జగన్ నిర్ణయానికి యూజీసీ, ఏఐసీటీఈలు బ్రేకులు వేసినట్టయింది. జాతీయ విద్యా విధానానికి లోబడి కోర్సుల కాల వ్యవధి ఉండాలని, సాధారణ కోర్సులా, ఆనర్స్ కోర్సులా అనే దానికి వేర్వేరు ఆప్షన్లు ఉంటాయని స్పష్టం చేసింది. జాతీయ విద్యా విధానం అమలు, కొత్త నియమాలు అమల్లోకి వచ్చే వరకు రాష్ట్రంలో పాత విధానంలోనే మూడేళ్ల డిగ్రీ, నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులు అమల్లో ఉండనున్నాయి.

### సమూల మార్పు వల్లేనా?

బీఎస్సీ, బీకాం, బీఏ వంటి సాధారణ కోర్సులతో పాటు ఇంజనీరింగ్‌నూ మరో ఏడాది అదనంగా చదవడం తప్పనిసరి చేస్తున్నట్లు గత ఏడాది డిసెంబరులో సీఎం జగన్ స్వయంగా ప్రకటించారు. చివరి ఏడాది పూర్తిగా ప్రాక్టికల్స్ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడేళ్ల వ్యవధితో డిగ్రీ కోర్సులను కళాశాలలు, విద్యా సంస్థలు నిర్వహిస్తున్నాయి. కొన్ని కాలేజీలు మాత్రం 'ఆనర్స్' పేరిట నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను అందిస్తున్నాయి. యూజీసీ కూడా దేశ వ్యాప్తంగా నాలుగు సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ కోర్సులకు గుర్తింపు ఇస్తుంది. ఇది ఇప్పటి వరకు అమల్లో ఉన్న విధానమే. అయితే, రాష్ట్రంలో సంప్రదాయ మూడేళ్ల డిగ్రీ కోర్సులన్నింటినీ ఇకపై నాలుగేళ్ల కోర్సులుగా, నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులను ఐదేళ్ల కోర్సులుగా మార్చి అమలు చేయాలని సీఎం జగన్ స్పష్టం చేయడంతో.. యూజీసీ, ఏఐసీటీఈలు విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.

### ప్రభుత్వ ఉద్దేశం ఇదీ

రాష్ట్రంలో ఏటా 1.25లక్షల మంది విద్యార్థులు మూడేళ్ల డిగ్రీ పూర్తి చేస్తున్నా, 5వేల మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయి. మిగిలిన వారు ఖాళీగా ఉంటున్నారు. ఈ పరిస్థితి మారాలంటే చదువు పూర్తి కాగానే ఉద్యోగం లభించేలా తగిన ప్రాక్టికల్స్ తప్పనిసరని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలోనే మూడేళ్ల డిగ్రీ కోర్సులను ఇకపై నాలుగేళ్లకు, ఇంజనీరింగ్ కోర్సులను ఐదేళ్లకు మార్చాలని భావించింది. ఈ విధానాన్ని వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. అనుమతి కోరుతూ యూజీసీ, ఏఐసీటీఈలకు ఉన్నత విద్యామండలి లేఖ రాసింది. తాజాగా ఢిల్లీ వెళ్లిన మండలి అధికారులకు యూజీసీ, ఏఐసీటీఈ ఉన్నతాధికారులు ఆయా కోర్సుల్లో ఎలాంటి మార్పులూ చేయడానికి వీల్లేదని, మీ ఇష్టం కుదరదని తేల్చి చెప్పారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు ఉన్న విధానమే కొనసాగనుంది.

# గజం.. 2.50 లక్షలు!

- పాలకొల్లులో ఆల్ టైమ్ రికార్డు

పాలకొల్లు, ఫిబ్రవరి 26: కాస్త డిమాండ్ ఉన్న చోట గజం స్థలం ఎంత ఉంటుంది. రూ.30 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉంటుంది. పట్టణాల్లో లక్ష వరకూ ఉండొచ్చు. వ్యాపార సముదాయాలకు మంచి సెంటర్ అయితే రూ.లక్షకుపైగా పలికినా ఆశ్చర్యం లేదు. కానీ.. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో గజం ధర రూ.2.50 లక్షలు పలికి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. పాలకొల్లు పట్టణ ప్రధాన రహదారి క్షీర రామలింగేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోని భూమికి రికార్డు స్థాయిలో ధర లభించింది. పట్టణంలో గజం రూ.32-40 వేల మధ్యలో ఉంది. కానీ ఓ వ్యక్తి ఎవరూ ఊహించని విధంగా గజానికి రూ.2.50 లక్షలు పెట్టారు. సాధారణంగా ఇంత భారీ ధర పెట్టేవారు ఓ 50 గజాలలోపు కొనుగోలు చేస్తారు. కానీ రెండు ప్రతులుగా 200 గజాలకుపైగా కొన్న ఆ వ్యక్తి.. ఒక భాగంలో గజానికి రూ.1.75 లక్షలు చెల్లించగా.. మరో భాగంలో గజానికి రూ.2.50 లక్షలు పెట్టారు. మహాత్మాగాంధీ రోడ్డుగా పిలిచే ఈ రహదారి వెంబడే ఉన్న స్థలాలు పెద్ద నోట్ల రద్దుకు ముందు గరిష్ఠంగా గజం ధర రూ.1.25 లక్షలు పలికింది.

## '1999 గ్రూప్-2' కేసులో..
# మా తీర్పును ఎలా అమలుచేశారు?

- ఏపీ, తెలంగాణలకు సుప్రీంకోర్టు ప్రశ్న
- మార్చి 3లోగా తమకు వివరించాలని ఆదేశం
- లేకపోతే జేఏడీ సెక్రటరీలను రప్పిస్తామని హెచ్చరిక

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2(1999) ఉద్యోగాలకు సంబంధించిన కేసులో.. గతంలో ఇచ్చిన తీర్పు అమలుకు తీసుకున్న చర్యలేమిటని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఆ తీర్పును ఎలా అమలు చేశారో తమకు వివరించాలని పేర్కొంది. ఆయా అంశాలను వివరించేందుకు అనుభవజ్ఞుడైన అధికారిని తమ వద్దకు పంపాలని ఆదేశించింది. మార్చి 3వ తేదీ కంటే ముందే ఈ వివరాలన్నీ తమకు తెలపాలని, ఒకవేళ అధికారిని పంపించకపోతే అదే రోజు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల జీఏడీ కార్యదర్శులు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వులను అమలుచేయకుంటే సీరియస్‌గా తీసుకుంటామని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. 1999 గ్రూప్-2 నోటిఫికేషన్‌కు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో పలు దఫాలుగా నియామకాలు జరిగాయి. వీటిపై పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2015లో కోర్టు తీర్పు ఇచ్చింది. కామన్ మెరిట్ లిస్టు రూపొందించాలని పేర్కొంది. అయితే ఈ తీర్పు అమల్లో ఆ తర్వాత అనేక లోపాలు ఎదురయ్యారు. ప్రభుత్వాలు కూడా కొన్ని శాఖల్లో ఈ తీర్పును అమలుచేయగా.. మరికొన్ని శాఖల్లో అమలు చేయలేదు. అదేవిధంగా ఒకే శాఖలో కొందరు ఉద్యోగులకు అమలుచేయగా, మరికొందరికి అమలు చేయలేదు. మరోవైపు సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు శాఖలు మారిన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వలేదు. కొందరికి ఇంకా పోస్టింగులు కూడా ఇవ్వాల్సి ఉంది. ఇదే విషయంపై ఉద్యోగులు పలుమార్లు జీఏడీ ఉన్నతాధికారులను కలిసి నిబంధనలను వివరించారు. అయినా వీటిపై అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోలేదు. దీంతో కొందరు ఉద్యోగులు కోర్టు ధిక్కార పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీంకోర్టు తాజాగా తీర్పు అమలుపై తీసుకున్న చర్యలను చెప్పాలంటూ ఇరు ప్రభుత్వాలను ఆదేశించింది.

## చైనా నుంచి నేడు ఢిల్లీకి అన్నెం జ్యోతి

మహానంది, ఫిబ్రవరి 26: కరోనా వైరస్ వెలుగు చూసిన చైనాలోని వూహాన్ నగరంలో చిక్కుకున్న కర్నూలు యువతి అన్నెం జ్యోతి ఎట్టకేలకు స్వదేశానికి రానుంది. కర్నూలు జిల్లా కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన జ్యోతి గురువారం భారత్‌కు రానుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నెం జ్యోతికి ఆరు నెలల క్రితం తిరుపతి టీసీఈఎల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అయితే శిక్షణలో భాగంగా ఇటీవల ఆమె చైనా వెళ్లింది. కొవిడ్-19 వైరస్ వ్యాప్తిచెందడంతో ఆమెను అక్కడి అధికారులు అక్కడే ఉంచారు. బుధవారం భారత్ నుంచి చైనా వెళ్లిన ప్రత్యేక విమానంలో జ్యోతిని గురువారం ఢిల్లీకి తీసుకొస్తున్నారు. ఢిల్లీలో 15 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉండి తిరిగి స్వగ్రామానికి వస్తుందన్నారు. చైనాలో చిక్కుకుపోవడంతో వాయిదా పడిన పెళ్లిని ఇప్పుడు చేయడానికి పెద్దలు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

## లోకం తీరు




## ఉష్ణోగ్రతలు

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 20.4 | 33.7 |
| విశాఖపట్నం | 21.2 | 31.0 |
| కడప | 22.0 | 38.0 |
| కర్నూలు | 23.3 | 35.3 |
| ఒంగోలు | 23.7 | 32.3 |
| విజయవాడ | 23.8 | 33.8 |
| నెల్లూరు | 24.5 | 33.0 |
| శ్రీకాకుళం | 28.0 | 36.0 |
| హైదరాబాద్ | 21.0 | 34.2 |



### ఆ క్రేన్ నా మీద పడినా బాగుండేది

ఎంతో దుఃఖంతో ఈ ట్వీట్ చేస్తున్నాను. షాక్‌లో ఉన్నాను. నిద్ర లేని రాత్రులు గడుపుతున్నాను. క్రేన్ ప్రమాదంలో అసిస్టెంట్ డైరెక్టర్, సిబ్బందిని కోల్పోవడం కలచివేస్తోంది. నేను త్రుటిలో తప్పించుకున్నాను. ఆ క్రేన్ నా మీదే పడి ఉంటే బాగుండేదనిపిస్తోంది. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

*- సినీ దర్శకుడు శంకర్*



### దేశ రక్షణ కోసం సరిహద్దులు దాటేందుకు బలగాలు సంకోచించవు

దేశాన్ని రక్షించేందుకు ఇప్పుడు మన బలగాలు సరిహద్దులు దాటేందుకు ఏమాత్రం సంకోచించవు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విధానంలో గొప్ప మార్పు తెచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోదీజీకి నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

*- రాజ్‌నాథ్ సింగ్, రక్షణ మంత్రి*



### భారత్‌లో ముస్లింలపై దాడులు.. ప్రపంచం స్పందించాలి

భారత్‌లో 20 కోట్ల మంది ముస్లింలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయి. జాత్యహంకారంతో కూడిన విద్వేషం చెలరేగిన చోట రక్తపాతం జరుగుతుంది. దీనిపై ప్రపంచం స్పందించాలి. పాకిస్థాన్‌లో మైనారిటీలపై, వారి నివాసాలపై, ప్రార్థనా స్థలాలపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మా దేశంలో ప్రజలందరికీ సమాన హక్కులుంటాయి.

*- ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ ప్రధాని*

### పచ్చని చెట్ల మధ్య 10 నిమిషాలుంటే ఒత్తిడి దూరం

న్యూయార్క్, ఫిబ్రవరి 26: రోజూ ఓ 10 నిమిషాలు ప్రకృతిలో గడపడం వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. తద్వారా వారు తమ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు. తమ పరిశోధనల్లో భాగంగా అమెరికా శాస్త్రవేత్తలు 15-30 సంవత్సరాల వయస్సున్న కొంత మందిని కొంతసేపు పార్కుల్లో గడిపేలా చూశారు. దీంతో వారిలో అంతకుముందుతో పోల్చితే మానసికంగా సానుకూల మార్పు కనిపించింది.

### గుండె సమస్యలను ముందే గుర్తించే సెన్సర్

న్యూయార్క్, ఫిబ్రవరి 26: గుండె సమస్యలను ముందుగానే గుర్తించి హెచ్చరించే సెన్సర్ తొడుగులను అమెరికా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇవి కృత్రిమ మేధ సహాయంతో పనిచేస్తాయి. హృద్రోగులు వీటిని తమ ఛాతిపైన ధరిస్తే అవి నిరంతరం గుండె కొట్టుకొనే తీరును పరిశీలిస్తూ విశ్లేషిస్తాయి. ఏదైన సమస్య ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు సమాచారాన్ని పంపిస్తాయి. శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో భాగంగా 100 మంది హృద్రోగులను ఎంచుకుని ఈ సెన్సర్లతో మూడు నెలల పాటు పరిశోధనలు నిర్వహించారు.



## ఆదిత్యకు రూ.1.30 లక్షల ఆర్థికసాయం

▸ స్పందించిన దాతలు

విజయవాడ (భవానీపురం), ఫిబ్రవరి 26: గుండెమార్పిడి శస్త్ర చికిత్స నిమిత్తం సాయం కోసం ఎదురుచూస్తున్న బాలుడు ఆదిత్య దుర్గాసాయి దీనస్థితిపై దాతలు స్పందించారు. రెండురోజుల్లో రూ.1.30లక్షల ఆర్థికసాయం దాతలు బ్యాంకుఖాతాకు జమచేశారని బాలుడి తల్లి ఉమాదేవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. తమ కుమారుడు ఆదిత్య పరిస్థితిని వివరిస్తూ ఈనెల 25న ఆంధ్రజ్యోతి మెయిన్ ఎడిషన్‌లో 'చిట్టి గుండెను కాపాడరూ' శీర్షికన వచ్చిన కథనానికి దాతలు స్పందిస్తున్నారని ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. కుమారుని ఆపరేషన్‌కు ముందస్తుగా రూ.5లక్షల డిపాజిట్ చేయాల్సి ఉందని, దాని కోసం తాము శ్రమిస్తున్నా తమ వలన కావడం లేదని దాతలు మరింత మంది ముందుకు రావాలని కోరారు. దాతలు అకౌంట్ నెంబర్ 33448953370 ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్..0010782కు జమ చేయాలని ఆమె కోరారు. ఫోన్ నెంబర్ 9299206984లో సంప్రదించవచ్చునని ఉమాదేవి తెలిపారు.

## 'పోషణ్'లో ఏపీ నంబర్ వన్!

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): పోషణ్ అభియాన్ కార్యక్రమం అమల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచినట్లు మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. నీతి ఆయోగ్ వార్షిక నివేదిక ఈ విషయం స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పరిపాలన-వ్యవస్థాగత యంత్రాంగం, సేవలు అందించడం, సామర్థ్యాలు పెంపొందించుకోవడం, వ్యూహం-ప్రణాళిక, కార్యక్రమాల అమలు వంటి నాలుగు అంశాలు ప్రాతిపదికగా ఆంధ్రప్రదేశ్ పెద్ద రాష్ట్రాల జాబితాలో ప్రథమ స్థానాన్ని సంపాదించుకోగా, చిన్న రాష్ట్రాల్లో మిజోరం, కేంద్రపాలిత ప్రాంతాల జాబితాల్లో నాగర్‌హవేలి ప్రథమ ర్యాంకు దక్కించుకుందని వెల్లడించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహార ప్రాధాన్యం తెలియజేయడం, ఆ దిశగా ఆహారం తీసుకునేలా అలవాటు చేయడం, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఏ ఆహారం ఎంత మేరకు అవసరమో తెలియజేయడం, పోషకాహారాల్లో ఏ తరహా శక్తి ఎంత మేర ఉంటుందో సమగ్రంగా అవగాహన కల్పించడం ముఖ్యోద్దేశంగా పోషణ్ అభియాన్ పథకం పనిచేస్తుందని కృతికా శుక్లా వివరించారు. ప్రతి నెలా అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్ల సామర్థ్యాలను మెరుగుపరచడానికి శిక్షణ ఇస్తున్నామని, ఫలితంగానే జాతీయ స్థాయిలో గుర్తింపును పొందగలిగామని కృతికా శుక్లా తెలిపారు.

## పెట్టుబడులు, మౌలిక సదుపాయాలకు మళ్లీ ప్రత్యేక శాఖ

పెట్టుబడులు, మౌలిక సదుపాయాలకు మళ్లీ ప్రత్యేక శాఖను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ శాఖ గతంలో విడిగా ఉండగా.. ఇటీవల కాలంలోనే పరిశ్రమలు, వాణిజ్య శాఖలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కరికాల వలవన్ బాధ్యతలు నిర్వర్తిస్తారని, ఇతర సిబ్బంది ఉంటారని బుధవారం తెలిపింది.

## పట్టణాల్లో నైట్ షెల్టర్లు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ నిరాశ్రయులు రాత్రి వేళల్లో తల దాచుకునేందుకు వీలుగా బస్టాండ్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తాత్కాలిక వసతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని అర్బన్ నైట్ షెల్టర్ల రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీ చైర్మన్ జేసీ శర్మ సూచించారు. ఈ షెల్టర్లలో నిర్వహించే వైద్య శిబిరాలు, ఇతర కార్యక్రమాల్లో ఆయా జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను భాగస్వాములను చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. సచివాలయంలో బుధవారం జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

# మాట బంద్‌పై మంట!

## ఎండీ తీరుపై కార్మికులు భగ్గు.. విలీనం చేస్తే హక్కులుండవా?

▸ రైల్వేలో ఇలాంటి కట్టడి ఉందా?
▸ బస్టాండ్‌లోకి ప్రైవేట్ బస్సులా?
▸ వైరి సంఘాలూ ఒకే వేదికపైకి
▸ యాజమాన్యం వైఖరిపై చర్చలు
▸ వేధింపులపై తాడోపేడోకి సిద్ధం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజానీకానికి అతితక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణం అందిస్తున్న ప్రజా రవాణా శాఖ (పీటీడీ)లో ముసలం మొదలవుతోంది. ఎంటీడబ్ల్యూ, ఫ్యాక్టరీస్ యాక్ట్ కింద పనిచేస్తున్న కార్మికులు బహిరంగంగా మాట్లాడటానికి వీల్లేదంటూ ఇటీవల ఎండీ మాదిరెడ్డి ప్రతాప్ హుకుం జారీ చేయడం కార్మికుల్లో మంట పుట్టించింది. "మీరు ప్రభుత్వ సిబ్బంది. నా నిర్ణయాలను బహిరంగంగా ప్రశ్నిస్తే వేటు వేస్తా.. జాగ్రత్త' అని ఆయన హెచ్చరించడం, ఆ వెంటనే అధికారులు సర్క్యులర్ కూడా జారీ చేయడంతో తాడోపేడో తేల్చుకోవడానికి వారంతా సిద్ధం అవుతున్నారు. ప్రధాన ప్రత్యర్థులైన ఈయూ - ఎన్ఎంయూ సైతం ఈ విషయంలో ఏకమవుతున్నట్లు కనిపిస్తోంది. గుర్తింపు సంఘమైన ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరరావు మరో పెద్ద సంఘమైన ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావుతో ఇటీవల విశాఖలో భేటీ అయ్యారు. ప్రభుత్వంలో విలీనం పేరుతో కిందిస్థాయి సిబ్బందిని అధికారులు వేధింపులకు గురిచేస్తున్న అంశంతోపాటు ప్రైవేటు వాహనాలను బస్టాండ్లలోకి అనుమతించాలన్న యాజమాన్యం నిర్ణయాలపైనా వారి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. సంస్థ ఉనికి కోసం అన్ని సంఘాలు ఏకమై పోరాడాల్సిన ఆవశ్యకత ఉన్నదని దామోదర్ వివరించడంతో, సమ్మతించిన శ్రీనివాసరావు తమ యూనియన్ నేతలతో అంతర్గతంగా చర్చిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎనిమిది సంఘాలతో ఏర్పడిన జేఏసీలోకి ఎన్ఎంయూ చేరితే కార్మికులందరూ ఏకతాటిపైకి వచ్చినట్లే!

### సర్కారు అలా.. మేనేజ్‌మెంట్ ఇలా..

సంస్థలో గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై సిబ్బంది భిన్న వ్యాఖ్యలు చేస్తున్నారు. ఆర్టీసీని పీటీడీగా మార్చిన ప్రభుత్వం తమ ఉద్యోగ భద్రతకు, సంస్థ ఉనికికి భరోసా కల్పిస్తే, యాజమాన్యం మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోందంటూ కార్మికులు మండిపడుతున్నారు. ప్రభుత్వంలో విలీనం చేశామంటూనే, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించకుండా దశాబ్దాలుగా ఉన్న ట్రేడ్ యూనియన్ హక్కులను హరిస్తామంటే ఎలా ఊరుకుంటామని నిలదీస్తున్నారు. రైల్వేలో సంఘాలు లేవా? వాళ్లకు ట్రేడ్ యూనియన్ హక్కులు లేవా? అంటూ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నేతలు సుందరయ్య, జిలానీ ప్రశ్నిస్తున్నారు. మార్చి మొదటివారం నుంచి ఉమ్మడి కార్యాచరణకు నడుం బిగిస్తున్న కార్మికులు... పీటీడీలో ఈ పరిస్థితికి పలు కారణాలు చెబుతున్నారు. గత ఏడాది మే లో ఏర్పాటైన వైసీపీ ప్రభుత్వం ఆర్టీసీకి చికిత్స చేసే ప్రయత్నాలు మొదలెట్టింది. సంస్థ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసి ఏటా రూ.3 వేల కోట్లు జీతాలిస్తే ఆ మొత్తం కార్పొరేషన్‌కు మిగులుతుందని, ఆ సొమ్ముతో అప్పులు తీర్చుకొంటూ కొత్త బస్సులు కొనుగోలు చేసి నష్టాల నుంచి గట్టెక్కుతుందని భావించింది. కొత్త బస్సులు కొనుగోలు చేసి సిబ్బందితో పని చేయించి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాల్సిన ఉన్నతాధికారులు.. అందుకు భిన్నంగా ప్రైవేటును ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారు. ప్రైవేటు విద్యాసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించిన ఎండీ వాళ్ల బస్సులను ఆర్టీసీ బస్టాండ్లలోకి ఆహ్వానిస్తామన్నారు. ఈ నిర్ణయాన్ని పీటీడీ సిబ్బంది, అధికారులు మంత్రి పేర్ని నాని దృష్టికి తీసుకెళ్లారు. ఆర్టీసీ బస్టాండ్లలోకి ప్రైవేటు బస్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ రాబోవని మంత్రి భరోసా ఇచ్చారు.

## ఈఆర్‌సీలో ఇద్దరు సభ్యుల ప్రమాణ స్వీకారం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలిలో సభ్యులుగా నియమితులైన ఇద్దరు సభ్యులు పి.రాజగోపాల్ రెడ్డి, ఠాకూర్ రమాసింగ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని ఈఆర్‌సి కార్యాలయంలో చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి వారితో ప్రమాణం చేయించారు.



జస్టిస్ నాగార్జున రెడ్డితో రాజగోపాల్ రెడ్డి, ఠాకూర్


**APGVB ANDHRA PRADESH GRAMEENA VIKAS BANK**
**Head office :: Warangal**

**NOTICE INVITING TENDERS**

REFILLING, SUPPLY, INSTALLATION, TESTING AND COMMISSIONING OF FIRE EXTINGUISHERS
(Refer Tender Notice No. 31, Dated: 27/02/2020).

We invite sealed Tenders for REFILLING, SUPPLY, INSTALLATION, TESTING AND COMMISSIONING OF FIRE EXTINGUISHERS ALL OVER APGVB. For details, see tender documents placed in our Banks' website: www.apgvbank.in. The last date of submission of tender is 23/03/2020 at HO, Warangal.

General Manager (I)



**VIJAYAWADA MUNICIPAL CORPORATION**
**'e' PROCUREMENT TENDER NOTICE**

No. Rc. EE3/103713/2020 Dt. 26-02-2020

| Sl. No. | Name of the Work | Estimate Amount (in Lakhs) |
|---|---|---|
| 1 | Providing UGD, HDPE Water Supply distribution Lines, Paintings to Center Dividers, BT Road, Drains and Ground leveling, Construction of First Floor Buildings and Restoration of UGD pipe line trench in Works Division-III area (General Funds -12 No's and Govr Grant - 2 No's) | 215.71 |

Note :
1. Only online Payment towards EMD will be allowed, DDs / POs/ BCs / BGs will not be allowed.
2. All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without any reasons (As per G.O.Ms.No. 94, Dt. 01-07-2003 I & CAD)

E.E-III. concerned : Bobba Venkateswara Rao Complex, Municipal Corporation, Circle-III, Patamata, Vijayawada - 520008. (Cell No. 98665 14163)
Further details can be seen @ 'e'procurement market place @ www.tender. apeprocurement.gov.in
Download of bid documents starts from 29-02-2020 at 10.30 A.M.
Last date / time for receipt of tender's 07-03-2020 upto 15-00 hours

Sd/- Y.V. KOTESWARA RAO, for Commissioner


# అర్చక పోస్టుకు అరకోటి!

## మాచవరం దాసాంజనేయుడి గుడిలో పైరవీల జోరు

▸ కుమారుడికి పదవి కోసం అర్చకుడి తీవ్ర ప్రయత్నాలు
▸ తనయుడి పేరుతో తప్పుడు సర్టిఫికెట్ సృష్టించిన వైనం
▸ అధికార పార్టీ నేతలకు ముడుపులిచ్చినట్లు ఆరోపణలు
▸ దేవదాయ అధికారులపై ఇద్దరు కీలక నాయకుల ఒత్తిళ్లు



మాచవరంలోని దాసాంజనేయస్వామి దేవస్థానం

విజయవాడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అర్చకుడి పోస్టుకు రూ.అరకోటి చేతులు మారింది. భారీగా ముడుపులు స్వీకరించిన అధికార పార్టీ నేతలు... తాము సూచించిన వ్యక్తికే ఆ పోస్టు ఇవ్వాలని దేవదాయశాఖ అధికారులను ఒత్తిడి చేస్తున్నారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఎవరు కొత్త వాహనం కొనుగోలు చేసినా విజయవాడ మాచవరంలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో తొలిపూజ చేయించుకోవాలని భావిస్తారు. ఈ ఆలయానికి అంతటి విశిష్టత ఉంది. ప్రతినెలా హుండీ ద్వారా సుమారు రూ.4లక్షలకు పైగా, టికెట్ల ద్వారా మరో రూ.4లక్షల వరకు ఆదాయం అధికారికంగా సమకూరుతోంది. ఇక అనధికారికంగా (ప్లేట్ కలెక్షన్) ద్వారా నెలకు మరో రూ.3లక్షల వరకు వస్తుందని అంచనా. ఇదంతా అర్చకులే పంచుకుంటారు. ఈ కారణంగా ఇక్కడ అర్చకులుగా నియమితులయ్యేందుకు తీవ్రమైన పోటీ ఉంది. ప్రస్తుతం ఆలయంలో శాశ్వత నియామకం కింద ముగ్గురు, తాత్కాలిక ప్రాతిపదికన మరో ఇద్దరు అర్చకులు పనిచేస్తున్నారు. ఈ ఆలయంలో రెండు అర్చక పోస్టులకు ఒక పరిచారిక పోస్టుకు దేవదాయశాఖ 2018లో నోటిఫికేషన్ ఇవ్వగా 13 దరఖాస్తులు వచ్చాయి. అర్చక పోస్టుకు శ్రీపాంచరాత్ర ఆగమం పూర్తిచేసి ఉండటం అర్హతగా నిర్ణయించారు. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి అర్చక పోస్టులో తన వారసుడిని నియమింపజేసేందుకు ఆలయంలో పనిచేసే అర్చకుడు ఒకరు తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు.

### అర్హత లేకున్నా..

ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న వ్యక్తి కుమారుడు దేవదాయశాఖ నిర్దేశించిన శ్రీపాంచరాత్ర ఆగమం పరీక్షను పూర్తి చేయలేదు. అయితే అదే అర్హతను తలపించేలా పంచరత్న ఆగమం పరీక్ష పూర్తి చేసినట్టు ఓ సర్టిఫికెట్ పుట్టించిన సదరు అర్చకుడు... కుమారుడికి అన్ని అర్హతలు ఉన్నాయని అధికారులను పక్కదారి పట్టిస్తున్నారు. ఆయనపై ఆది నుంచీ పలు ఆరోపణలు ఉన్నాయి. వాహనపూజలు చేయించుకునే భక్తుల నుంచి ముక్కుపిండి మరీ డబ్బు వసూలు చేస్తారని మాజీ కార్పొరేటరు కంచర్ల శేషారాణి, సహేరా బానుతో పాటు మాజీ ఎమ్మెల్యే బొండా ఉమ కూడా దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదుచేశారు. అప్పట్లో విచారణ జరిపిన అధికారులు సదరు అర్చకుడిని సస్పెండ్ చేయాలని నివేదికలు ఇచ్చినా అమలు కాకుండా ఉన్నతాధికారులను మేనేజ్ చేశాడన్న ఆరోపణలున్నాయి. తొలుత తాత్కాలిక ఉద్యోగిగా చేరిన ఆ అర్చకుడు పరిచారికుడిగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం అదే హోదాలో ఉన్నా అర్చకుడిగా చలామణి అవుతున్నారు. ఉద్యోగంలో చేరిన రెండేళ్లకే హుండీలో దొంగతనం చేస్తూ పట్టుబడి ఒకసారి, సిబ్బందిని కుల దూషణ చేసినందుకు 2015లో మరోసారి సస్పెండ్ అయ్యారు. ఈయన ఆస్తులపై గతంలో ట్రస్టు బోర్డు సభ్యులే ఏసీబీకి ఫిర్యాదు చేసిన ఉదంతాలు ఉన్నాయి. అలాంటి వ్యక్తి ప్రస్తుతం తన కొడుకును అర్చకుడిగా నియమింపజేసుకొనేందుకు రూ.అరకోటి వరకూ ముడుపులు ఇవ్వడం చర్చనీయాంశమైంది.

## 5న గీశాట్-1 ప్రయోగం

▸ జీఎస్ఎల్వీ ద్వారా నింగిలోకి
▸ షార్‌లో సిద్ధమైన ఎఫ్10 రాకెట్

శ్రీహరికోట (సూళ్లూరుపేట), ఫిబ్రవరి 26: భూ పరిశీలన కోసం తొలిసారిగా అత్యాధునిక జియో ఇమేజింగ్ శాటిలైట్ (గీశాట్-1)ను ప్రయోగించేందుకు ఇస్రో సిద్ధమైంది. మార్చి 5న సాయంత్రం 5.43 గంటలకు జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నట్టు ఇస్రో ప్రకటించింది. ఇందుకోసం షార్‌లోని రెండో ప్రయోగవేదికకు చెందిన వాహన అనుసంధాన భవనంలో ఉపగ్రహంతో సహ జీఎస్ఎల్వీ-ఎఫ్10 రాకెట్ అనుసంధానాన్ని పూర్తి చేశారు. రాకెట్‌ను రెండో ప్రయోగవేదిక వద్దకు తరలించి అక్కడి ఉబ్లికల్ టవర్‌కు అనుసంధానించి తుది తనిఖీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాకెట్ ప్రయోగ రిహార్సల్స్ నిర్వహించిన తదుపరి మిషన్ రెడినెస్ రివ్యూ, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశాలు జరగనున్నాయి. అనంతరం కౌంట్‌డౌన్ ప్రారంభిస్తారు.

### తొలిసారిగా భూస్థిరకక్ష్యలోకి..

భూ పరిశీలన ఉపగ్రహాలైన రిమోట్ ఫెన్సింగ్ శాటిలైట్‌ను ఇప్పటి వరకు సూర్యానువర్తన కక్ష్యలోకి చేరవేసి ఇస్రో ఉపయోగిస్తోంది. సమాచార ఉపగ్రహాలను భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్య (జీయోస్టేషనరీ ఆర్బిట్)లోకి ప్రవేశపెడుతున్నారు. అయితే ఈ సారి ఇస్రో అత్యాధునిక భూపరిశీలన ఉపగ్రహం గీశాట్-1ని భూస్థిరకక్ష్యలోకి చేరవేయనుంది. అందుకే ఈ భూపరిశీలన ఉపగ్రహానికి జియో ఇమేజింగ్ శాటిలైట్‌గా నామకరణం చేశారు. ఈ ఉపగ్రహం భారత ఉపఖండాన్ని నిరంతరం పరిశీలిస్తూ వాస్తవ సమయాన్ని సైతం తెలపనుంది. ఈ ఉపగ్రహం రక్షణ రంగానికి ఉపయోగపడనుంది.

## శాప్ బోర్డు సభ్యుల రాజీనామా ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో.. శాప్ బోర్డు సభ్యులుగా ఉన్న బి.శ్రీధర్ వర్మ, ఇ.వేణుగోపాలరాయుడు, జె.వెంకట రమణరెడ్డి, నీలంశెట్టి లక్ష్మి, ఇ.రజనీ, పి.రవీంద్రనాథ్ ఇటీవల రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించినట్లు క్రీడాశాఖ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.






# స్థానిక సమరమా.. బడ్జెట్ భేటీనా?

▸ రిజర్వేషన్లపై తీర్పు రెండ్రోజుల్లో రావచ్చు!
▸ రాకుంటే 6 నుంచి బడ్జెట్ సమావేశాలు
▸ 14 రోజులు నిర్వహించాలని యోచన
▸ సజ్జల, మంత్రి అనిల్, చీఫ్‌విప్, విప్‌ల భేటీ

**అసెంబ్లీ సమావేశాలపై తర్జన భర్జన**

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల సమరానికి వెళ్లడమా.. లేక శాసనసభ బడ్జెట్ సమావేశాలను నిర్వహించడమా? జగన్ ప్రభుత్వం ప్రస్తుతం ఈ మీమాంసలో పడింది. మార్చి నెలాఖరులోగా బడ్జెట్ సమావేశాలను ముగించాల్సి ఉంది. మార్చి 31లోపు ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందకపోతే.. 2020-21 వార్షిక బడ్జెట్‌కు అవరోధం కలుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుంది. సంక్షేమ, అభివృద్ధి పథకాలకు నిధులు విడుదల కావు. ఫలితంగా ఆర్థిక సంక్షోభం నెలకొంటుంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలను 2020 మార్చి 15లోగా పూర్తి చేయాల్సి ఉంది. లేదంటే ఆర్థిక సంఘం నిధులు రూ.3,200 కోట్లను కేంద్రం విడుదల చేయదు. స్థానిక ఎన్నికలకు సంబంధించిన తీర్పును హైకోర్టు వెంటనే వెలువరిస్తుందని.. ఫిబ్రవరి 20వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం భావించింది. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ.. తర్వాత మునిసిపల్ ఎన్నికలు.. చివరిగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిద్దామని సీఎం జగన్ కూడా కేబినెట్ భేటీలో చెప్పారు. మార్చి 15 తర్వాత బడ్జెట్ సమావేశాలు పెడదామని అన్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని.. దాదాపు 20 రోజుల పాటు కోలాహలం ఉంటుందని భావించాయి. కానీ స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు వాయిదాపడింది.

### వ్యూహకర్తల మంతనాలు..

వాస్తవానికి మార్చి 2న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ప్రచారం జరిగింది. అయితే హైకోర్టు తీర్పు కోసం రెండ్రోజులు వేచిచూడాలని ప్రభుత్వ వ్యూహకర్తలు నిర్ణయించినట్లు తెలిసింది. బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలోని వైసీపీ శాసనసభాపక్ష కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, జల వనరుల మంత్రి పి.అనిల్ కుమార్, ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంతరెడ్డి, ప్రభుత్వ విప్‌లు జోగి రమేశ్, మల్లాది విష్ణు తదితరులు సమావేశమయ్యారు. ఆరో తేదీ నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభిద్దామని ఈ సందర్భంగా అనుకున్నట్లు సమాచారం. 14 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. ఇదే సమయంలో.. మార్చి 9న మంచి ముహూర్తం ఉందని కొందరు చెబుతున్నారు. అయితే తీర్పు కోసం వేచిచూసి.. ఆ తర్వాత కచ్చితమైన తేదీలు నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## వేదశాస్త్ర విద్వత్ సదస్సు ప్రశ్నపత్రాలు లీక్?

తిరుమల, ఫిబ్రవరి 26: అఖిలభారత వేదశాస్త్ర ఆగమ విద్వత్ సదస్సులో భాగంగా తిరుమలలోని వేదవిజ్ఞాన పీఠంలో నిర్వహిస్తున్న పరీక్షల పశ్నపత్రాలు లీక్ అయ్యాయనే ప్రచారం బుధవారం కలకలం రేపింది. శుక్రవారం జరిగే పరీక్ష ప్రశ్నపత్రాలు ముందే లీక్ అయ్యాయంటూ బుధవారం ఓ స్థానిక పత్రికలో వచ్చిన కథనాన్ని వేదవిజ్ఞాన పీఠం ప్రిన్సిపల్ కుప్ప శివ సుబ్రహ్మణ్యం అవధాని ఖండించారు. పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని స్పష్టంచేశారు. మరోవైపు.. 'వేదపరీక్ష పత్రాలు లీక్' అంటూ వచ్చిన వార్తలు అవాస్తవమని టీటీడీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

## ఏసీబీ వలలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి

విజయనగరం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీఓ) డి.మురళి ఏసీబీ వలకు చిక్కాడు. ఏసీబీ అధికారులు, బాధితుల కథనం మేరకు.. విజయనగరం జిల్లా పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామానికి సంబంధించి 16మంది సభ్యులతో శ్రీ బాలాజీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఒక్కో సభ్యుడు రూ.వెయ్యి చొప్పున ఇవ్వాలని మురళి డిమాండ్ చేసినట్టు ఆ సంఘం అధ్యక్షుడు ఎన్.వాసుదేవరావు తెలిపాడు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. ఇన్‌ఛార్జి డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి సలహా మేరకు బుధవారం ఆ శాఖ కార్యాలయం (ఆక్వా ల్యాబ్)లో మురళికి రూ.16 వేలు ఇచ్చాడు. అక్కడే వేచి ఉన్న డీఎస్పీ రమణమూర్తి రెడ్‌హ్యాండెడ్‌గా అతన్ని పట్టుకున్నారు.

## వైభవంగా అన్నవరం దేవస్థానం చైర్మన్ వివాహం

తుని, ఫిబ్రవరి 26: అన్నవరం దేవస్థానం చైర్మన్ రాజా ఐవీ రోహిత్ వివాహం కరీంనగర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. బుధవారం రోహిత్, నిఖితను పెళ్లాడారు. ఈ వేడుకకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

## నార్త్ అమెరికా లైజన్ అధికారిగా హరిప్రసాద్‌రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నార్త్ అమెరికా లైజన్ అధికారిగా హరిప్రసాద్‌రెడ్డి లింగాలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ స్టాఫ్ అధికారిగా ఐఏఎస్ అధికారి కె.విజయకృష్ణన్‌ను ప్రభుత్వం నియమించింది.

## డ్రగ్ ఇన్‌చార్జి డీజీగా ఆరోగ్యశ్రీ సీఈవో

ఔషధ నియంత్రణ మండలి (డ్రగ్) విభాగానికి ఇన్‌చార్జి డైరెక్టర్ జనరల్‌గా ఐఏఎస్ అధికారి, ప్రస్తుత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవోగా ఉన్న డాక్టర్ మల్లికార్జునను ప్రభుత్వం నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## కాకినాడ నుంచి ఇంటిస్థలాలకు శ్రీకారం

పేదలకు ఇంటిస్థలాలిచ్చే కార్యక్రమాన్ని కాకినాడ నుంచి ప్రారంభించాలని సర్కారు నిర్ణయించింది. ఉగాది రోజున సీఎం వైఎస్ జగన్ కాకినాడ నుంచే లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేలా ఖరారు చేశారు.




అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న హాలీవుడ్ బడా నిర్మాత హార్వే వెయిన్‌స్టీన్‌ను న్యూయార్క్ కోర్టు సోమవారం దోషిగా నిర్ధారించింది. భారతదేశ పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఈ వార్త వినగానే డెమోక్రాట్లకు హార్వే అంటే ఎంతో ప్రేమనీ, తనకు మాత్రం ఆయనంటే పడదని ఓ వ్యాఖ్యచేశారు. గత అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు వ్యతిరేకంగా హార్వే పనిచేయడం ఇందుకు కారణం. మహిళల పట్ల ట్రంప్ గౌరవం ఏపాటిదో మనకు తెలిసిందే కానీ, ఈ తీర్పు మహిళా విజయం అన్నమాట నిజం. ఒక మూవీ మొఘల్‌కు వ్యతిరేకంగా వెలువడిన ఈ తీర్పు బలమైన సందేశాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. హార్వేమీద దాదాపు ఎనభైమంది నటీమణులు లైంగిక వేధింపులు, అత్యాచార ఆరోపణలు చేశారు. కేసుల్లో కొన్ని కొట్టుకుపోయినా, రెండు కేసులు ఇప్పుడు నిర్ధారణ కావడంతో ఇప్పటివరకూ బెయిల్‌మీద ఉన్న హార్వే జైలుకు పోయాడు. ఫైవ్‌స్టార్ హోటల్‌లో టిఫిన్ చేసి, తీర్పు వినడానికి వచ్చిన హార్వే మార్చి 11న తనకు పడబోయే శిక్ష కోసం ఎదురుచూస్తూ ఇకపై ఓ బేస్‌మెంట్ జైల్లో గడపబోతున్నాడు. నిర్ధారణ అయిన ఈ రెండు కేసుల తీవ్రతను బట్టి ఆయనకు పాతికేళ్ళ జైలు తప్పదని అంటున్నారు. మదంతో విర్రవీగిన ఓ ఆస్కార్ విజేత కథ జైల్లోనే ముగిసిపోవచ్చు.

హార్వే గురించి చెప్పుకోవడం ఎందుకంటే, రెండేళ్ళ క్రితం ప్రపంచాన్ని విశేషంగా ప్రభావితం చేసిన 'మీ టూ' ఉద్యమానికి కారకుడు ఆయన. అనేకమంది మహిళలు తమ మొహమాటాలు, అవమాన భయాలు తెంచుకొని నేను సైతం అంటూ ముందుకొచ్చి తమపై జరిగిన లైంగికదాడులను బయటపెట్టేందుకు ఒక ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ సమకూర్చిన ఉద్యమం అది. ఈ మీ టూ కారణంగా భారత్ సహా చాలా దేశాల్లో పెద్దమనుషుల ముసుగులో ఉన్న అనేకమంది కాముకుల నిజ స్వరూపం బట్టబయలైంది. హార్వే మాదిరిగానే అవకాశాలు ఇస్తామనో, తాము ఏం చేసినా చెల్లుతుందన్న ధైర్యంతోనే అఘాయిత్యాలకు పాల్పడినవారు ఎందరో ఉన్నారు. హార్వే తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని అకృ

## మహిళా విజయం

త్యాలకు పాల్పడ్డాడని ప్రాసిక్యూషన్ వాదిస్తే, సినిమారంగంలో అవకాశాలకోసం ఈ హీరోయిన్లే ఆయన వెంటపడ్డారనీ, అప్పట్లో వారి సమ్మతితో జరిగిన శృంగారాన్ని ఇప్పుడు వారంతా అత్యాచారాలుగా అభివర్ణిస్తున్నారని హార్వే న్యాయవాది సమర్థించుకొచ్చారు. కేసుల సందర్భంగా జరిగే ఈ వాదోపవాదాలు అటుంచితే, మీ టూ ఉద్యమ సందర్భంగా సాగిన చర్చలో కూడా ఇవేరకమైన అడ్డగోలు వాదనలు మనం చూశాం. అవకాశాలు దక్కినవారు మారుమాట్లాడరనీ, దక్కనివారు మాత్రం ఇలా బ్లాక్‌మెయిల్ చేస్తారని అన్నవారూ ఉన్నారు. కానీ, ఏంజెలీనా జోలి, మెరిల్ స్ట్రీప్, కేట్ విన్‌స్లెట్ సహా హార్వేమీద పోరాడినవారంతా సినీరంగంలో వెలుగుతున్నవారే. అతనిమీద ఉన్న మొత్తం ఐదు అభియోగాల్లో ఇప్పుడు రెండు మాత్రమే నిర్ధారణ అయినా, హాలీవుడ్ నటి అన్నా బెల్లే వంటివారు దీర్ఘకాలంగా చేస్తున్న న్యాయపోరాటాలు మరోపక్క సాగుతూనే ఉన్నాయి. మొన్న జనవరిలో ఈ కేసు మళ్ళీ ముందుకు వచ్చినప్పుడు పాతికేళ్ళనాటి అత్యాచార ఘటన న్యాయస్థానానికి వివరిస్తూ అరవైయేళ్ళ అన్నాబెల్లే న్యాయస్థానంలో వెక్కివెక్కి ఏడ్చారు.

హార్వే లైంగిక ఆగడాలను 'మీ టూ' ట్యాగ్‌తో బయటపెట్టిన నటీమణులు, ప్రముఖులను 'సైలెన్స్ బ్రేకర్స్'గా అభివర్ణిస్తూ 2017లో టైమ్ మ్యాగజైన్ 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా గుర్తించిన విషయం తెలిసిందే. అమెరికాలో హార్వేమీద అష్లీ జూడ్, ఇండియాలో నానాపటేకర్‌మీద తనుశ్రీ దత్తా తొలిసారిగా తిరుగుబాటు చేశారు కానీ, అనంతర కాలంలో న్యాయస్థానాల్లో నెగ్గలేకపోయారు. చలనచిత్రాల్లోనూ, సీరియళ్ళలోనూ సంస్కారులుగా కనిపించినవారు, ఆయా రంగాల్లో గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నవారి అసలు రంగును ఈ ఉద్యమం వెలుగులోకి తేగలిగింది. భారత్ సహా అన్ని దేశాలూ మీ టూ ఉద్యమానికి భయపడ్డాయే తప్ప దానిని గౌరవించినట్టు కనిపించదు. తప్పుచేసినవారిని శిక్షించాల్సిన సమాజం, వేధింపులపై పెదవి విప్పిన ఫలితంగా తమ రంగంలో అవకాశాలు కోల్పోయినవారి పక్షాన నిలవలేదు. అయినప్పటికీ, చాలా రంగాల్లో అది కలిగించిన భయం, మిగల్చిన ప్రభావం కాదనలేనిది. ప్రశ్నించేవారు ఉండరన్న మగ దురహంకారం, దురాక్రమణలను తొలిసారిగా చీల్చిచెండాడిన ఒక బలమైన తిరుగుబాటుగా అది నిలిచిపోతుంది. న్యాయం జరుగుతుందన్న నమ్మకం దక్కి, సమాజం, న్యాయస్థానాలు తమ పక్కన నిలిచినప్పుడు మాత్రమే బాధితులు నోరువిప్పగలుగుతారు.

## బడా బాబులు.. బడాయి గోడలు



గొప్పవాళ్ళు అనే వాళ్లు ఏం చేసినా గొప్పగానే వుంటుంది. గోడల్ని కూల్చినా గొప్పగానే వుంటుంది. గోడ పేర్చినా గొప్పగానే వుంటుంది. ట్రంప్‌నే తీసుకోండి.. ఆయన వ్యక్తిత్వాన్ని నిశితంగా పరిశీలించండి. ఆయన నిజంగా ఎంత గొప్పవాడు? ఎన్నెన్ని ఘనకార్యాలు సాధించాడు? ఎంతెంత (అప)కీర్తిని మూటగట్టుకున్నాడు? తనకు కోటి మందితో స్వాగతం పలకమని మాత్రమే ఆయన చెప్పాడు(ట). కానీ మిగిలిన కోట్లాది మంది దరిద్రుల్ని ఎక్కడికి పంపాలో, ఎందులో కలపాలో మాత్రం చెప్పలేదు. ఆయన గారు చెప్పనంత మాత్రాన మన పాలకులు ఊరికే చేతులు ముడుచుకుని కూర్చుంటారా చెప్పండి! అతడి అంతరంగం మనవాళ్లకు అర్థం కాదా ఏమి? అందుకే వీళ్లు దరిద్రుల్ని దాచిపెట్టే 'దారుల'ను క్షణాలలోనే కనిపెట్టేశారు. ఇంకేముంది ఆమెరికా – మెక్సికో దేశాల మధ్య గోడ కట్టిస్తానన్న ట్రంప్ కోసం ఏకంగా గోడను కట్టేశారు. గుజరాత్‌ను అంత గొప్పగా అభివృద్ధి చేసినప్పుడు ఈ అడ్డుగోడలు కట్టడమెందుకనే ప్రశ్న ఎవరికైనా సహజంగానే వస్తుంది కదా! మన పాలకులు కేవలం అభివృద్ధిని మాత్రమే చూపించాలని అనుకుంటున్నారు., దరిద్రాన్ని ట్రంప్ కంట పడకుండా దాచి పెట్టాలనుకుంటున్నారు.

కాబట్టి దేశాల మధ్యనే కాదు ప్రాంతాల మధ్యా, పల్లెలు–పట్టణాల మధ్యా, ఆ మాటకొస్తే ధనికులూ– పేదవారి మధ్య కూడా గోడలను మొలిపించడం తక్షణావసరం. అందరికీ తెలియవలసిన సత్యమేమిటంటే గోడల్ని ఎక్కడ నిర్మించినా అవి గొప్పవాళ్ళ మేడల్ని నిలబెట్టడానికే! మేడల రక్షణ కోసమే ఎప్పుడైనా గోడలు ఉండి తీరాలి. ఈ మంత్రం ట్రంప్‌కే కాదు, మోదీజీకి కూడా తెలుసు! ఎందుకంటే ఇద్దరిదీ ఒకే స్కూలు! ఇద్దరి ఇష్టాలూ ఒకటే! పైగా ఇద్దరికీ ఇష్టమైనవాళ్లు కూడా ఒక్క (కార్పొరేట్) జాతీయులే! ఆయన అమెరికా ఫస్ట్ అంటారు. ఈయనేమో మేకిన్ ఇండియా అంటారు. ఆయనకు పొరుగు దేశస్థుల పొడ అసలే గిట్టదు. ఈయనకు పొరుగు మతస్థులంటే నచ్చదు. ప్రత్యర్థుల్ని వేటాడడంలో ఇద్దరిదీ ఒకే ఆట! అవహేళన చేయడంలో ఇద్దరిదీ ఒకే మాట! మనుషుల్ని మాయజేయడంలో ఇద్దరిదీ ఒకే బాట! ఇద్దరూ సంప్రదాయవాదులే! కానీ సంప్రదాయాల్ని తుంగలో తొక్కడంలో ఇద్దరూ ఇద్దరే.. ఘనాపాఠీలే! అందుకే గోడలు కట్టడం లాంటి ఆలోచనలు వీళ్లకు మాత్రమే పుడతాయి. చూడబోతే 'గోడకట్టు' గొప్ప కనికట్టు విద్యలాగా కనిపించడం లేదూ! దరిద్రాన్ని దాచిపెట్టడానికి తక్షణం పనికి వచ్చే దివ్యమైన ఔషధం ఇది అని అనిపించడం లేదూ? తాము చేశామనుకుంటున్న అభివృద్ధిని లోకం ముందుకు తీసుకు రావడంలో సాధించిన ఇంతటి అధునాతన అర్థశాస్త్ర ఆవిష్కరణలకు గాను ముందుగా వీళ్లిద్దరికీ ఉమ్మడిగా నోబెల్ బహుమతిని ప్రదానం చేయాలి.

**– గుండెబోయిన శ్రీనివాస్**

## సందర్భం



■ కె. శ్రీనివాస్

# ఛీ కొట్టుకోవాలి, మనల్ని మనం!

> అయ్యా నాయకులుంగారూ, చేసిన చట్టంలో ఈ దేశపౌరులకు నష్టం జరిగేది ఏదీ లేదంటున్నావు. పదే పదే అదే వల్లిస్తున్నావు. అయినా, ఎందుకు నమ్మకం కలగడం లేదు? నమ్మకం కలిగించవలసిన బాధ్యత ఎవరిది? పాలించేవాడే కదా, ఆలకించాలి, లాలించాలి. అంటే, ఆ చట్టం పేరు మీద దేశంలో ఈ విభజన, అభద్రత వర్ధిల్లాలని నువ్వే కోరుకుంటున్నావని అనిపిస్తే తప్పేముంది? ఈ దేశ దౌర్భాగ్యం కాకపోతే, ఇంతగా వ్యతిరేకత వ్యక్తమవుతున్న చట్టానికి పార్లమెంటులో జై కొట్టడమేమిటి, చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమేమిటి? పార్లమెంటులో జైకొట్టిన పక్షాలన్నీ నేటి దుర్మార్గానికి కారకులే.

సిగ్గుండాలి– ఈ మాట ఒక్కటి అనలేదు కానీ, టెలిగ్రాఫ్ పత్రిక బుధవారం నాడు అంతకంటె ఎక్కువే అన్నట్టుంది. ఢిల్లీ తగలబడుతుంటే, నీరోల్లాగా డిన్నర్లు చేశారని రాష్ట్రపతి భవన్ బొమ్మ వేసి మరీ వ్యాఖ్యానించింది. ఇది ఢిల్లీకి పాకిన గుజరాత్ నమూనా అని పతాకశీర్షికలోనే అభిప్రాయపడింది. ట్రంపు తాజ్‌మహల్‌లో పరవశిస్తుంటే ఢిల్లీ తగలబడుతోందని అమెరికా, ఇంగ్లండ్ పత్రికలు మునుపే రాశాయి. ఎందుకోసం వచ్చాడో ఏమి సాధించుకుని పోయాడో తెలియదు కానీ, ఎన్నికల ఏట ట్రంపుకి ఇండియా యాత్ర అచ్చిరాలేదు. ప్రపంచమంతా తప్పు పడుతున్న విధానాల విషయంలో నోరుమెదపకుండా, అదే పనిగా హగ్గుల మీద హగ్గులు ఇచ్చిరావడమేంటని డెమొక్రాట్లే కాదు, నైతిక ఆధిక్యభావన కలిగిన అమెరికన్లందరూ తప్పుపడతారు. ఇండియాకు ఆయుధాలు అమ్మడమేంటని డెమొక్రటిక్ అభ్యర్థిత్వ రేసులో ముందుకు వెడుతున్న బెర్నీ శాండర్స్ ఘాటుగానే విమర్శిస్తున్నాడు. వందల కోట్లు ఖర్చుపెట్టి, ఇంత ఘనంగా అతిథి మర్యాద చేస్తే, ఆ ఘరానా అంతా ఎటో పోయి, ఢిల్లీ వైఫల్యం ఒక్కటే ప్రపంచం చూస్తోంది. ప్రపంచం ముందు భారత్ ఇవాళ దోషిగా నిలబడింది రాజధాని కొంతభాగంలో హింసాకాండ జరిగిందని మాత్రమే కాదు, మానవత్వపు దరిదాపుల్లో కూడా సంచరించని నేతలను, మాటలకు కూడా అందని వారి నైతిక హీనతను ఈ దేశం ఎట్లా భరిస్తున్నదా అని లోకులు ఆశ్చర్యపోతున్నారు. ఏదో చెబుతారే, ఆధ్యాత్మిక దేశమని, తాత్వికత వెల్లివెరుస్తుందని, సహనమే సంస్కృతి అనీ... ఎక్కడుంది అమాత్యా? మాతృదేశాన్ని ప్రపంచం ముందు ఇంతగా అవమానాల పాలు చేస్తారా?

ఇది మానవీయ స్థితి, దీనిలోకి రాజకీయాలు తీసుకురావద్దట. అమానుష స్థితులను, అమానవీయ కృత్యాలను రాజకీయాలకు ఉపయోగించుకూడదని ఎప్పటినుంచి తెలిసిందో వారికి, ఆశ్చర్యమే! ప్రతిపక్ష నాయకురాలు అకస్మాత్తుగా ప్రత్యక్షమై, ఆరోపణలు గుప్పిస్తే, కొంత ఆశ్చర్యం ఉంటుంది, కోపమూ వస్తుంది. తనపార్టీ ఇంకా బతికే ఉన్నదని చెప్పడానికి ఓకె కానీ, ఈ నేరంలో తమ పార్టీకి ఏ పాత్రా లేనట్టు, ఆరోపణలు గుప్పించడం మాత్రం అన్యాయమే. దేశవ్యాప్తంగా, ఒక రాజ్యాంగ అంశం మీద ప్రజాందోళనలు జరుగుతుంటే, ఆ ఉద్యమానికి నాయకత్వం వహించకపోతే మానె, కనీసం అండదండలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఆ పార్టీ నాయకత్వం ఉన్నది. అధికారంలో ఉన్న రోజుల్లో, తాము, తమ భాగస్వాములు ఆరగింపులో ఆరితేరి ఉండకపోతే, తమరు ఓడిపోయి ఉండేవారు కాదు. దేశానికి ఈ స్థితి ప్రాప్తించేదీ కాదు. మీది స్వయంకృతం. ప్రజలు తమకున్న అవకాశాల మేరకు స్పందించారు. ఇప్పుడు అవకాశాలే లేని దుస్థితి దాపురిస్తోంది. మూడు దఫాలు ఢిల్లీని ఏలారు, ఇప్పుడు జీరోగా మిగిలారు. ముప్పైఐదేళ్ల కిందట ఢిల్లీలో తమ దుర్మార్గం, ప్రత్యర్థులకు తిరుగులేని ఆయుధం, ఇంకేం నైతికత ఉన్నది మీకు? సెక్యులరిజం అన్నది ప్రభుత్వ విధానం మాత్రమే కాదు. అది ఒక ప్రజాజీవన శైలి. మీ ప్రభుత్వాలు సరే, మీ పార్టీ, మీ శ్రేణులు ప్రజలలో కాసింత సహనాన్ని నేర్పలేకపోయినాయా?

ఎంతగా భ్రష్టు పట్టిపోయినా, కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను తీసిపారేయలేం. శాంతియుతంగా సాగుతున్న ఆందోళనను పనిగట్టుకుని హింసాయుతం చేసి, ఉభయ మతాల వారినీ బాధితులు చేసిన పాపం ఎవరిదో అందరికీ తెలిసిందే!

ఏం మనుషులండీ వీళ్లు, పెత్తందారీ దేశాధిపతి వస్తున్నాడంటే, దరిద్రం కనిపించకుండా గోడలు కడతారు, తమ పార్టీ నేతల నోళ్లకు తాళాలు వేయలేరా? అక్కడో ముఖ్యమంత్రి, ఇక్కడో నాయకుడు, మరోచోట ఓ రాజకీయస్వామి, ఒక యోగి, ఒక భోగి– ఎవడి నోటికొచ్చినట్టు వాడు మాట్లాడుతున్నారు, లేదు లేదు, నోటికొచ్చినట్టు మనసుకు వచ్చినట్టు కాదు, వ్యూహం చెప్పినట్టు మాట్లాడుతున్నారు. మూయకూడదనుకుంటే తప్ప, మూయలేని నోళ్లా అవి? అటువంటి వాచాలురను కట్టడి చేయాలని కోర్టు చెప్పాలా? క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడానికి కోర్టుకు వెళ్లి ఉత్తర్వులు తెచ్చుకోవాలా?

ఇప్పుడిక, శవాల దగ్గరికి వెళ్లి, కాలిపోయిన ఇళ్ల దగ్గరికి వెళ్లి, ఈశాన్య ఢిల్లీలో రహదారుల పొడవునా కనిపిస్తున్న భస్మవాహనాలను చూసి, ఎవడు చేశాడీ పని, ఏ మతం వాడు మరణించాడు, ఏ మతం వాడు చంపి ఉంటాడు– అని ఆరాలు మొదలయినయి. తుపాకీ పట్టుకుని వీరంగం వేసిన ఆ ఫలానా వాడు ఎవడు? ఇవీ ఆసక్తులు. తెలుసుకోవలసిందే. కానీ, ఆలో




చన కలిగినవారికి గణాంకాలు అవసరం లేదు. బాధితులలో అందరూ ఉంటారు. ఆయా నిష్పత్తులలో ఉంటారు. జరిగిన సంఘటనలు కొన్ని చోట్ల ఘర్షణలు అయి ఉండవచ్చు. చాలా చోట్ల దాడులే అయి ఉండవచ్చు. అన్నిటికి మించి తెలుసుకోవలసింది, ఈ హింసా సంఘటనలు వాటంతట అవే పుట్టినవి కావు, వాటికి ఒక నేపథ్యం ఉన్నది. ఒక ఉద్రిక్తత ఉన్నది. ఆ ఉద్రిక్తతను రెచ్చగొట్టే శక్తులున్నాయి. ఆ వాతావరణపు విస్ఫోటనమే ఈ సన్నివేశం.

ఎవరో కుట్రపన్నారు, ట్రంప్ పర్యటన సందర్భంగా– అంటారు ప్రభుత్వంలోని వ్యక్తులు. జాతీయ అధికారపార్టీ వ్యక్తులే దీనికి పథకరచన చేశారు అంటారు మరి కొందరు. లేదు, హింసాత్మక ప్రకటనలకు రెచ్చిపోయిన సిఎఎ వ్యతిరేక ఉద్యమకారులే హింసకు దిగారని, ఇతరులు ఎదురుదాడులు మాత్రమే చేశారని ఇంకొందరు అంటారు. దీనివెనుక కుట్ర గిట్ర ఏమీ లేదు, అది లేకపోవడమే పెద్ద ప్రమాదం అంటున్నారు యోగేంద్రయాదవ్. సిఎఎ– వ్యతిరేక ఆందోళనలు సుదీర్ఘకాలం కొనసాగి, ఆ కాలంలో ఆ ఆందోళనల మీద వివిధ ఆరోపణలు, ఆపాదనలు వస్తున్నప్పుడు, ఆ క్రమం అంతా కూడా దేశవ్యాప్తంగా ఒక విభజనను నిర్మించడానికి విచ్ఛిన్నకర శక్తులు ఉపయోగించుకున్నాయని ప్రగతిశీలురు, చైతన్యవంతులు, ఉదారులతో కూడిన శిష్టసమాజం, గుర్తించలేకపోయిందా? దానికి విరుగుడు చేయవలసిన పక్షాలు మౌనంగా ఉండిపోయాయా? పౌరసత్వ ప్రదానంలో మతవివక్ష ఉండకూడదన్న ఒక సూత్రానికి అనుకూలంగా, వ్యతిరేకంగా జరిగిన అభిప్రాయసమీకరణ, భౌతికరూపంలోకి అనువదితమైతే ఇంత బీభత్సం అవుతుందా? ప్రజలలో ఇంతగా ద్వేషం నిర్మితమవుతోందా? అది అన్నిటికంటె ప్రమాదకరం. ఎందుకంటే, దేశవ్యాప్తంగా ఈ ఆందోళన సాగుతున్నది, ఉద్యమ శిబిరాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. కానీ, విభజన లోలోపల ఏమి చేస్తున్నదో? ఎవరన్నా నిప్పురవ్వ వేస్తే? నోరుతెరిస్తే నిప్పులే కదా, మన నాయకులకు!

> ఢిల్లీలో జరిగిన ఘోరానికి ఒకరిని ప్రత్యక్షంగానూ, చాలా మందిని పరోక్షంగానూ నిందించవచ్చు. ఎవరో ఒకరి మీద మన ఆక్రోశాన్ని గురిపెట్టుకోవచ్చు. కానీ, ఇది జరిగాక కూడా, ఇట్లా జరుగుతుందని తెలిశాక కూడా, మరొకచోట ఇట్లా జరిగితే, జరిగే పరిస్థితే వస్తే, అందుకు ఆ ఒక్కరే కాదు, ప్రతి ఒక్కరూ బాధ్యులే అవుతారు. మీరూ, నేనూ అతడూ, ఆమె అందరూ జవాబుదారీయే.

అలాగని,ప్రజాస్వామ్య హక్కు అయిన నిరసనను కట్టిపెట్టుకోవాలా? అట్లా విరమింపజేయడానికే ఇది జరిగిందా? వ్యక్తీకరణ ఆగిందా, నినాదం విశ్రమించిందా, అది కల్లోల మరణాల కంటె ఎక్కువ నష్టం.

అయ్యా నాయకులుంగారూ, చేసిన చట్టంలో ఈ దేశపౌరులకు నష్టం జరిగేది ఏదీ లేదంటున్నావు. పదే పదే అదే వల్లిస్తున్నావు. అయినా, ఎందుకు నమ్మకం కలగడం లేదు? నమ్మకం కలిగించవలసిన బాధ్యత ఎవరిది? పాలించేవాడే కదా, ఆలకించాలి, లాలించాలి. అంటే, ఆ చట్టం పేరు మీద దేశంలో ఈ విభజన, అభద్రత వర్ధిల్లాలని నువ్వే కోరుకుంటున్నావని అనిపిస్తే తప్పేముంది? ఈ దేశ దౌర్భాగ్యం కాకపోతే, ఇంతగా వ్యతిరేకత వ్యక్తమవుతున్న చట్టానికి పార్లమెంటులో జై కొట్టడమేమిటి, చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమేమిటి? పార్లమెంటులో జైకొట్టిన పక్షాలన్నీ నేటి దుర్మార్గానికి కారకులే. కనీసం, దేశవ్యాప్త చర్చ జరిపి, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి ఇటువంటి వివాదాస్పద చట్టాలను ప్రతిపాదిస్తారు. ఏవో మాయ మాటలు చెప్పి, మెజారిటీ సాధించగానే, దేశ ప్రజల జీవితాన్ని అతలాకుతలం చేయగలిగే అధికారం వస్తుందనుకుంటున్నారా?

ఢిల్లీలో జరిగిన ఘోరానికి ఒకరిని ప్రత్యక్షంగానూ, చాలా మందిని పరోక్షంగానూ నిందించవచ్చు. ఎవరో ఒకరి మీద మన ఆక్రోశాన్ని గురిపెట్టుకోవచ్చు. కానీ, ఇది జరిగాక కూడా, ఇట్లా జరుగుతుందని తెలిశాక కూడా, మరొకచోట ఇట్లా జరిగితే, జరిగే పరిస్థితే వస్తే, అందుకు ఆ ఒక్కరే కాదు, ప్రతి ఒక్కరూ బాధ్యులే అవుతారు. మీరూ, నేనూ అతడూ, ఆమె అందరూ జవాబుదారీయే.

దుఃఖిద్దాం. దుఃఖించండి. ఇంత హీనంగా ఉన్నందుకు, ఇంత దీనంగా మారినందుకు, మనచేతులకు ఎవరో నెత్తురు పూస్తున్నందుకు.

ఏమన్నా చేద్దాం, ఏమన్నా చేయండి. మంచిచెడ్డలు చెప్పే పని, మంచిని పెంచే పని, ప్రేమను పంచే పని, ధైర్యం కలిగించే పని.

## జనవాక్యం

### పాఠశాలలను పట్టించుకోండి

పిల్లలకు నేనిచ్చే ఆస్తి చదువేనని చెబుతున్న ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల దుస్థితిని ఓ సారి సమీక్షించాలి. కనీసం మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేని పాఠశాలలు కోకొల్లలు. అలాగే దాదాపు అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలలోనూ ఖాళీల సంఖ్య యాభైవేల పైమాటే. ఇక మధ్యాహ్న భోజనం అధ్వాన్న భోజనంగా మారింది. విద్యా సంవత్సరం ముగింపు కావస్తున్నా ఏక రూప దుస్తుల పంపిణీ పూర్తి కాలేదు! గత ప్రభుత్వ పథకాలనే కాస్త అటూ ఇటూ మార్చి, పాఠశాలలకు రంగులు వేసి అదే విప్లవాత్మకం అని భారీ ప్రకటనలు ఇచ్చుకున్నారు సరే... విద్యార్థులను, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలలను పట్టించుకోరా? భావి భారత పౌరుల భవిష్యత్తుపై దృష్టి పెట్టి అవసరమైనవి సమకూర్చండి. తద్వారా విద్యార్థులపట్ల మీకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోండి.

**– కంభంపాటి కోటేశ్వర రావు**, విశాఖపట్నం.

### ఉచితం అనుచితం!

ఉచిత పథకాలతో ప్రయోజనం శూన్యం. దీని వలన ప్రభుత్వాలు గడ్డు పరిస్థితులను ఎదుర్కోవడమే కాకుండా ప్రజలకు దీర్ఘకాలంలో చేటు అనడంలో సందేహం లేదు. ఉచితానుచితాలు మరచి ఉచిత పథకాలవైపే ఎదురు చూసే పరిస్థితులు దేశవ్యాప్తంగా నెలకొంటున్నాయి. ఇవి దేశాభివృద్ధికి చేటు. ఎన్టీఆర్ ప్రభుత్వం ఎన్నో పథకాలను రూపొందించి నిర్విఘ్నంగా అమలు చేసింది. అవే ఎన్టీఆర్‌కు 'అన్న' అనే గౌరవ పేరును శాశ్వతం చేశాయి. అప్పటి ప్రజల స్థితిగతులను అనుసరించి అవన్నీ అవసరమైన పథకాలే. నేడు పరిస్థితులు మారిపోయాయి. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. కష్టించేవాడికి కూటికి లోటు లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అవసరం లేని సంక్షేమ పథకాలను నిరభ్యంతరంగా తొలగించాలి. వీటిపై నిష్పక్షపాతంగా సమీక్ష చేయాలి. విద్యవైద్యం వంటి వాటిని అందరికీ ఉచితంగా అందించాలి. ఉన్నత స్థాయి విద్యను అందరికీ అందుబాటులో ఉంచాలి. అర్హులకు మాత్రమే పెన్షన్లను అందించాలి. ఆరోగ్యశ్రీ అందరికీ అందించాలి. విద్యుత్, అనేది నేటి పరిస్థితుల్లో కుల మత,వర్గ బేధాలకు అతీతంగా అందరికీ అత్యవసరం. ఈ విషయంలో ప్రభుత్వం మరింత సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి. అవసరమైన పథకాలు అమలు చేస్తూ, వాటి ద్వారా ప్రజల ఆదాయ వనరులను పెంచే దిశగా చర్యలు చేపట్టాలి. ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలి. ప్రజలను మానసికంగా సిద్ధం చేస్తూ ఒకటొకటిగా చర్యలు తీసుకుంటూ అంతిమ ఫలితాలు సాధించాలి. అటువంటి వారికే మరో సారి అధికారం లభిస్తుంది. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే అన్ని రాజకీయ పక్షాలు కేవలం ఓట్ల వేటలో పడి సామాజిక బాధ్యతను విస్మరిస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప పథకాల అమలులో నిజమైన చిత్తశుద్ధి కొరవడింది. ప్రజలకు శాశ్వత మేలు చేకూర్చే ఏ పథకమైనా సత్ఫలితమిస్తుందని కేజ్రీవాల్ 'హ్యాట్రిక్ విజయం' నిరూపించింది. ఇదే ఆదర్శంగా పథకాలపై ముందుకు సాగాలి.

**– సుంకవల్లి సత్తిరాజు.** సంగాయగూడెం

### ద్వంద్వ ప్రమాణాలు తగదు!

కొత్తగా నియమితులైన గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎవరైనా మరింత మెరుగైన ఉద్యోగం లభించి, తమ ఉద్యోగానికి రాజీనామా చేస్తే అప్పటి వరకు పొందిన వేతనం, వారికి శిక్షణ నిమిత్తం అయిన ఖర్చులను తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయటం సబబు కాదు. ఎందుకంటే, ఇప్పుడు ఇచ్చిన ఉద్యోగాలు తాత్కాలిక ప్రాతిపదికన ఇచ్చినవే. ఇక వారు కష్టపడి చదివిన చదువుకు, శ్రమకు తమ విద్యార్హతకు తగిన, మెరుగైన ఉద్యోగానికి వెళ్ళటంలో తప్పేముంది? శాసన సభ్యులు సభకు హాజరు అవకుండానే ఎలా వేతనాలు తీసుకుంటున్నారు? సభకు రానందుకు వారి ఎన్నికకు అయిన ఖర్చును కూడా తిరిగి తీసుకుంటారా? ఇలా ద్వంద్వ ప్రమాణాలు పాటించకుండా ఉద్యోగులను, ప్రజాప్రతినిధులను ఒకేలా పరిగణించాలి.

**– ఆర్.జి.**

# వైజ్ఞానిక జగత్తులో వనితలు

రేపు జరుపుకునే 'జాతీయ విజ్ఞాన దినోత్సవ' (నేషనల్ సైన్స్ డే) సందర్భంలో సైన్సులో మహిళల ప్రాతినిధ్యాన్ని, శాస్త్ర విజ్ఞాన ప్రగతిలో వారి భాగస్వామ్యం గురించి చర్చించుకోవటం ఎంతైనా అభిలషణీయం. ఏటా ఏదో ఒక విషయాన్ని ప్రధానాంశంగా తీసుకుని 'సైన్స్ డే' జరపటం ఆనవాయితీ. ఈ ఏడాది సైన్స్ డే ఇతివృత్తం 'వైజ్ఞానిక రంగంలో స్త్రీలు' (ఉమెన్ ఇన్ సైన్స్) అటువంటి చర్చకు విశేష ప్రేరణ నిస్తుందనడంలో సందేహం లేదు. కేవలం రెండు వందల రూపాయల వ్యయంతో గొప్ప వైజ్ఞానిక ఆవిష్కరణ చేసి భారతదేశానికి సైన్సులో తొలి నోబెల్ బహుమతి తెచ్చిన గొప్ప శాస్త్రవేత్త సి.వి.రామన్. ఆయన తన పరిశోధనా ఫలితాలను వెల్లడించిన ఫిబ్రవరి 28 వ తేదీని (భావి పౌరుల్లో వైజ్ఞానిక స్ఫూర్తి విప్పారేందుకు) 'జాతీయ సైన్స్ దినోత్సవం' గా పాటిస్తున్నాము.

శశ్వత కమిషన్, కమాండ్ పోస్టులకు మహిళా సైనికాధికారులు అర్హులేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమయింది. భారత సైన్యంలోని మహిళా సైనికాధికారులు సహజంగానే ఆ తీర్పుకు జేజేలు పలికారు. సైన్యంలోని మహిళలు దేశం గర్వించే ఎన్నో సేవలను అందించి దేశగౌరవాన్ని ఇనుమడింపజేశారని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు తమ తీర్పులో పేర్కొన్నారు. జెండర్ ఆధారంగా శక్తియుక్తుల్ని అంచనావేయటం సరికాదని, ఇది మహిళల సేవలను అవమానించినట్లవుతుందని న్యాయమూర్తులు అన్నారు. మహిళా యోధులకు సమానావకాశాలు కల్పించకపోవడం స్త్రీల ఆత్మాభిమానాన్ని దెబ్బతీయటమేకాదు సైన్యంలోని ప్రతి మహిళను అగౌరవపరచడమే అవుతుంది. సుప్రీం కోర్టు తీర్పు స్త్రీ, పురుష వివక్ష లేకుండా సమానావకాశాలు కల్పించడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. ఇంతకూ ఈ తీర్పు ఇప్పుడెందుకు అవసరమైంది? దీని నేపథ్యం ఏమిటి? స్వల్పకాలిక సర్వీస్ కమిషన్‌లో పని చేసే మహిళా అధికారులకు శాశ్వత కమిషన్‌కు అర్హత కల్పిస్తూ దశాబ్దం క్రితమే ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. శరీర ధర్మాల రీత్యా స్త్రీలు, పురుషుల కంటే బలహీనులని పేర్కొంటూ ఆ తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీలు ఒకటి దాఖలయింది. సర్వోన్నత న్యాయస్థానం ఆ అప్పీలును కొట్టివేస్తూ శాశ్వత కమిషన్, కమాండ్ పోస్టులకు మహిళా సైనికాధికారులు అర్హులేనని తీర్పు వెలువరించింది. ఈ తీర్పును మూడు నెలల్లోగా అమలు చేయాలని కూడా స్పష్టం చేసింది. ఆధునికులమనీ, అంతరిక్ష యుగం, కంప్యూటర్ యుగమనీ గొప్పలు చెప్పుకొనే మనం స్త్రీలపై కొనసాగుతున్న వివక్షకు ఏం సమాధానం చెబుతాము? ఇదేదో సగటు మనిషిలో ఉన్న దురభిప్రాయం మాత్రమే కాదు. పాలకులు, ప్రభుత్వాలే స్త్రీ– పురుష సమానత్వాన్ని నిరాకరిస్తుంటే రాజ్యాంగం ఏమవుతున్నట్లు? దేశం ఎటు పోతున్నట్లు? మహిళల పట్ల వివక్ష ఏ స్థాయిలో వేళ్లూనుకుని ఉందో ఈ సందర్భం చెప్పక చెబుతున్నది. పురుషాధిక్య భావజాలం, ఆలోచనలు ఊడలుదిగి అన్ని రంగాలనూ శాసిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

సైన్యం కాబట్టి ఈ పరిస్థితి తలెత్తి ఉండవచ్చు కాని సైన్సు, టెక్నాలజీ వంటి ఇతర రంగాల్లో వివక్షకు తావుండదనుకునే వాళ్లు ఉండవచ్చు. పురుషులతో పోల్చిచూస్తే విద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో స్త్రీల స్థాయి ప్రపంచ వ్యాపితంగానే తక్కువగా ఉన్నదన్నది ఎవరూ కొట్టివేయలేని ఒక వాస్తవం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ అసమానతలు మరీ ఎక్కువ. విద్యాభ్యాస స్థాయిలోనే కాలేజీల్లో బాలికల ప్రవేశాలు ముఖ్యంగా సైన్సు టెక్నాలజీ, ఇంజనీరింగ్, వైద్య (stem)కోర్సుల్లో తగినంత ఉండటం లేదు. ఒకవేళ సైన్సులో పట్టభద్రులయినా, డాక్టరేట్లు చేసినా సైన్సును వృత్తిగా కొనసాగించటం దుర్లభంగా ఉంది. ప్రాథమిక స్థాయిలో, కొంత వరకు సెకండరీ విద్యలో కూడా జెండర్ వివక్ష సమసిపోయిందని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ 2016లో వెలువరించిన గణాంకాలు చెబుతున్నాయి. పోస్టు గ్రాడ్యుయేటు స్థాయి వరకు మహిళల శాతం ఒకింత మెరుగ్గానే ఉన్నా ఆపై పరిశోధనా పరమైన చదువుల్లో (ఎం.ఫిల్., పిహెచ్.డి) వారి నిష్పత్తి పడిపోతున్నది. ఉపాధి ఉద్యోగాల్లో వీరికి తగిన ప్రోత్సాహం కొరవడటమే కొంతమేరకు కారణం. వైజ్ఞానిక పరిశోధనా రంగంలో ప్రపంచ వ్యాపితంగా మహిళలు 30శాతం కంటే తక్కువగా ఉన్నారని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రెస్ ఎత్తి చూపారు. మహిళల పట్ల కొనసాగుతున్న వివక్ష ప్రపంచమంతటా ఉన్నా భారతదేశం వంటి వర్ధమాన దేశాల్లో మరీ ఎక్కువ. మన దేశంలోని శాస్త్రవేత్తలు, టెక్నాలజిస్టులు, ఇంజనీర్లలో మహిళలు కేవలం 14శాతమే (ప్రపంచ సరాసరి 28.4 శాతం). నిజానికి అమెరికాలో సైతం పరిస్థితి ఇంతకంటే మెరుగ్గా ఏమిలేదు. అక్కడి ఇంజనీర్లలో మహిళలు కేవలం 11శాతం మాత్రమే. అలాగే STEM ఉద్యోగాల్లో 12శాతం మహిళలే ఉన్నారు. వీటి ప్రవేశాల్లో సైతం మహిళల శాతం దారుణంగా ఉండటం శోచనీయం. జీవశాస్త్రంలో ఐదు శాతం, ఇంజనీరింగ్‌లో 8శాతం, కమ్యూనికేషన్ టెక్నాలజీ చదువుల్లో కేవలం 3శాతం మంది మాత్రమే మహిళలు. ఇస్రో వంటి ప్రతిష్ఠాత్మక అంతరిక్ష పరిశోధనా సంస్థ సిబ్బందిలో కూడ మహిళలు 8శాతానికి మించి లేరు. ఇక అటువంటి సంస్థలకు నేతృత్వం వహించే డైరెక్టర్లుగా మహిళలను ఊహించగలమా? పురస్కారాలు, ప్రోత్సాహకాల విషయంలో కూడా మహిళల పట్ల చిన్నచూపే. మన దేశంలో పద్మశ్రీ అందుకున్న తొలి మహిళా శాస్త్రవేత్త జానకి అమ్మాళ్. ఆమెకు ఆ పురస్కారాన్ని 1977లో ఇచ్చారు. ప్రతిష్ఠాత్మక సైన్సు అకాడమీ ఫెలోషిప్పుల్లో కూడా సైన్సును వృత్తిగా ఎంచుకుని దీటైన పరిశోధనలు చేస్తున్న మహిళా శాస్త్రవేత్తలు ఎందరో ఉన్నారు.



> చదువులో, వృత్తిలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ముందుకు నడిచి విజయాలు సాధించిన మహిళా శాస్త్రవేత్తల జీవితాలు మనకేం చెబుతున్నాయి? అవకాశం ఇవ్వాలే గాని తాము ఎవ్వరికీ తీసిపోమని, కృషిలోగానీ, మేధస్సులోగాని అగ్రగాములుగా నిలుస్తామని మరీ మరీ విశదం చేస్తున్నాయి. వైజ్ఞానిక పరిశోధనల్లో వివక్ష రహితమైన సంపూర్ణ మహిళా భాగస్వామ్యమే నూతన ప్రపంచ నిర్మాణానికి దోహదం చేస్తుంది.

ఇదలావుంచితే దశాబ్దాల క్రితమే సామాజిక కట్టుబాట్లను, కష్టాలను ఎదుర్కొని సైన్స్‌లో తమదైన ముద్రవేసిన మహిళలు స్ఫూర్తి ప్రదాతలుగా ఉన్నారు. తొమ్మిదేళ్ల బాల్యంలోనే పెళ్లి చేస్తే, 14ఏళ్ల వయసుకే తల్లై, కొడుకును పోగొట్టుకుని పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి డాక్టర్ కావాలని సంకల్పించిన అపూర్వ విద్యావతి ఆనందీబాయి జోషి. అమెరికాలోని పెన్సిల్వేనియా మెడికల్ కాలేజీలో 1886లోనే పాశ్చాత్య వైద్యంలో శిక్షణ పొందిన తొలి భారతీయ మహిళ ఆనందీబాయి. సైన్స్ చదవాలని, పరిశోధనలు చేయాలని ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ప్రవేశానికి కమలా సోహ్నీ ఆరాట పడితే కేవలం మహిళ అన్న కారణంగా ఆమెకు ప్రవేశం నిరాకరించబడింది. సి.వి.రామన్ ఇచ్చిన ప్రోత్సాహంతో ఆమె డాక్టరేట్ పూర్తి చేశారు. రామన్ మార్గదర్శకత్వంలో మొట్టమొదటి పిహెచ్.డి పొందిన ప్రప్రథమ మహిళా శాస్త్రవేత్త కమలా సోహ్నీ. సత్యేంద్రనాథ్ బోస్, ప్రఫుల్లచంద్ర రే వంటి ఉద్దండుల మార్గదర్శనలో రసాయన శాస్త్రంలో పిహెచ్.డి చేసిన తొలి మహిళగా ప్రసిద్ధి చెందిన ఆసిమా ఛటర్జీ మొక్కల్లో ఉండే ఔషధాలను కనుగొన్నారు. కర్ణాటకలో తొలి మహిళా ఇంజనీరుగా పనిచేసిన రాజేశ్వరి ఛటర్జీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మిచిగాన్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందారు. భారత వైజ్ఞానిక సంస్థలో తన భర్తతో కలిసి ఎలక్ట్రిక్ కమ్యూనికేషన్ విభాగాన్ని ఏర్పాటు చేసింది. మైక్రోవేవ్ ఇంజనీరింగ్‌లో విశేష కృషి చేసిన విజ్ఞానవేత్తగా ఆమె సువిఖ్యాతులయ్యారు. భారతదేశంలో గణిత పరిశోధకుల్లో మేటిగా పేరుగాంచిన మంగళ నార్లీకర్ గణితాన్ని సులభతరం జేసి మనసుకు హత్తుకునేలా బోధించేవారు. పెళ్లయిన పదహారు సంవత్సరాలకు ఆమె గణితశాస్త్రంలో పిహెచ్.డి చేశారు. వీరేగాక ఇటీవలి కాలంలో ఎందరో మహిళలు వైజ్ఞానిక పరిశోధనా రంగంలో విశేష కృషి చేస్తున్నారు. ఇస్రో రాకెట్ శాస్త్రవేత్త నందిని హరినాథ్ తన ఇరవై సంవత్సరాల సర్వీసులో 14మిషన్స్‌లో పనిజేశారు. మంగళ్‌యాన్‌కు డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. రక్షణ రంగ పరిశోధనల్లో పరిశోధనలు చేసి 'అగ్ని' క్షిపణి ప్రాజెక్టులకు నేతృత్వం వహించిన మహిళ టెస్సీ థామస్. క్షిపణి ప్రయోగాలను విజయవంతం చేయటంలో కీలక పాత్ర వహించిన టెస్సీని 'క్షిపణి మహిళ', 'అగ్నిపుత్రి'గా పిలుస్తారు. మహికో విత్తన సంస్థలో పరిశోధనలు చేసిన ఉషా బార్వాలే తొలి జన్యుమార్పిడి ఆహార పంట వంగను ఉత్పత్తి చేస్తే.. జన్యుమార్పిడి పంటలతో ప్రజారోగ్యానికి వచ్చే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ సంచలనం సృష్టించింది సుమన్ సహాయ్. ఈమే 'జీన్ క్యాంపెయిన్'ను స్థాపించి స్థానిక ప్రజల, రైతుల హక్కుల కొరకు, కార్పొరేట్ల నుండి వారికి రావలిసిన వాటా రాబట్టేందుకు విశేష కృషి చేశారు. అంటార్కిటికాను సందర్శించిన తొలి మహిళా శాస్త్రవేత్త అదితి పంత్. కృత్రిమ గర్భధారణ పిండాల ప్రక్రియలను సుసాధ్యం చేసిన వారు ఇందిర హిం దూజా. అంతరిక్షనౌక కొలంబియా ప్రయోగ ప్రమాదంలో చనిపోయిన మిషన్ స్పెషలిస్టు కల్పనా చావ్లా... ఇలా ఎందరెందరో మహిళా శాస్త్రవేత్తలు వైజ్ఞానిక పరిశోధనలను సమున్నతం చేసి ప్రఖ్యాతిగాంచారు.

చదువులో, వృత్తిలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ముందుకు నడిచి విజయాలు సాధించిన మహిళా శాస్త్రవేత్తల జీవితాలు మనకేం చెబుతున్నాయి? అవకాశం ఇవ్వాలే గాని తాము ఎవ్వరికీ తీసిపోమని, కృషిలోగానీ, మేధస్సులోగాని అగ్రగాములుగా నిలుస్తామని మరీ మరీ విశదం చేస్తున్నాయి. స్త్రీలకు వైజ్ఞానిక రంగ అవసరం ఎంత వుందో అంతకంటే ఎక్కువగా వైజ్ఞానిక రంగానికి మహిళల అవసరం ఉంది. ప్రపంచంలో సగభాగంగా ఉన్న మహిళల సమాన ప్రాతినిధ్యం లేకుండా సైన్సేకాదు ఏ రంగమూ పురోగమించలేదు. స్త్రీ పురుష సమానత్వం ఒక మానవ హక్కు. దీన్ని నిజం చేయటానికి సైన్స్‌లో మహిళలకు సముచిత స్థానం కల్పించవలసి ఉంది. బాలికలను సైన్స్ పట్ల ఆకర్షించడానికి ఇప్పటికే డాక్టరేట్లు పొందిన మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించి, వారి సృజనాత్మక పరిశోధనలను దేశ ప్రగతికి వినియోగించుకోవటం ఎంతైనా అవసరం. వైజ్ఞానిక పరిశోధనల్లో వివక్ష రహితమైన సంపూర్ణ మహిళా భాగస్వామ్యమే నూతన ప్రపంచ నిర్మాణానికి చేయూతనిస్తుంది.

**– ప్రొఫెసర్ కట్టా సత్యప్రసాద్**

(రేపు జాతీయ సైన్స్ దినోత్సవం)

## ఆర్భాటం, అస్పష్టం

అమెరికా అధ్యక్షుడి భారత యాత్ర ఆర్భాటంగా సాగింది. అతిథి మర్యాదలు చూపడంలో భారత్ అంతులేని శ్రద్ధ కనబరిచింది. తనకు లభించిన అపూర్వ స్వాగతానికి, ఆతిథ్యానికి ఉప్పొంగిపోయినట్టు ట్రంపు ప్రకటించారు కూడా. అలాగే మన ప్రధాని కూడా ఆదర్శవంతమైన అతిథేయిగా వ్యవహరించారు. అమెరికా–భారత్ మైత్రి ప్రభుత్వాలకు అతీతమైనదిగా, ప్రజల మధ్యనున్న పవిత్రబంధంగా చాటిచెప్పారు. స్నేహాన్ని మరింత గాఢపరుచుకునే దేశాల ప్రయత్నంగా చూస్తే ఈ యాత్ర చారిత్రాత్మకం. అదే లాభనష్టాల కోణంలో చూస్తే మాత్రం ఫలితం అస్పష్టం. కొంత కాలం తర్వాత తరచి చూస్తే స్పష్టమైన ఫలాలు అర్థమవుతాయి. కానీ, ఇప్పటికిప్పుడు స్థూలంగా చూసినప్పుడు అద్భుతాలేమీ కనబడడం లేదు. ముఖ్యంగా ఈ పర్యటన ట్రంప్ తన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా చేస్తున్నట్లు ముద్ర పడింది. మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడుతున్న తను ప్రవాస భారతీయుల మద్దతు అమెరికాలో పొందగలనన్న వ్యూహంతోనే ఈ పర్యటన తలపెట్టినట్టు భావించాలి. అయితే, ఈ పర్యటనకు ముందు వరకూ భారత్ పట్ల తన స్నేహాన్ని చూపే ప్రయత్నమేదీ ఆయన చేతల్లో లేదు. ఇక కుదిరిన ఒప్పందాల్లో భారత్ కు విశేషంగా లబ్ధి కూర్చేవి కూడా ఏవీ లేవు. రక్షణ ఒప్పందాలు ఎటూ మామూలే.. అమ్మకందారు అమెరికాకే ఎక్కువ లాభం. బేరసారాల్లో మనకేమీ అదనంగా ఒరిగింది లేదు. వాణిజ్యంలో అమెరికా ఇంతకు ముందు మన దేశానికి జనరల్ సిస్టం ఆఫ్ ప్రిఫరెన్స్ అమలు చెయ్యడంతో రాయితీలుండేవి. వాటిని రద్దుచేసిన ట్రంప్, పునరుద్ధరించే మాట ఎత్తనే లేదు. పైగా మన దేశం అక్కడనుండి వస్తున్న దిగుమతులపై అధికసుంకం వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. ఆయన మాటల్లో చూపిన మిత్రధర్మం చేతల్లో చూపితే బాగుండేది.

**– డా. డి.వి.జి. శంకరరావు**

బ్యూటీ



## క్యాబేజీ మాస్క్

మృదువైన చర్మం కోసం క్యాబేజీ, బంగాళాదుంప, క్యారెట్‌తో చేసిన మాస్క్ బాగుంటుంది. ఈ మాస్క్‌తో ముఖం మెరిసిపోతుంది. క్యాబేజీ మాస్క్ ఎలా చేయాలంటే...

బంగాళాదుంపకు సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణం ఉంది. క్యాబేజీ, క్యారెట్లు చర్మాన్ని పట్టులా మృదువుగా మార్చుతాయి. చర్మం మెరిసిపోయేలా చేస్తాయి.

**కావలసినవి:** ఒక బౌల్ క్యాబేజీ ఆకులు, చెరొక బౌల్ క్యారెట్, బంగాళాదుంప ముక్కలు, పాలు.

**తయారీ:** క్యాబేజీ ఆకులు, క్యారెట్, బంగాళాదుంప ముక్కలను నీళ్లల్లో వేసి మెత్తగా ఉడికించాలి.

- ఉడికిన నీళ్లను వడగట్టి ఆ ముక్కల్ని బాగా మెత్తగా చేయాలి.
- తర్వాత క్యారెట్, బంగాళాదుంప, క్యాబేజీ పేస్టును మూడు టేబుల్ స్పూన్లు తీసుకుని ఒక బౌల్‌లో వేయాలి. అందులో కొద్దిగా పాలు కలపాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని పదిహేను నిమిషాలు అలాగే ఉండాలి. ఆ తర్వాత చల్లటి నీళ్లతో ముఖం కడుక్కోవాలి. చర్మంపై ఈ మాస్క్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.

ఇలా చేయండి!



## గ్రేవీ చిక్కగా...

- గ్రేవీ పలచగా అయినపుడు... అందులో ఉడికించిన బంగాళాదుంపను మెత్తగా చేసి కలిపితే గ్రేవీ చిక్కగా తయారవుతుంది.
- అన్నం వండేటప్పుడు అందులో కొద్దిగా వంటనూనె వేస్తే అన్నం ముద్దవకుండా పొడి పొడిగా వస్తుంది.
- పులుసు కూరల్లో చింతపండు రసానికి బదులు టొమాటో గుజ్జు వేస్తే కూరలు ఎంతో రుచిగా ఉంటాయి.
- కారం నిల్వ ఉంచిన డబ్బాలో చిటికెడు ఇంగువ కలిపితే కారం పురుగుపట్టదు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.
- కూరల్లో కారానికి బదులు పచ్చిమిరపకాయలు వాడితే శరీరంలోని కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- కూరల్లో వేసే పచ్చిబఠాణీలు తొందరగా నానాలంటే వేడి నీటిలో కొద్దిగా వంట సోడా వేసి రెండు గంటలు ఉంచాలి. తర్వాత కూరలో ఉపయోగించుకోవచ్చు.
- బిస్కెట్లు నిల్వ ఉంచిన డబ్బాలో కొద్దిగా పంచదార వేస్తే అవి మెత్తబడవు.
- బొంబాయి రవ్వను వేగించి నిల్వచేస్తే తొందరగా పురుగు పట్టదు.
- కొబ్బరి చిప్పను స్టవ్ మీద కాసేపు వేడి చేయాలి. చల్లారిన తర్వాత పగలగొడితే లోపలి కొబ్బరి ఇట్టే బయటకు వచ్చేస్తుంది.



# వాడిన పూలు వికసిస్తున్నాయి!

**'వాడిన పూలే వికసించులే....' అన్నాడో సినీ కవి. దాన్నే కాస్త అటు ఇటుగా నిజం చేసి చూపిస్తున్నారు మాయా వివేక్, మినాల్ దాల్మియాలు. వాడిన పూలతో సువాసనలు వెదజల్లే అగరబత్తులు, ఎకో-ఫ్రెండ్లీ సబ్బులు తయారుచేస్తున్నారు. భవిష్యత్తులో రసాయనాలు లేని మరిన్ని పర్యావరణహిత ఉత్పత్తులను అందిస్తామంటున్నారు. మహిళల కోసం ఏదైనా చేయాలనే తలంపుతోనే 'ఊర్వి సస్టైనబుల్ కాన్సెప్ట్స్' కింద ఈ పని తలపెట్టాం అంటున్నారు ఈ ఇద్దరు. ఆ విశేషాలు వారి మాటల్లోనే...**



మహిళల ఉపాధి లక్ష్యంగా...

- మాయా వివేక్

"సమాజంలో మార్పు తేవాలనే లక్ష్యంతో 'ఊర్వి సస్టైనబుల్ కాన్సెప్ట్స్' చేపట్టాం. పర్యావరణ పరిరక్షణ దిశగా మేము వేసిన తొలి బీజం ఇది. దీన్ని నెలకొల్పడం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడం మా ముఖ్య ఉద్దేశం, బడుగువర్గాల పిల్లలు బాగా చదువుకోవాలనే ఆలోచనతో కూడా ఈ పని ప్రారంభించాం. మహిళలు, పిల్లల జీవన ప్రమాణాలు పెంచాలన్నది మా తపన. అందుకోసమే ఈ కంపెనీకి శ్రీకారం చుట్టాం.

మాది కేరళ. హైదరాబాద్ వచ్చి పదేళ్లు అయ్యింది. నా చదువు కర్ణాటకలోని గుల్బర్గాలో సాగింది. ఉమన్స్ స్టడీస్‌లో పిజీ చేశా. ఆ తర్వాత ఒక ఎం.ఎన్.సీలో జాబ్ వస్తే చేరా. చిన్నతనం నుంచీ సమాజానికి ఉపయోగపడే పని ఏదైనా చేయాలనే ఆలోచన ఉండేది. అందుకోసం ఎన్జీవో పెట్టాలనుకున్నా. ఆ ఆలోచన రాను రానూ ఎక్కువవడంతో ఉద్యోగం వదిలేశా. అదే సమయంలో ఎండిపోయిన పూలపై కాన్పూర్ (యూపీ)లో ఇద్దరు చేసిన ఒక వీడియో చూశా. వారు చేస్తున్న ఎకో-ఫ్రెండ్లీ పనిని నా స్నేహితురాలు మినాల్‌తో చెప్పా. ఆ ఆలోచన తనకూ నచ్చడంతో ఆ పని చేపట్టాలనుకున్నాం.

మన పరిసరాల్లో వాడిన పూలు ఇష్టం వచ్చినట్టు పడేయడం చూస్తూనే ఉంటాం. వీడియోలో చూసి ఈ సమస్యను పరిష్కరించవచ్చు అనిపించింది. ఆ పని హైదరాబాద్‌లో చేయడం ద్వారా పర్యావరణాన్ని, పరిసరాలను కాలుష్యరహితంగా చేయాలనుకున్నాం. పైగా ఈ పనిని ఇక్కడ చేపట్టిన వాళ్లు ఎవరూ లేరు. అందుకే దీని ద్వారా గ్రామీణ స్త్రీలకు ఉపాధిని కల్పించాలనుకున్నాం. ఆ దిశగా అధ్యయనాలు, ప్రయోగాలు చేశాం.

**స్థానిక మహిళలకు అవకాశం...**

హైదరాబాద్ శివారుల్లోని గుండ్లపోచంపల్లి సర్పంచ్‌ను కలిశాం. మేము చేపట్టిన పని కోసం తమ పంచాయతీ కమ్యూనిటీ హాల్‌ని ఆయన ఉచితంగా ఇచ్చారు. అయితే స్థానిక మహిళలకే ఉద్యోగాలివ్వాలన్నారు. మా లక్ష్యం కూడా అదే కాబట్టి అంగీకరించాం. అలా అక్కడ మా పని మొదలెట్టాం. మెల్లగా మాకొచ్చే ఎండిన పూల లోడ్ కూడా బాగా పెరగడంతో కమ్యూనిటీ హాలు ఖాళీ చేసి ఇప్పుడున్న చోటుకు మారాం. 2019 ఏప్రిల్‌లో 'ఊర్వి సస్టైనబుల్ కాన్సెప్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ'ని మొదలెట్టాం. అప్పటికే మా ఉత్పత్తులు కొన్ని సిద్ధంగా ఉన్నాయి. పైగా నేషనల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ వాళ్లు మాకు ఇంక్యుబేషన్ సౌకర్యం కల్పించారు. అక్కడే మేము పూల వ్యర్థాలపై కొత్త ప్రయోగాలు, పరిశోధనలు, అధ్యయనాలు కొనసాగిస్తున్నాం.

గత ఏడాది జూన్, జులై నుంచి మా ఉత్పత్తులను మార్కెట్లో అమ్ముతున్నాం. చార్‌కోల్ లేని అగరబత్తి తయారీ మా ప్రత్యేకత. వీటిల్లో కెమికల్‌లో ఉండే సింథటిక్ పరిమళాలు ఉండవు. అగరొత్తుల సువాసనల కోసం ఎసెన్షియల్ ఆయిల్స్ ఉపయోగిస్తాం. మొత్తం 40 దేవాలయాలతో పూలకు సంబంధించి టై-అప్ పెట్టుకున్నాం. ఈ పూలను నలుగురైదుగురు మహిళలు కలిసి వేరుచేస్తారు. పొడిగా ఉన్న పూల రెక్కలను అగరొత్తులు, సబ్బుల తయారీకి ఉపయోగిస్తాం. కస్టమైజ్డ్‌గా కూడా వీటిని తయారుచేసి ఇస్తాం. పూలతొడిమలు, మెత్తగా అయిన పూలను ఆర్గానిక్ కంపోస్ట్ తయారీలో వాడతాం. దేవుడికి ఉపయోగించిన పువ్వులు, ఈవెంట్లు, పెళ్లిళ్లలో ఉపయోగించిన పువ్వులు మాకు పెద్దమొత్తంలో వస్తుంటాయి. ఈ ఉత్పత్తుల తయారీకి యంత్రాలను ఉపయోగించం. అంతా మాన్యువల్‌గానే జరుగుతుంది. సబ్బుల్లో ఉండే హానికరమైన ఎస్ఎల్ఎస్, పేరాబుల్స్ ఈ ఉత్పత్తుల్లో ఉండవు. ఆర్గానిక్ కంపోస్ట్‌ను అర్బన్ గార్డెనర్స్‌కు అమ్ముతాం. ఇక అగరబత్తులు, సబ్బుల ప్యాకేజింగ్ కోసం ప్లాస్టిక్ వాడం. పాత వస్త్రంతో అందంగా ప్యాకింగ్ చేసి వినియోగదారులకు అందిస్తాం. ఇది కూడా మహిళలకు మంచి ఉపాధి మార్గం అయ్యింది. వాడిన పూలను ఇలా వాడడం వల్ల పర్యావరణం, పరిసరాలు కాలుష్యం కావడం లేదు. మా బిజినెస్ లాభాల బాట పట్టడానికి ఇంకా టైమ్ పడుతుంది. వ్యాపారాన్ని మరింత పెంచడానికి కొన్ని లక్ష్యాలను ఏర్పరచుకుని ఆ దిశగా కృషిచేస్తున్నాం."











పర్యావరణ పరిరక్షణకు...

- మినాల్ దాల్మియా

"నేను పుట్టింది కొల్‌కతాలో. పెరిగింది, చదువుకుంది మాత్రం హైదరాబాద్‌లోనే. కామర్స్ గ్రాడ్యుయేట్‌ని. పెళ్లయింది. ఇద్దరు పిల్లలు కాస్త పెద్దవాళ్లయిన తర్వాత కొంతకాలం మా ఫ్యామిలీ బిజినెస్ చేశా. ఆ తర్వాత మాయ, నేను కలిసి 'ఊర్వి'కి నాంది పలికాం. నాది, మాయాది పద్దెనిమిదేళ్ల స్నేహం!. మేమిద్దరం మా పిల్లల వల్లే మంచి స్నేహితులమయ్యాం. ఇద్దరి లక్ష్యాలు, ఆలోచనలు ఒకేలా ఉండడంతో బాగా దగ్గరయ్యాం.

మేము చేపట్టిన పని ఇంత భారీ స్థాయిలో ఉంటుందని తొలుత ఊహించలేదు. ఇందులోకి అడుగు పెట్టిన తర్వాత దీని లోతు మాకు అర్థమైంది. ఈ క్రమంలో మొదట మేము చేసే పనిపరంగా జనాల్ని కన్విన్స్ చేయాల్సివచ్చింది. దేవాలయాల్లో పూలు, కొబ్బరికాయలు అన్నీ ఒకే దాంట్లో వేసేవారు. అలా చేస్తే ఆ పూలు మాకు పనికి రావు. 'ఆ పూలను మేము ఏ విధంగా విడగొట్టాలి? తడి, పొడి పూలు కలిపేస్తే ఏమౌతుంది?' వంటి విషయాలను ప్రజలకు విడమరిచి చెప్పేవాళ్లం. వారు అర్థం చేసుకున్నారు. ఈ పని పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని చెప్పాం. మా ఈ ప్రయాణంలో 'మై వేస్ట్... మై రెస్పాన్సిబిలిటీ', 'రీసైకిల్ అండ్ రీయూజ్' వంటి ఆలోచనలను ప్రజలకు వివరించాం.

మాకు వచ్చే పూలలో అన్నిరకాల సీజనల్ పూలు ఉంటాయి. భవిష్యత్తులో సిటీలో పూల వ్యర్థాలను తగ్గించి వాటితో మరిన్ని ఎకో-ఫ్రెండ్లీ ఉత్పత్తులను తయారుచేసే దిశగా ఆలోచన చేస్తున్నాం. ఈ ఉత్పత్తులు ప్రారంభించిన కొద్ది కాలానికే ప్రతిష్ఠాత్మకమైన 'గ్రీన్ ఇండియా' అవార్డు రావడం మాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. మేము చేస్తున్న పనితో ప్రజలు మమేకమవడం మాకు మరింత సంతోషాన్ని ఇస్తోంది."

● నాగసుందరి

ఫొటోలు: చారి కటకం

### అంతా నేచురల్...



పాడైన పూలను కంపోస్ట్ తయారీలో వాడతాం. పొడిగా ఉన్న పూల రెక్కలను ఎండబెడతాం. ఆ తర్వాత వాటిని మెత్తగా చేస్తాం. అందులో ప్లాంట్ ఆధారిత గమ్ వాడతాం. అలా అగరొత్తులు చేస్తాం. మా ఉత్పత్తుల తయారీకి మెషీన్లు వాడొచ్చు. కానీ మా లక్ష్యం గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించడం. చేసే పని ఎకో-ఫ్రెండ్లీగా ఉండడం. అందుకే యంత్రాలు వాడడం లేదు. భవిష్యత్తులో ఎండిన పూలతో సుగంధ గుళికలు, పూలతో థర్మకోల్, దారం వంటివి తయారు చేసే ఆలోచనలో ఉన్నాం. వాటిపై అధ్యయనాలు చేస్తున్నాం. మా ఉత్పత్తులన్నింటినీ పూర్తిగా ఆర్గానిక్ మెటీరియల్‌తో చేస్తాం. ప్యాకింగ్ నుంచి లోపల చేసే బట్టర్ పేపర్ ప్యాకింగ్ వరకూ 'ఫ్లవర్‌సైక్లింగ్' టెక్నాలజీ ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాం.

---

# నా జీవితంలో మార్పు సాధ్యమేనా?

ఫ్యామిలీ కౌన్సెలింగ్

నా వివాహమై పదిహేనేళ్లయ్యింది. ఇద్దరు పిల్లలు. అయితే ఇన్నేళ్లయినా నాకు అత్తగారి ఆంక్షలు, ఆడపడుచుల అధికారం నుంచి విముక్తి దొరకడం లేదు. మొదటి నుంచీ నాకు ఎదురించి మాట్లాడటం అలవాటు లేదు. నా భర్తకి వాళ్ల అమ్మ మాట వేదం. నేను కొత్త దుస్తులు కొనుక్కున్నా, స్నేహితుల ఇంటికి వెళ్తానన్నా మా అత్తగారికి నచ్చదు. ఆమెకు అన్నీ అమర్చి పెట్టాలి. నాకు ఒంట్లో బాగాలేకపోయినా పట్టించుకోదు. ఆమె కూతుళ్లిద్దరూ ఆర్థికంగా ఉన్నతంగానే ఉన్నా, వాళ్లకీ పెట్టాలంటుంది. పిల్లల చదువులు, ఇతర ఖర్చులతో ఎంత ఇబ్బంది పడినా పైసా ఇవ్వదు. ఆమెకు ఆస్తిపాస్తులున్నాయి. మా మామగారి పెన్షన్ వస్తుంది. అయినా మందులకు కూడా మేమే పెట్టాలి. చదువుకున్నా ఉద్యోగం చేసే స్వతంత్రత లేదు నాకు. పోనీ నా భర్త అయినా అర్థం చేసుకుంటాడా అంటే అదీ లేదు. ఒక్కనాడూ నా ఇబ్బందులను విన్నదీ లేదు. పిల్లల ముఖం చూసి బతుకుతున్నా, ఒక్కోసారి ఏమిటీ జీవితం అనిపిస్తుంది. పుట్టింటివారికి నా ఇబ్బందులు చెప్పే పరిస్థితి లేదు. నా జీవితంలో మార్పు సాధ్యమేనా?

-సుమ



మీ పరిస్థితి చాలా బాధాకరంగా ఉంది. కాలం ఎంత మారినా కొందరు ఆడవాళ్ల జీవితాలు ఇలాగే ఉంటున్నాయి. ఇందుకూ ఆడవాళ్లే కారణం కావడం అత్యంత విషాదం. మీ మామగారు లేకపోవడంతో మీ అత్తగారు కొడుకుని అదుపులో పెట్టుకున్నట్టున్నారు. ఇటువంటి వాళ్లు ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్ చేయడంలో ముందుంటారు. మీవారి మెతకతనాన్ని అలుసుగా తీసుకుని మీపైన పెత్తనం చేస్తున్నారు. అయితే సాధారణంగా ఇటువంటి వారు పెళ్లయి, పిల్లలు పుట్టాక ఎంతో కొంత మారుతారు. కాకపోతే అందుకు మీరు వివాహమైన తొలిరోజుల నుంచే ప్రయత్నించాల్సింది. అత్తగారి స్వభావం... మీ భర్త, ఆడపడుచుల స్వభావం తెలుసుకుని అనుగుణంగా ప్రవర్తించాలి. మొదట్లోనే వారితో స్నేహం కుదిరితే బాగుండేది. ఈ రోజుల్లో చాలామంది అలాగే ఉంటున్నారు. కుదరకపోయినా గొడవపడక్కర్లేదు. ఎవరి పరిధి ఎంతవరకో స్పష్టం చేస్తే చాలు. ఆర్థికంగా మీకు వెసులుబాటు ఉంటే అది సులభం. ఇప్పటికైనా మీ అర్హతకి తగిన ఉద్యోగం చూసుకోండి. లేదా మీకు నచ్చిన ఏ పనైనా సరే, అప్పుడప్పుడు మీ భర్తకు మీ ఆలోచనలు స్పష్టంగా చెప్పండి. అత్తగారితో మర్యాదగా ఉంటూనే మీకు నచ్చినట్టు ఉండటం తప్పుకాదని చెప్పండి. ప్రతి అత్త కూడా కోడలిలో కూతురిని, అలాగే అత్తగారిలో కోడలు తల్లిని చూసుకుంటే చాలా సమస్యలు తేలిపోతాయి. ఇద్దరూ సిద్ధపడితేనే అది సాధ్యం.

● కె.శోభ

ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్

shobhas292@gmail.com

---

**ఆమె కుంచె పడితే అద్భుతమైన బొమ్మలు జీవం పోసుకుంటాయి. అలాగనీ ఆమె చేయి తిరిగిన చిత్రకారిణి కాదు. విధి రాతను తన రంగుల కలతో అందంగా మలుచుకున్న సాహసి. మహిళలు, వైకల్యంతో ఉన్న వారిని తక్కువగా చూసే అఫ్గనిస్థాన్‌లో పుట్టిన రొబాబా మొహమ్మదీకి చిన్నతనంలోనే కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. కానీ ఆమె మనోధైర్యాన్ని కోల్పోలేదు. నోటితోనే పెయింట్ బ్రష్ అందుకొని చూడచక్కని చిత్రాలు గీయడం మొదలెట్టింది. ఇప్పుడామె గీసిన బొమ్మలు అంతర్జాతీయ స్థాయిలో మెప్పు పొందుతున్నాయి. చక్రాల కుర్చీ సాయంతోగానీ కదలలేని ఆమె తన చిత్రాలతో ప్రపంచాన్ని కదిలిస్తోంది.**

స్ఫూర్తి



# వైకల్యాన్ని కుంచెతో దిద్దుకుంది!



అందరు పిల్లల్లాగే ఆటపాటలతో అందమైన బాల్యం గడపాలనుకున్న రొబాబా ఆశల్ని విధి ఆమెకు దూరం చేసింది. పుట్టుకతోనే ఆమెకు అరుదైన 'ఆర్థ్రోసిస్' అనే కీళ్ల వ్యాధి రావడంతో చేతులు, కాళ్లు కదిలించలేని పరిస్థితి. డాక్టర్లు కూడా 'ఏం చేయలేం' అని చేతులెత్తేశారు. తన ఈడు పిల్లలు బడికి వెళుతుంటే తనేమో ఇంటి గడప దాటలేని స్థితి చూసి చిన్నారి రొబాబా వెక్కివెక్కి ఏడ్చేది. దానికి తోడు ఇంటికి వచ్చిన బంధువులు తన తల్లిదండ్రులను ఉద్దేశించి 'ఏదో పాపం చేశారు కాబట్టే వైకల్యంతో ఉన్న పాపను కన్నారు' అంటూ గుసగులాడుకునేవారు. వారి మాటలతో ఆమెలో తను చేతకాని దాన్ని కాదని నిరూపించాలనే కసి పెరిగింది. ఒంటరిగా ఇంట్లో ఉండే ఆమె రంగుల కలలు కన్నది. చిత్రలేఖనంతో తన జీవితాన్ని కొత్తగా మలచుకోవాలనుకుంది. కానీ చేతులు, కాళ్లు సహకరించకపోవడంతో నోటితోనే పెన్సిల్ అందుకుంది. మొదట్లో నాలుక, పెదవులతో పెన్సిల్ పట్టుకొని బొమ్మలు వేసేది. పళ్ల మధ్యన పెన్సిల్ పట్టుకొని బొమ్మలు గీస్తే బాగా వస్తాయని అనిపించి, అలా సాధన చేయడం మొదలెట్టింది.

**ఫ్యామిలీ ఫ్రెండ్ సలహాతో...**

తొలుత ఆమె గీసిన కార్టూన్ బొమ్మలను వాళ్ల ఫ్యామిలీ ఫ్రెండ్ చూసి మెచ్చుకొని ప్రోత్సాహకంగా ఆమెకు రంగు పెన్సిళ్లు, క్రేయాన్స్, డ్రాయింగ్ షీట్స్ బహుమతిగా ఇచ్చాడు. ఇంట్లోవాళ్ల మద్దతుతో బొమ్మలు వేయడం కొనసాగించింది. ఒక్కో బొమ్మకు ఎక్కువ సమయం పట్టడంతో దంతాలు, దవడలు నొప్పి పుట్టి చాలా సార్లు ఏడ్చింది కూడా. ఆ సమయంలో వాళ్ల నాన్న ఇచ్చిన ధైర్యం, ప్రోత్సాహంతో పట్టువదలకుండా సాధన చేసింది. క్రమక్రమంగా పెయింట్ బ్రష్ పట్టుకొని పక్షులు, జంతువులు, పువ్వుల బొమ్మలు వేసేది. బొమ్మలకు రంగులు వేయడం, షేడింగ్ చేయడం కోసం మరింత కష్టపడింది. అలానే కుటుంబ సభ్యుల సహకారంతో చదవడం, రాయడం నేర్చుకుంది. అంతేకాదు నాలుక సాయంతో స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తుంది కూడా. "మా చెల్లిని చూస్తే మాకు ఎంతో గర్వంగా అనిపిస్తుంది. శారీరక వైకల్యం ఉన్న ఎందరికో తను ఇప్పుడు స్ఫూర్తి" అంటారు దివ్యాంగులైన పిల్లల కోసం లిటరసీ కోర్సు నిర్వహిస్తున్న రొబాబా అన్న అలీ మొహమ్మదీ.

**తనలాంటి వారి కోసం...**

ప్రస్తుతం రొబాబాకు 19ఏళ్లు. తన బొమ్మలతో స్వదేశంలో ఏర్పాటు చేసిన నాలుగు ప్రదర్శనలకు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు రొబాబా వేసిన బొమ్మలు అంతర్జాతీయంగా అమ్ముడవుతున్నాయి కూడా. వైకల్యం వల్ల ఎన్ని ఇబ్బందులు ఉంటాయో తెలిసిన ఆమె తోటి దివ్యాంగులకు చిత్రలేఖనం నేర్పించేందుకు కాబూల్‌లో ఏడాది క్రితం ఒక ఆర్ట్ సెంటర్‌ను మొదలెట్టింది. అక్కడ ప్రస్తుతం 50 మంది బొమ్మలేయడం నేర్చుకుంటున్నారు. తన పెయింటింగ్స్ అమ్మగా వచ్చిన డబ్బుతో ఈ ఆర్ట్ సెంటర్‌ను నడుపుతున్నారామె. చక్రాల కుర్చీ సాయంతో గానీ కదల్లేని రొబాబా చిత్రకళా నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక ఒక ప్రొఫైల్ రాయడంతో ఆమె ప్రతిభ అందరికి తెలిసింది. "దివ్యాంగులను చూసి చాలామంది 'వీళ్లు ఏ పని చేయలేరు' అని అనుకుంటారు. కానీ అది నిజం కాదు. ప్రతి ఒక్కరికి బలహీనతతో పాటు బలాలు ఉంటాయి. మా దేశంలో ప్రజలు నిత్యం బాంబు పేలుళ్ల శబ్దాలు వినేవారు. ఇప్పుడు వారిలో నా కథ కొత్త ఆశలు చిగురించేలా చేస్తుంది." అంటోంది రొబాబా.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
6 diksuchi@andhrajyothy.com
విజయవాడ ● గురువారం 27 ఫిబ్రవరి 2020



# ఆచరణకు అవకాశం
# ఇంటర్న్‌షిప్

ఇంటర్న్‌షిప్ అనేది ఒకప్పుడు కేవలం కొన్ని కోర్సులకే పరిమితం. కానీ ఇప్పుడు అన్ని విభాగాల్లోను ఇంటర్న్‌షిప్‌లు అందుబాటులోకి వచ్చాయి. అదే సమయంలో రెజ్యూమెకు అదనపు విలువ చేకూర్చడంతోపాటు చాలాసార్లు ఉద్యోగాన్వేషణలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుండటంతో విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా కంపెనీలు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు నియామక ప్రక్రియలో భాగంగా ఇంటర్న్‌షిప్స్‌ను పరిగణనలోకి తీసుకొని జాబ్‌ను ఆఫర్ చేస్తున్నాయి.

**ఇంటర్న్‌షిప్ ఉద్యోగానికి తొలి మెట్టు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జాబ్ రెడీ స్కిల్స్, ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్, రియల్ టైం ఎక్స్‌పీరియన్స్‌ను అందించేవి ఇంటర్న్‌షిప్స్. తరగతి గదుల్లో బోధించిన అంశాలను వాస్తవ పరిస్థితులకు అన్వయించగలిగే అవకాశం వీటి ద్వారా లభిస్తుంది. ఇటీవలి కాలంలో ఇంటర్న్‌షిప్‌లకు చాలా ప్రాధాన్యం ఏర్పడింది. ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో కంపెనీలు ఇంటర్న్‌షిప్‌ను ఒక తప్పనిసరి అర్హతగా భావిస్తున్నాయి. చాలా సంస్థలు కోర్సుల్లో భాగంగా ఇంటర్న్‌షిప్‌లను పరిగణిస్తున్నాయి. స్వల్ప వ్యవధి ఇంటర్న్‌షిప్‌లకు సరైన సమయం వేసవి సెలవులు. కెరీర్‌పరంగా నిర్ణయాత్మక మలుపుగా నిలుస్తోన్న ఇంటర్న్‌షిప్స్ గురించి సమగ్రంగా తెలుసుకుందాం..**

## ఎన్నో రకాలు

ఇంటర్న్‌షిప్‌లో ఎన్నో రకాలు ఉన్నాయి. సమ్మర్ ఇంటర్న్‌షిప్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ ఇంటర్న్‌షిప్స్, పెయిడ్ ఇంటర్న్‌షిప్స్, ఇంటర్న్‌షిప్స్ విత్ జాబ్ ఆఫర్, పార్ట్ టైమ్ ఇంటర్న్‌షిప్స్ ఇలా ఎన్నో. వీటిలో మనకు అనుకూలమైన వాటిని ఎంచుకోవచ్చు.

## సమ్మర్ ఇంటర్న్‌షిప్స్

త్వరలో వేసవి సెలవులు వస్తున్నాయ్. వీటిని గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవడానికి చక్కని అవకాశం సమ్మర్ ఇంటర్న్‌షిప్స్. వేసవి ఇంటర్న్‌షిప్‌లలో చేరి సంబంధిత రంగంలో పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవచ్చు. సమ్మర్ ఇంటర్న్‌షిప్‌ల వ్యవధి సాధారణంగా 2-6 నెలలు ఉంటుంది. కొన్ని సంస్థలు ఆఫర్ చేస్తున్న సమ్మర్ ఇంటర్న్‌షిప్స్... యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ కెమిస్ట్రీ సమ్మర్ ప్రాజెక్ట్ దరఖాస్తుకు చివరి తేదీమార్చి 15, ఐఐఎస్ఈఆర్ - పుణె దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 29, బటర్‌ఫ్లయ్ ఫీల్డ్స్ ప్రైవేట్ లిమిటెడ్ దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 3, ఎస్ఎన్ బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 25, ఐఐఎస్సీ - బెంగళూరు దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 29, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటికల్ సైన్సెస్ దరఖాస్తుకు చివరి తేదీ ఫిబ్రవరి 28, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 1, తదితర సంస్థలు. వీటిలో కొన్ని సంస్థలు స్టయిపెండ్‌ను కూడా అందజేస్తున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, కేపీఎంజీ, పీడబ్ల్యూసీ, డెలాయిట్, ఉబర్ మొదలైన సంస్థల్లో కూడా విద్యార్థులకు వేసవి ఇంటర్న్‌షిప్‌లు లభిస్తున్నాయి. ఆయా సంస్థల వెబ్‌సైట్ల ద్వారా సంబంధిత సమాచారాన్ని పొందొచ్చు.

## వర్క్ ఫ్రమ్ హోమ్

ఇంటర్న్‌షిప్స్‌లో కూడా వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం ఉంది. వెసోర్స్‌యు (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, మార్కెటింగ్), ఇంటెల్లీఫై (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, ఆపరేషన్స్), లెక్స్‌క్వెస్ట్ ఫౌండేషన్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, సీఎస్ఆర్ ఎంగేజ్‌మెంట్), అవెనెస్టో ఇంటర్నేషనల్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, సోషల్ మీడియా మార్కెటింగ్), త్రివూ బిజ్ ఎల్ఎల్‌పీ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, వెబ్ డెవలప్‌మెంట్, సోషల్ మీడియా మార్కెటింగ్), ప్రోలీజూన్ ఇండస్ట్రీస్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, గ్రాఫిక్ డిజైన్), ఎస్కేఈకామ్ వెంచర్స్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, కంటెంట్ రైటింగ్) తదితర సంస్థలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇంటర్న్ అవకాశాన్ని ఇస్తున్నాయి. నెలకు రూ. 2 వేల నుంచి రూ. 15 వేల వరకు స్టయిపెండ్‌ను కూడా ఆఫర్ చేస్తున్నాయి.

## స్టయిపెండ్‌తో

కొన్ని కార్పొరేట్ సంస్థలు పెద్ద మొత్తంలో స్టయిపెండ్‌తోపాటు ఇంటర్న్‌షిప్స్‌ను అందజేస్తున్నాయి. ఏర్‌బీఎన్‌బీ, పెప్సికో, మింత్రా, అమెజాన్, ఉబర్ ఇండియా, పేటీఎం, ఓలా, రిలయన్స్ జియో, పేపాల్, మైక్రోసాఫ్ట్, మోర్గాన్ స్టాన్లీ, ఫ్లిప్‌కార్డ్, ఇంటెల్, డెలాయిట్ వంటి సంస్థలు ఇటువంటి ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తున్నాయి. ఈ సంస్థలు నెలకు రూ. 15 వేల నుంచి రూ. 50 వేల వరకు స్టయిపెండ్ ఇస్తున్నాయి. ఈ ఇంటర్న్‌షిప్స్ చాలా వరకూ ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. ఆయా సంస్థలకు చెందిన అధికారిక వెబ్‌సైట్ల నుంచి వీటి కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లేదా ఆయా సంస్థల్లో పని చేసే ఉద్యోగుల రిఫరెన్స్ ద్వారా ఇంటర్న్‌షిప్స్‌ను దక్కించుకోవచ్చు.

## పార్ట్ టైమ్

కాలేజీ విద్యార్థులకు, ఇతర ఔత్సాహికులకు పార్ట్ టైమ్ ఇంటర్న్‌షిప్స్ చేసే అవకాశాన్ని కొన్ని సంస్థలు ఇస్తున్నాయి. అవి.. ఫోరెన్సిక్ గోపాల్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, సోషల్ మీడియా మార్కెటింగ్), బడ్డింగ్.ఇన్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, హ్యూమన్ రిసోర్స్), ఇషికా టేబుల్‌వేర్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, గ్రాఫిక్ డిజైన్), బ్రింగాన్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, బిజినెస్ డెవలప్‌మెంట్), గ్లింప్స్ అనలిటిక్స్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, ఆపరేషన్స్), వీ2ఎస్‌టెక్ సొల్యూషన్స్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, హ్యూమన్ రిసోర్స్) తదితర సంస్థలు. వీటి కాల వ్యవధి నెల నుంచి మూడు నెలలు. నెలకు రూ. 2 వేల నుంచి రూ. 15 వేల వరకు స్టయిపెండ్‌ను కూడా ఆఫర్ చేస్తున్నాయి.

## జాబ్ ఆఫర్ కూడా

కొన్ని సంస్థలు ఇంటర్న్‌గా వచ్చిన వారికే జాబ్‌ను ఆఫర్ చేస్తున్నాయి. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ అండ్ ఎంప్లాయర్స్ (ఎన్ఏసీఈ) నివేదిక ప్రకారం 52 శాతం మందిని ఇంటర్న్‌షిప్‌లు ఇచ్చిన సంస్థలే ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా తీసుకుంటున్నాయి. ప్రస్తుతం అభ్యర్థులను పూర్తి స్థాయిలో పరీక్షించడానికి ఇంటర్న్‌షిప్స్‌ను కంపెనీలు చక్కని అవకాశంగా పరిగణిస్తున్నాయి. ఇంటర్న్‌తోపాటు జాబ్‌ను ఆఫర్ చేస్తున్న సంస్థలు.. ఎనేబుల్ డిజిటల్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, డిజిటల్ మార్కెటింగ్), హెచ్‌పీసీ స్ఫియర్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, సీ / సీ++, డెవలప్‌మెంట్), ఇన్‌సిగ్మా టెక్నాలజీస్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, బిజినెస్ అనలిటిక్స్), వీమాల్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, గ్రాఫిక్ డిజైన్), సబ్‌హాగ్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, యానిమేషన్), బ్లింక్‌ఇన్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, బిజినెస్ డెవలప్‌మెంట్), ఇండిగో సొల్యూషన్స్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, ఇన్‌సైడ్ సేల్స్), టెక్‌డ్యూ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, పీహెచ్‌డీ డెవలప్‌మెంట్) తదితర సంస్థలు. ఇవన్నీ నెల నుంచి ఐదు / ఆరు నెలలపాటు ఇంటర్న్‌గా తీసుకుంటాయి. ఆ సమయంలో నెలకు రూ. 2 వేల నుంచి రూ. 15 వేల వరకు స్టయిపెండ్‌ను కూడా ఇస్తున్నాయి. తరవాత జాబ్‌ను ఆఫర్ చేస్తాయి. అయితే ఉత్తీర్ణత శాతం, ఉత్తీర్ణులైన సంవత్సరం, కావాల్సిన స్కిల్స్ వంటి అంశాల్లో కొన్ని నిబంధనలను కంపెనీలు పాటిస్తాయి. కాబట్టి ముందుగా ఆ అంశాలను తెలుసుకోవాలి. తదనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలి.

### ఇలా తెలుసుకోవాలి

ప్రస్తుతం ఇంటర్నెట్‌లో ఇంటర్న్‌షిప్స్ గురించి సమాచారాన్ని అందజేసే ఎన్నో వెబ్‌సైట్స్ / బ్లాగ్స్ / పోర్టల్స్, ఆన్‌లైన్ ఫోరమ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా ఇంటర్న్‌షిప్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. కాలేజీలోని కెరీర్ సర్వీస్ విభాగం / ప్లేస్‌మెంట్ ఆఫీసర్, కాలేజీ ఆలమ్ని, ప్రొఫెసర్లు, స్నేహితులు, సీనియర్ల ద్వారా ఇంటర్న్‌షిప్స్ సమాచారాన్ని పొందొచ్చు. పరిశోధనల్లో నిమగ్నమైన సంస్థలు తరచుగా ఇంటర్న్‌షిప్స్‌ను ఆఫర్ చేస్తుంటాయి. గూగుల్, యాహూ, ఎంఎస్ఎన్ సెర్చ్ ఇంజిన్లు నాస్కామ్, సీఐఐ, ఎస్‌టీపీఐ వంటి సంస్థల వెబ్‌సైట్ల ద్వారా ఇంటర్న్‌షిప్స్ గురించి తెలుసుకోవచ్చు.

### అన్ని రంగాల్లో

ఇంటర్న్‌షిప్స్ అనేవి మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ విద్యార్థులకే పరిమితం కాలేదు. హ్యూమానిటీస్, సైన్స్, కామర్స్ నేపథ్యం ఉన్న వారు కూడా తమ ప్రొఫైల్స్‌కు అనుగుణంగా సంబంధిత రంగాల్లో ఇంటర్న్‌షిప్‌లు చేయవచ్చు. హ్యూమానిటీస్ విద్యార్థులు కంటెంట్ రైటింగ్, ఎడిటోరియల్ ఇంటర్న్‌షిప్స్, మీడియా, జర్నలిజం ఇంటర్న్‌షిప్‌లు చేయటానికి వీలుంది. సైన్స్ విద్యార్థులు ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తల వద్దా, పరిశోధన సంస్థల్లోనూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇంటర్న్‌లుగా చేరవచ్చు. కామర్స్ విద్యార్థులకు ఫైనాన్స్, అకౌంట్స్, సీఏ మొదలైన ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. ఎన్‌జీఓ, బిజినెస్ డెవలప్‌మెంట్, ఆపరేషన్స్, సోషల్ అండ్ డిజిటల్ మార్కెటింగ్‌లలో అన్ని రకాల విద్యార్థులూ ఇంటర్న్‌షిప్‌లు చేయవచ్చు. టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులకూ అవకాశాలు లభిస్తున్నాయి.

### మహిళల కోసం ప్రత్యేకంగా



కొన్ని సంస్థలు మహిళల కోసం ప్రత్యేకంగా ఇంటర్న్‌షిప్స్ అందజేస్తున్నాయి. ముఖ్యంగా బ్రేక్ తీసుకొని తిరిగి కెరీర్ ప్రారంభించాలనుకునే మహిళలకు ఈ ఇంటర్న్‌షిప్స్ తోడ్పడతాయి. హర్‌లాక్స్ సాఫ్ట్‌వేర్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, బిజినెస్ డెవలప్‌మెంట్), వుబూట్ ఇంటెలిజెన్స్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, కంప్యూటర్ విజన్), బిల్డ్ నెక్ట్స్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, యూఎక్స్ /యూఐ డిజైన్), హైదరాబాద్ ఫుట్‌బాల్ లీగ్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, ఫోటోగ్రఫీ), ఎలైట్ ఎంటర్ మీడియా (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, కంటెంట్ రైటింగ్), ఫ్యూచరిస్టిక్ ల్యాబ్స్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 12, సోషల్ మీడియా మార్కెటింగ్), కోడర్ టెక్ (దరఖాస్తుకు చివరి తేదీ మార్చి 11, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్) తదితర సంస్థలు ఇటువంటి ఇంటర్న్‌షిప్స్‌ను అందజేస్తున్నాయి. ఇవన్నీ నెల నుంచి ఐదు / ఆరు నెలలపాటు ఇంటర్న్‌గా తీసుకుంటాయి. ఆ సమయంలో నెలకు రూ. 2 వేల నుంచి రూ. 15 వేల వరకు స్టయిపెండ్‌ను కూడా ఇస్తున్నాయి.

### ప్రయోజనాలివే

ఒక అభ్యర్థి ఇంటర్న్‌గా చేరిన తర్వాత వారి పని తీరు, దృక్పథం ఆధారంగా ఉద్యోగం కల్పించే వెసులుబాటు కంపెనీలకు లభిస్తుంది. పని, వాతావరణం, సంస్థ విధానాలు అన్నీ కుదిరితేనే ఉద్యోగంలో చేరే అవకాశం అభ్యర్థులకు ఉంటుంది. ఉద్యోగికి కావాల్సిన అర్హతలు, లక్షణాలు పెంపొందించుకోవడంతో పాటు, ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతం చేసుకోవడం, వాస్తవ పరిస్థితులపై అవగాహన పెంచుకోవడానికి ఇంటర్న్‌షిప్ ఉపకరిస్తుంది. సంబంధిత విభాగంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఏర్పడుతుంది. సీనియర్లతో కలసి పని చేయడం వల్ల ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంచుకునేందుకు వీలుంటుంది.

### ఎంపిక ఇలా

దరఖాస్తు చేసుకున్న అందరికీ ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం రాదు. కంపెనీలు దరఖాస్తుదారుల్లోని నైపుణ్యాలను పరిశీలించి మరీ ఇంటర్న్‌గా చేరేందుకు అంగీకరిస్తాయి. ఎల్లప్పుడూ నేర్చుకోవడానికి సిద్ధంగా, సానుకూల ధోరణితో ఉండే వారికి ఇంటర్న్‌గా అవకాశం లభిస్తుంది. ఎందుకంటే ఇటువంటి వారిని అవసరాలకు అనుగుణంగా సులువుగా తీర్చిదిద్దుకోవచ్చనే భావనలో కంపెనీలు, సంస్థలు ఉంటాయి. కొన్ని కంపెనీలు రియల్ జాబ్ ఇంటర్వ్యూను తలపించేలా ఆప్టిట్యూడ్ టెస్ట్, హెచ్ ఆర్ రౌండ్, టెక్నికల్ రౌండ్ నిర్వహించి ఇంటర్న్‌గా అవకాశం ఇస్తున్నాయి.

**ఉపయోగపడే వెబ్‌సైట్లు:** internshala.com, internhq.com, hellointern.com, lets intern.com skillenza.com, linkedin.com

## జాబ్ కార్నర్

### ప్రాజెక్ట్ క్లర్క్

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) - హైదరాబాద్, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- మొత్తం ఖాళీలు: **5**
- పోస్టులు: ప్రాజెక్ట్ క్లర్క్, ప్రాజెక్ట్ వర్క్ అసిస్టెంట్
- అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, అనుభవం
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 16, 2020
- వెబ్‌సైట్: www.tifrh.res.in/

### జూనియర్ కన్సల్టెంట్

నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ (నాబ్‌కాన్స్) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **78**
- భర్తీ చేసే పోస్టులు: జూనియర్ కన్సల్టెంట్, సీనియర్ కన్సల్టెంట్.
- అర్హత: పోస్టును అనుసరించి గ్రాడ్యుయేషన్ / ఎంబీఏ / పోస్టుగ్రాడ్యుయేషన్, కంప్యూటర్ నాలెడ్జ్, స్థానిక భాషలో పరిజ్ఞానం, అనుభవం.
- ఎంపిక విధానం: మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 10, 2020
- వెబ్‌సైట్: www.nabcons.com/

### టీచింగ్ పోస్టులు

సంబల్‌పుర్ యూనివర్సిటీ, టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **53**
- పోస్టుల వారీగా ఖాళీలు: ప్రొఫెసర్ - 10, అసోసియేట్ ప్రొఫెసర్ - 18, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 25.
- విభాగాలు: బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, ఇంగ్లీష్, లా తదితరాలు.
- అర్హత: పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, అనుభవం.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 16, 2020
- వెబ్‌సైట్: http://www.suniv.ac.in/

### మేనేజ్‌మెంట్ ట్రెయినీ

నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (నాల్కో) - భువనేశ్వర్, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...

- మొత్తం ఖాళీలు: **12**
- పోస్టులు - ఖాళీలు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఫైనాన్స్) - 8, అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్) - 4.
- అర్హత: ఏదైనా డిగ్రీ, సీఏ
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18, 2020.
- వెబ్‌సైట్: https://nalcoindia.com/

## లిటిల్స్

తెలుసా!



### ఈ కోడిగుడ్డు ప్రత్యేకం!

కోడిగుడ్డు మీద చిన్న రంధ్రం చేయాలని చూస్తేనే అంది పగిలిపోతుంది. అలాంటిది కోడిగుడ్డు మీద ఏకంగా 12 వేల సూక్ష్మ రంధ్రాలు చేసి సరికొత్త రికార్డు సృష్టించారు టర్కీకి చెందిన హమిత్ హయ్‌రన్. 62 ఏళ్ల హమిత్‌కు కోడిగుడ్డు మీద బొమ్మలు వేయడం అంటే చాలా ఇష్టం. పని చేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంతో ఇంటికే పరిమితం అయిన ఆయన కోడిగుడ్డు పెంకుల మీద బొమ్మలు వేయడం మొదలెట్టాడు. ఇప్పటివరకూ వివిధ దేశాల నేతల ఫొటోలు, జంతువుల చిత్రాలు చాలానే గీశారాయన. ప్రపంచంలోనే ఈ తరహా విద్య వచ్చిన కొద్దిమంది ఆర్టిస్ట్‌ల్లో ఒకడిగా గుర్తింపు సాధించారు కూడా. గతంలో ఈ రికార్డు పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి 8,708 సూక్ష్మ రంధ్రాలు చేసి రికార్డు నెలకొల్పాడు. ఆ రికార్డును హమిత్ హయ్‌రన్ 12వేల రంధ్రాలు చేసి బద్దలుకొట్టాడు.

### ఏ భాగం ఎక్కడ?



### దారి కనుక్కోండి



### రంగులు వేయండి



### బొమ్మల పేర్లు రాయండి



### డైలీ సుడోకు - 292

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 8 | 2 | 1 | 6 | 3 | | 7 |
| | | | 5 | 3 | 4 | 9 | | 2 |
| 2 | 3 | 4 | 9 | 8 | | | 5 | |
| | 2 | 5 | | 4 | | | 9 | 3 |
| 4 | | | | | | | | 8 |
| 8 | 1 | | | 5 | | 2 | 6 | |
| | 4 | | | 2 | 5 | 8 | 7 | 9 |
| 1 | | 7 | 6 | 9 | 3 | | | |
| 9 | | 2 | 4 | 7 | 8 | 1 | | |

సుడోకు- 291 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 1 | 8 | 6 | 2 | 3 | 4 | 5 | 7 |
| 5 | 6 | 3 | 7 | 8 | 4 | 1 | 2 | 9 |
| 2 | 4 | 7 | 9 | 5 | 1 | 8 | 6 | 3 |
| 8 | 9 | 5 | 4 | 3 | 7 | 6 | 1 | 2 |
| 6 | 2 | 4 | 1 | 9 | 8 | 7 | 3 | 5 |
| 3 | 7 | 1 | 2 | 6 | 5 | 9 | 4 | 8 |
| 4 | 3 | 6 | 5 | 7 | 9 | 2 | 8 | 1 |
| 1 | 8 | 9 | 3 | 4 | 2 | 5 | 7 | 6 |
| 7 | 5 | 2 | 8 | 1 | 6 | 3 | 9 | 4 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ వరుసలోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



VIACOM 18 STUDIOS
రేపే విడుదల
VIACOM18 STUDIOS & ANTO JOSEPH FILM COMPANY
DULQUER SALMAAN
కనులు కనులను దోచాయంటే
PRODUCED BY VIACOM18 STUDIOS & ANTO JOSEPH FILM COMPANY
WRITTEN AND DIRECTED BY DESINGH PERIYASAMY
KFC ENTERTAINMENT




LACHHURAM PRODUCTIONS
SARASWATI DEVELOPERS
PRESENTS
రేపే విడుదల
మంగ్లీ నటించిన తొలి చిత్రం
MANGLI IN & AS
స్వేచ్ఛ
SAVE THE GIRLS & SAVE THE TREES
Producer : Amgoth Raju Nayak
Director : K.P.N. Chowhan
Music : Bhole
DOP: Vijay Tagoor




SATHYA JYOTHI FILMS
T.G. THYAGARAJAN PRESENTS
VIGNESWARA ENTERTAINMENTS
ASSOCIATION WITH Smt. JAGANMOHINI
DHANUSH IN & AS
రేపే విడుదల
లోకల్ బాయ్
WRITTEN & DIRECTED BY R.S.DURAI SENTHILKUMAR
SENDHIL THYAGARAJAN - ARJUN THYAGARAJAN




SRI SHAKTY SWAROOP MOVIE CREATIONS
RELEASING TOMORROW
SUBBU VEDULA
రాహు
RAAHU
A.V.R SWAMY M.SC (AG)
RAJA DEVARAKONDA
SRI SHAKTHI BABJI
SUBBU VEDULA
SRINIVASARAO BETHAPUDI
SURESH RAGUTU
ESHWAR YELLUMAHANTHI
LAKKARAJU
NABA & ROBIN SUBBU
GSK MEDIA
AMAR REDDY
WRONG TIME. WRONG PLACE. WRONG GIRL.




bhavya creations
march 6th release
censored clean
U
ఒ..పిట్టకథ
it's a long story...
వి.ఆనంద్‌ప్రసాద్
చెందు ముద్దు




HAAWSOME BLOCKBUSTER
PDV PRASAD PRESENTS
SITHARA ENTERTAINMENTS
భీష్మ
SINGLE FOREVER
SURYADEVARA NAGA VAMSI
VENKY KUDUMULA
SAI SRIRAM
MAHATI SWARA SAGAR
NAVIN NOOLI
SAHI SURESH
VENKAT
S.VENKATARATHNAM (VENKAT)




WALL POSTER CINEMA
NANI PRESENTS
రేపే విడుదల
MISSING
PREETHI
VISHWAK SEN IN
HIT
THE FIRST CASE
PRODUCED BY PRASHANTI TIPIRNENI
WRITTEN & DIRECTED BY Dr SAILESH KOLANU
DOP S MANIKANDAN
MUSIC DIRECTOR VIVEK SAGAR
ART DIRECTOR AVINASH KOLLA
EDITOR GARRY BH
EXECUTIVE PRODUCER S VENKATARATHNAM (VENKAT)
SOUND DESIGN SYNC CINEMA
STUNTS NABA
PUBLICITY DESIGNERS ANIL & BHANU
PRO VAMSI KAKA
#HITMOVIE
SONY MUSIC
U/A

| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 39,888.96 | 11,678.50 | 42,655 | 47,165 | 71.65 | 53.62 |
| 392.24 | 119.40 | ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) 153 | 890 | (20 పైసలు) | |

# గంటకు రూ.7 కోట్లు

## గత ఏడాది ముకేశ్ అంబానీ సంపాదన.. భారత కుబేరుల్లో నెం.1 ఆయనే

## దేశంలో 34 మంది కొత్త బిలియనీర్లు.. మొత్తం 138 మంది

## హురున్ రిచ్ లిస్ట్ విడుదల



భారత్‌లో కుబేరుల సంఖ్య జోరుగా పెరుగుతోంది. గత ఏడాదిలో మన దేశంలో సగటున ప్రతి నెలలో ముగ్గురు డాలర్ బిలియనీర్లు ఆవిర్భవించారు. 34 మంది కొత్త బిలియనీర్లు జతకావడంతో దేశంలోని బిలియనీర్ల (వంద కోట్ల డాలర్ల సంపద) సంఖ్య ఏడాదికాలంలో 138కి ఎగబాకింది. ఆర్థిక వ్యవస్థలో మందగమనం కొనసాగిన తరుణంలో బిలియనీర్ల సంఖ్య పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే భారత్ బిలియనీర్లలో మూడోస్థానంలో నిలిచిందని హురున్ గ్లోబల్ రిచ్ 2020 జాబితా వెల్లడించింది. వీరిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) చైర్మన్ ముకేశ్ అంబానీ అగ్రస్థానంలో నిలిచారు. ఈయన నికర విలువ 6,700 కోట్ల డాలర్లు. గత ఏడాది ఈయన సంపద గంటకు రూ.7 కోట్లు పెరిగింది. ప్రపంచ కుబేరుల్లో ముకేశ్ అంబానీ తొమ్మిదో స్థానంలో ఉన్నారు. ప్రపంచ బిలియనీర్లలో 14,000 కోట్ల డాలర్లతో అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ అగ్రస్థానంలో నిలిచారు.

చైనా 799 మంది బిలియనీర్లతో ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండగా.. 626 మంది బిలియనీర్లు ఉన్న అమెరికా రెండో స్థానంలో నిలిచింది. హురున్ జాబితాలో ప్రపంచవ్యాప్తంగా 2,817 మందికి స్థానం లభించింది. 100 కోట్ల డాలర్లు లేదా అంతకన్నా ఎక్కువ నికర విలువ కలిగిన వారికి ఈ జాబితాలో స్థానం కల్పించారు. 2019 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా 480 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. అంటే రోజుకు ఒకరికన్నా ఎక్కువ మంది బిలియనీర్లుగా మారారన్న మాట. చైనాలో వారంలో ముగ్గురికన్నా ఎక్కువ మంది బిలియనీర్లు తయారయ్యారు.

### హురున్ జాబితాలో ఇంకా ఏముందంటే

- భారత్, అమెరికాలో ఉన్న సంపన్నులకన్నా చైనాలోనే అధిక సంపన్నులు ఉన్నారు. ఈ ఏడాదిలో ఇంకా ఎక్కువ మంది ఈ దేశంలో బిలియనీర్లుగా మారే అవకాశంఉండేది. కానీ కరోనా వైరస్ విజృంభణ అనేక మందిపై ప్రభావం చూపుతోంది.
- ఇక భారత్‌లో ఉన్న సంపన్నుల్లో మూడు వంతులకు పైగా (50 మంది - 21,800 కోట్ల డాలర్ల సంపద) ముంబైలోనే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ముంబై తొమ్మిదో అతిపెద్ద సంపన్న నగరంగా నిలిచింది.
- న్యూఢిల్లీలో 30 మంది (7,600 కోట్ల డాలర్లు), బెంగళూరులో 17 మంది (4,200 కోట్ల డాలర్లు), అహ్మదాబాద్‌లో 12 మంది బిలియనీర్లు (3,600 కోట్ల డాలర్లు), హైదరాబాద్‌లో ఏడుగురు (1,300 కోట్ల డాలర్లు) ఉన్నారు.
- దేశంలోని సంపన్నుల్లో ఎస్‌పీ హిందుజా కుటుంబం (2,700 కోట్ల డాలర్లు) రెండో స్థానంలో, గౌతమ్ అదానీ (1,700 కోట్ల డాలర్లకు పైగా) మూడో స్థానంలో, శివ్ నాడార్ ఆయన కుటుంబం ( దాదాపు 1,700 కోట్ల డాలర్లు) నాలుగో స్థానంలో, లక్ష్మీ మిట్టల్ (1,500 కోట్ల డాలర్లు) ఐదో స్థానంలో నిలిచారు. ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ (దాదాపు 1,500 కోట్ల డాలర్లు) ఆరో స్థానంలో ఉన్నారు. స్వతహాగా బిలియనీర్‌గా మారిన ప్రపంచంలోని ఏకైక బ్యాంకర్ ఈయనే కావడం విశేషం.
- ఏడో స్థానంలో అజీమ్ ప్రేమ్‌జీ (1,400 కోట్ల డాలర్లు), ఎనిమిదో స్థానంలో సీరమ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన సైరస్ పూనావాలా (1,200 కోట్ల డాలర్లు) నిలిచారు.
- 24 ఏళ్ల వయసున్న ఓయో వ్యవస్థాపకుడు రితేష్ అగర్వాల్ సంపద 110 కోట్ల డాలర్లుగా ఉంది. దేశంలో అతిపిన్న సంపన్నుడు ఈయనే కావడం విశేషం.
- దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనం కొనసాగుతోంది. వృద్ధి రేటు మందగిస్తోంది. అయినప్పటికీ సంపన్నుల వృద్ధికి మాత్రం ఎలాంటి ఆటంకం ఏర్పడకపోవడం గమనార్హం.
- 2019 సంవత్సరంలో అమెరికా స్టాక్ మార్కెట్లు 26 శాతం పెరిగాయి. భారత్, చైనా మార్కెట్లు వరుసగా 15 శాతం, 14 శాతం వృద్ధి చెందాయి.

### తెలుగు శ్రీమంతులు

| పేరు | సంపద (కోట్ల డాలర్లు) | కంపెనీ | ర్యాంక్ |
|---|---|---|---|
| మురళీ దివి, కుటుంబం | 430 | దివీస్ ల్యాబ్స్ | 589 |
| పీ పిచ్చి రెడ్డి | 190 | ఎంఈఐఎల్ | 1,530 |
| పీవీ కృష్ణా రెడ్డి | 180 | ఎంఈఐఎల్ | 1,607 |
| పీవీ రాంప్రసాద్ రెడ్డి | 180 | అరబిందో ఫార్మా | 1,607 |
| జూపల్లి రామేశ్వర్ రావు, కుటుంబం | 140 | మై హోమ్ | 2,000 |
| కే సతీష్ రెడ్డి | 120 | డాక్టర్ రెడ్డీస్ | 2,276 |
| జీవీ ప్రసాద్, జీ అనురాధ | 100 | డాక్టర్ రెడ్డీస్ | 2,642 |

# రూ.2,000 నోట్ల కథ కంచికి?

» ఏటీఎంల్లోనూ బంద్.. నోట్ల ముద్రణ బంద్



న్యూఢిల్లీ : రూ.2,000 నోట్ల కథ కంచికి చేరుతోంది. తమ ఏటీఎంల్లో ఈ నోట్లు పెట్టడాన్ని బ్యాంకులు క్రమంగా ఆపేస్తున్నాయి. ఇండియన్ బ్యాంక్ అయితే మార్చి 1 నుంచి తమ ఏటీఎంల్లో రూ.2,000 నోట్లను పూర్తిగా ఆపేస్తున్నట్టు ప్రకటించింది. మిగతా బ్యాంకులూ ఇందుకు సిద్ధమవుతున్నాయి. ప్రతి ఏటీఎంల్లో నాలుగు అరలు (క్యాసెట్స్) ఉంటాయి. ఇందులో మూడు అరల్లో రూ.500 నోట్లు ఉంచి, రూ.2,000 నోట్లు ఉంచే మిగతా అరలో రూ.100 లేదా రూ.200 నోట్లు ఉంచాలని బ్యాంకులు నిర్ణయించాయి. చాలా బ్యాంకులు ఇప్పటికే ఈ పని పూర్తి చేశాయి. మిగతా బ్యాంకులూ ఏడాదిలోగా ఈ పని పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే తమ శాఖల్లో మాత్రం బ్యాంకులు రూ.2,000 నోట్లను తీసుకోవడం, ఇవ్వడం చేస్తున్నాయి. ఆర్‌బీఐ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోయినా ఖాతాదారుల సౌలభ్యం కోసం ఈ పని చేస్తున్నట్టు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

### ముద్రణా ఆగిపోయింది

పెద్ద నోట్ల రద్దు తర్వాత 2016లో ప్రవేశ పెట్టిన రూ.2,000 నోట్ల ముద్రణ ఇప్పటికే ఆగిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు ఒక్క రూ.2,000 నోటును కూడా ముద్రించలేదు. గత ఏడాదిన్నరగా ఇదే పరిస్థితి. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా ఆర్‌బీఐ ఈ విషయం వెల్లడించింది. దీంతో దేశంలో చలామణిలో ఉన్న ద్రవ్య నోట్లలో రూ.2,000 నోట్ల శాతం తగ్గిపోతోంది. 2016-17లో చలామణిలో ఉన్న మొత్తం నోట్లలో రూ.2,000 నోట్ల వాటా 3.3 శాతం. 2018-19కి వచ్చే సరికి ఇది మూడు శాతానికి పడిపోయింది.

# విపణిలోకి టయోటా ‘వెల్‌ఫైర్’

» ఎగ్జిక్యూటివ్ లాంజ్ స్థాయిలో సదుపాయాలు
» సెల్ఫ్ ఛార్జింగ్ హైబ్రిడ్ ఈవీ » హైదరాబాద్‌లో విడుదల
» ధర రూ.79.5 లక్షలు.. లీటరుకు 16.35 కి.మీ మైలేజీ




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రపంచ స్థాయి లగ్జరీ వాహనం ‘టయోటా వెల్‌ఫైర్’ను భారత విపణిలోకి టయోటా కిర్లోస్కర్ మోటార్ (కేటీఎం) విడుదల చేసింది. సెల్ఫ్-ఛార్జింగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనమైన ‘వెల్‌ఫైర్’ మల్టీ పర్పస్ వేహికల్ (మినీ వ్యాన్). భారత్ మార్కెట్‌లో టయోటా తొలి లగ్జరీ వాహనం ఇదే. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 6 లక్షల వెల్‌ఫైర్ వాహనాలను విక్రయించామని.. తాజాగా భారత విపణిలోకి విడుదల చేస్తున్నామని కేటీఎం వైస్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్ తెలిపారు. సెల్ఫ్ ఛార్జింగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాల్లో (ఈవీ) ఇంధన వినియోగం తక్కువగా ఉంటుంది. వాయు కాలుష్యం తగ్గుతుంది. ఎలక్ట్రిక్ వాహనాల తరహాలో హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాల్లో ప్రత్యేకంగా బ్యాటరీ ఛార్జింగ్ చేయాల్సిన అవసరం లేదు. హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వాహనాల్లో 40 శాతం దూరం, సమయం పరంగా 60 శాతం వాహనం విద్యుత్ మీదే నడుస్తుంది. కేరళ మినహా దేశ వ్యాప్తంగా ‘వెల్‌ఫైర్’ ఎక్స్‌షోరూమ్ ధర రూ.79.5 లక్షలు ఉంటుంది. సమీప భవిష్యత్తులో దేశీయ మార్కెట్‌లోకి మరో లగ్జరీ వాహనాన్ని విడుదల చేసే వీలుందని విక్రమ్ అన్నారు. వెల్‌ఫైర్ కారులోని ఇంటీరియర్లు, సీట్లు, ఇతర సదుపాయాలు పెద్ద ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ని తలపించే విధంగా ఉంటాయన్నారు. 2.5 లీటర్ల గ్యాసోలిన్ హైబ్రిడ్ ఇంజిన్, డ్యుయల్ మోటర్లు ఉంటాయి. ప్రామాణిక పరిస్థితుల్లో లీటర్ పెట్రోల్‌కు 16.35 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ సోనీ తెలిపారు. 4 సిలెండర్ల గ్యాసోలిన్ హైబ్రిడ్ ఇంజిన్ 115 బీహెచ్‌పీ పవర్‌ను విడుదల చేస్తుంది. గరిష్ఠ 2800-4,000 ఆర్‌పీఎం వద్ద 198 ఎన్ఎం టర్క్ ఉంటుంది.

### హైదరాబాద్‌లో ఎందుకంటే..

వెల్‌ఫైర్‌ను హైదరాబాద్‌లో దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేశారు. మూడు విడతల్లో అందుబాటులోకి వచ్చే 180 కార్లకు ఇప్పటికే బుకింగ్‌లు వచ్చాయని.. ఇందులో 20 శాతం బుకింగ్‌లు హైదరాబాద్ నుంచే జరిగాయని నవీన్ సోనీ తెలిపారు. అందుకే వెల్‌ఫైర్ విడుదలకు హైదరాబాద్‌ను ఎంచుకున్నామన్నారు. ఇప్పుడు కొనుగోలు చేయాలనుకునే వారు ఏప్రిల్ వరకూ వేచి ఉండాల్సిందేనని తెలిపారు.

# ప్రపంచ మాంద్యం!

## హెచ్చరించిన మూడీస్ అనలిటిక్స్

*కరోనా వైరస్ విశ్వవ్యాప్తమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకోవచ్చని మూడీస్ అనలిటిక్స్ హెచ్చరించింది. ఇటలీ, కొరియా, ఇరాన్‌తోపాటు మరిన్ని దేశాల్లో కరోనా (కోవిడ్-19) కేసులు అనూహ్యంగా పెరిగిన నేపథ్యంలో ఈ వైరస్ మరింత విజృంభించే అవకాశాలు అధికంగా ఉన్నాయని తాజా నివేదికలో పేర్కొంది. చైనా ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్న కోవిడ్-19 వైరస్‌తో ప్రపంచ ఎకానమీకి ముప్పు పొంచి ఉందని మూడీస్ అనలిటిక్స్ ప్రధాన ఆర్థికవేత్త మార్క్ జాండీ అన్నారు. గత డిసెంబరులో చైనాలోని వుహాన్ నగరంలో వెలుగు చూసిన కరోనా వైరస్.. ప్రపంచవ్యాప్తంగా వేలాది మందికి సోకింది.*




న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను కోవిడ్-19 పలు మార్గాల్లో దెబ్బతీస్తోందని మూడీస్ అనలిటిక్స్ పేర్కొంది. చైనా బిజినెస్ ట్రావెల్, పర్యాటకం స్తంభించిపోయింది. ప్రపంచ దేశాల ఎయిర్‌లైన్స్ చైనాకు వెళ్లే తమ విమానాలను రద్దు చేశాయి. క్రూయిజ్ సేవలు సైతం నిలిచిపోయాయి. అంతేకాదు, ఏటా అమెరికా, యూరప్ దేశాలను సందర్శించే విదేశీయుల్లో చైనీయులదే మెజారిటీ వాటా. కరోనా వైరస్ ప్రభావంతో రాకపోకలు నిలిచిపోవడంతో అగ్రరాజ్యాల్లో పర్యాటకం కూడా నిస్తేజంగా మారింది. మరో ప్రధాన సమస్య ముడి సరుకులు. అమెరికా, యూరప్, భారత్‌తోపాటు పలు దేశాల్లోని కంపెనీలకు ముడి సరుకులు, వస్తువులు, యంత్ర విడిభాగాలు సరఫరా చేసే దేశమైన చైనాలో పారిశ్రామికోత్పత్తి దాదాపు స్తంభించిపోయింది. దాంతో గ్లోబల్ కంపెనీలకు ముడి సరుకులు, విడిభాగాల సరఫరా నిలిచిపోయింది. కరోనా అదుపులోకి రాకపోతే తామూ ఉత్పత్తి నిలిపివేయాల్సి రావచ్చని ప్రపంచవ్యాప్తంగా పలు ప్రముఖ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి.

### ఆ మూడింటితో ముప్పు: ఈఐయూ

కరోనా వైరస్, అమెరికా-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య వాణిజ్య యుద్ధం, యూఎస్-ఇరాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా పరిణమించవచ్చని ది ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై బుధవారం ఈఐయూ శ్వేతపత్రం విడుదల చేసింది. 2020లో ప్రపంచ జీడీపీ వృద్ధి దశాబ్ద కనిష్ఠ స్థాయి 2.9 శాతానికి జారుకోవచ్చని అంచనా వేసింది. అమెరికా ఎకానమీ జోరు తగ్గడంతో ఈ ఏడాది అగ్రరాజ్యాలన్నింటి వృద్ధిపైనా ప్రభావం పడనుందని ఈఐయూ పేర్కొంది. ఆసియా వృద్ధికీ గండిపడవచ్చని అంటోంది.

### లుఫ్తాన్సా వ్యయ నియంత్రణ

జర్మనీకి చెందిన లుఫ్తాన్సాపై కరోనా వైరస్ గట్టిగానే ప్రభావం చూపింది. అంతర్జాతీయ డిమాండ్ తగ్గడంతో ఈ ఎయిర్‌లైన్స్ ఖర్చులు తగ్గించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా కొత్త ఉద్యోగులను చేర్చుకోవడాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ప్రస్తుత ఉద్యోగుల్లో చాలా మందిని బలవంతంగా వేతనం లేని సెలవులపై సాగనంపడంతోపాటు పార్ట్ టైం వర్క్ ఆఫర్ చేయాలనుకుంటోంది.

### ప్రపంచ జీడీపీకి రూ.78 లక్షల కోట్ల గండి

కోవిడ్-19 వైరస్‌తో అన్ని దేశాలు ప్రభావితమైన పక్షంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 1.1 లక్షల కోట్ల డాలర్లు (రూ.78 లక్షల కోట్ల పైమాటే) లేదా జీడీపీకి 1.3 శాతం మేర గండి పడవచ్చని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ అంచనా వేసింది. ఒకవేళ ఈ వైరస్ ప్రభావం ప్రధానంగా ఆసియాకే పరిమితమైతే గ్లోబల్ జీడీపీ 0.5 శాతం (40 వేల కోట్ల డాలర్లు) వరకు తగ్గవచ్చని అంటోంది. ఈ ఏడాది ప్రపంచ జీడీపీ వృద్ధి 2.3 శాతానికి పడిపోవచ్చని, 2009 తర్వాత మళ్లీ ఇదే కనిష్ఠ స్థాయని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ పేర్కొంది.

### 54 సర్వీసుల రద్దు: విస్తారా

కరోనా వైరస్ విజృంభణతో అంతర్జాతీయ విమానాయానికి డిమాండ్ తగ్గడంతో దేశీయ ఎయిర్‌లైన్స్ సైతం సతమతం అవుతున్నాయి. వచ్చేనెల నుంచి 54 అంతర్జాతీయ విమాన సర్వీసులను రద్దు చేసుకోనున్నట్లు విస్తారా ప్రకటించింది. ఢిల్లీ నుంచి బ్యాంకాక్, సింగపూర్‌కు నడిచే విమాన సర్వీసులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

### పర్యవేక్షిస్తున్నాం: నిర్మల

భారత ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కార్యదర్శి స్థాయి అధికారులు తమ సంబంధిత రంగాల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారని ఆమె చెప్పారు. కీలక రంగాలకు అవసరమైన ముడి సరుకులను చైనా నుంచి విమానాల ద్వారా తెప్పించడంతోపాటు అవసరమైతే ఇతర దేశాల నుంచీ సేకరించే ఆలోచనలో ఉన్నామన్నారు. ఆయా డిపార్ట్‌మెంట్ల స్థాయిలో వీటిపై కసరత్తు జరుగుతోందని, ఏ రంగానికి ఎలాంటి సాయం అవసరం అన్న విషయంపై అన్ని డిపార్ట్‌మెంట్లతో సమీక్ష జరుపుతామన్నారు.

### క్యూ3 వృద్ధి 4.5 శాతమే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం(క్యూ3)లో భారత జీడీపీ వృద్ధి రేటు 4.5 శాతానికి పరిమితం కావచ్చని ఎస్‌బీఐ ఆర్థికవేత్తల అంచనా. మరో రెండు రోజుల్లో కేంద్ర ప్రభుత్వం మూడో త్రైమాసిక జీడీపీ గణాంకాలను విడుదల చేయనుంది. కరోనా వైరస్ వ్యాప్తితో భారత్ కూడా ఆర్థికంగా ప్రభావితం కానుందని, పలు ఉత్పత్తుల కోసం మనం చైనా దిగుమతులపైనే ఆధాపడుతుండటం ఇందుకు కారణమని ఎస్‌బీఐ ఎకనామిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20)లో జీడీపీ వృద్ధి దశాబ్ద కనిష్ఠం 5 శాతానికి పడిపోవచ్చని అంచనా. దేశీయంగా వినియోగం తగ్గడం, అంతర్జాతీయ అనిశ్చితులతో మన ఎగుమతులు క్షీణించడం ఇందుకు ప్రధాన కారణం.

### ఫారం గేటు అమ్మకం ధరలు ( నెక్ 100 గుడ్లు)



| | |
|---|---|
| 26వ తేదీకి.. | |
| హైదరాబాద్ | 313 |
| 27వ తేదీకి.. | |
| చిత్తూరు | 383 |
| గోదావరి | 335 |
| విజయవాడ | 335 |
| విశాఖపట్నం | 375 |
| వరంగల్ | 316 |
| డజను గుడ్లు రూ. 60 | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | |
|---|---|
| హైదరాబాద్ | 52 |
| వరంగల్ | 52 |
| మహబూబ్‌నగర్ | 52 |
| కరీంనగర్ | 52 |
| కర్నూలు | 52 |
| విశాఖపట్నం | 50 |
| గోదావరి | 44 |
| విజయవాడ | 55 |
| గుంటూరు | 55 |
| ఒంగోలు | 55 |
| చిత్తూరు | 55 |
| నెల్లూరు | 55 |
| అనంతపురం | 56 |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 43,050 | 43,100 | 43,890 | 43,100 | 42,840 |
| క్రితం ముగింపు | 43,070 | 43,200 | 44,040 | 43,150 | 42,970 |
| 22 క్యారెట్లు | 41,030 | 39,900 | 40,370 | 39,960 | 40,800 |
| క్రితం ముగింపు | 41,000 | 40,000 | 40,510 | 39,820 | 40,920 |
| వెండి (కిలో) | 47,000 | 49,000 | 48,500 | 48,500 | 51,400 |
| క్రితం ముగింపు | 47,900 | 49,500 | 49,200 | 48,900 | 52,400 |

# గడువులోపే బ్యాంకుల విలీనాలు

» నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకు(పీఎస్‌బీ)ల విలీనం ఆలస్యం అయ్యే అవకాశం ఉందన్న వార్తలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. అనుకున్న గడువులోగానే ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ‘దీనిపై ఎలాంటి అనిశ్చితి లేదు. ముందు నిర్ణయించిన విధంగానే ఈ విలీన ప్రక్రియ పూర్తవుతుంది’ అన్నారు. విలీనాల ద్వారా పది పీఎస్‌బీలను ఈ సంవత్సరం ఏప్రిల్ నాటికి, నాలుగు పెద్ద బ్యాంకులుగా విలీనం చేస్తామని గత ఏడాది ఆగస్టులో ప్రభుత్వం ప్రకటించింది. అయితే రెగ్యులేటరీ అనుమతుల ప్రక్రియ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. దీంతో విలీనం ఆలస్యం అయ్యే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి ఈ ప్రకటన చేయడం విశేషం.

## ఆడిటర్లకు కఠిన నిబంధనలు

న్యూఢిల్లీ: కంపెనీల ఆడిటర్లు వెల్లడించాల్సిన వివరాలకు సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. ఇందులో భాగంగా ఆడిటర్లు కంపెనీల రుణ ఎగవేతలు, నగదు నష్టాలు, స్థిరాస్తులతో పాటు మరిన్ని వివరాలను కూడా వార్షిక నివేదికలో వెల్లడించాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే ఇది అమలు అవుతుంది. అనేక కార్పొరేట్ సంస్థలు భారీ స్థాయిలో అవకతవకలకు పాల్పడిన ఉదంతాలు వెలుగు చూసిన నేపథ్యంలో ఆడిటర్లపై నియంత్రణా సంస్థల దృష్టి పడింది. ఈ నేపథ్యంలో కంపెనీల ఆర్థిక వ్యవహారాలపై మరింత విశ్వసనీయతను పెంచేందుకు, పారదర్శకతను తీసుకువచ్చేందుకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు అమల్లో ఉన్న విధానంలో మార్పులు తీసుకువచ్చింది. ఈ మేరకు కంపెనీల (ఆడిటర్స్ నివేదిక) ఆదేశం, 2020 (సీఏఆర్‌ఓ, 2020)ను నోటిఫై చేసింది. ఇది 2019 ఏప్రిల్ 1 నుంచి అర్హత కలిగిన కంపెనీల ఆర్థిక నివేదికల ఆడిట్‌కు వర్తిస్తుంది. తాజా మార్పుల ప్రకారం ఆడిటర్లు 50 అంశాలపై (సబ్ క్లాజులు సహా) అభిప్రాయాన్ని వెల్లడించాల్సి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇంతకు ముందు ఈ అంశాల సంఖ్య 21 కే పరిమితమైంది.

## ప్రధాన మద్దతు 11600

టెక్ వ్యూ

నిఫ్టీ నెగెటివ్ ధోరణిలోనే 70 పాయింట్ల దిగువన ప్రారంభమైనా ఇంట్రాడేలో రికవరీ సాధించింది. కాని నిలదొక్కుకోలేక మరోసారి డౌన్‌ట్రెండ్‌లో ప్రవేశించి చివరికి 120 పాయింట్ల నష్టంతో ముగిసింది. గత నాలుగు రోజుల్లో ఏర్పడిన డౌన్‌ట్రెండ్‌లో 500 పాయింట్ల వరకు నష్టపోయింది. ఫిబ్రవరి మూడో తేదీన నమోదైన స్థాయి 11600కి, 200 డిఎంఏకి చేరువవుతోంది. మార్కెట్ మద్దతు తీసుకుని రానున్న కొద్ది రోజుల్లో కన్సాలిడేట్ అయితే తప్ప ట్రెండ్‌లో స్పష్టత రాదు.

గురువారం స్థాయిలివే...

**నిరోధం : 11740 మద్దతు : 11600**

- రికవరీ బాట పడితే మైనర్ ఇంట్రాడే నిరోధం 11740 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 11800.
- మరింత బలహీనత ప్రదర్శించి మైనర్ మద్దతు స్థాయి 11640 కన్నా దిగజారితే ఇంకా బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 11600. అంతకన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది.

■ వి.సుందర్ రాజా

## ప్రథమార్ధం మెరుగు

ఆస్ట్రో వ్యూ

**తిథి :** ఫాల్గుణ శుక్ల చవితి
**నక్షత్రం :** రేవతి
**అప్రమత్తం :** ఆర్ద్ర, స్వాతి, శతభిషం నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.
**ట్రెండ్ మార్పు వేళలు : 11.37**
**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ 1.10 వరకు మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 3.15 వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.
**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 1 గంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 11720, 11755 మద్దతు స్థాయిలు : 11640, 11605**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

## విశాఖ పోర్టును సందర్శించిన ఆదిత్య మిట్టల్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): అర్సెలర్ మిట్టల్ గ్రూపు చైర్మన్ ఆదిత్య మిట్టల్ బుధవారం విశాఖపట్నం పోర్టును సందర్శించారు. విశాఖపట్నంలోని ఎస్సార్ గ్రూపునకు చెందిన పిల్లెట్ ప్లాంటును అర్సెలర్ గ్రూపు టేకోవర్ చేసిన తరువాత ఆయన మొదటిసారిగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా పోర్టుకు వెళ్లి అక్కడి కార్యకలాపాల గురించి డిప్యూటీ చైర్మన్ హరనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. సరకు ఎగుమతి, దిగుమతులకు పోర్టు అందిస్తున్న అధునాతన వసతులను హరనాథ్, మిట్టల్‌కు వివరించారు.

## ఏడీపీ నుంచి జీఎంఆర్‌కు రూ.5,248 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్సులో వాటా విక్రయానికి సంబంధించి మొదటి విడతగా గ్రూప్ ఏడీపీ నుంచి రూ.5,248 కోట్లు లభించాయని జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెలిపింది. ఈ నిధులను కార్పొరేట్ రుణభారాన్ని తగ్గించుకోవడానికి వినియోగిస్తుంది. అలానే ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్లు తమ వాటాను విక్రయించి బయటకు వెళ్లేందుకు జీఎంఆర్ అవకాశం కల్పించింది.

# 3 ఒక రాష్ట్రం రాజధానులు





వెంకటపాలెంలో రాములవారి ఆలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో జై అమరావతి నినాదాలు

## పంతాలు పక్కన పెట్టాలి

- రాజధాని మార్పు సరికాదు
- మారిస్తే భూములిచ్చిన రైతుల భవిష్యత్తేమిటి?
- 'ఆంధ్రజ్యోతి'తో దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ



జగదాంబ సెంటర్(విశాఖ), ఫిబ్రవరి 26: అమరావతి నుంచి రాజధానిని మార్చాలనుకోవడం సరికాదని సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. సచివాలయం ఒకచోట, అసెంబ్లీ మరోచోట ఉంటే ఖర్చు పెరుగుతుందని, ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఓ సినిమా ప్రమోషన్ నిమిత్తం విశాఖ వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే... "ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానులు మారకూడదు. గత ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటే దానిని తర్వాత వచ్చే నాయకుడు కొనసాగించాలి. పార్టీలు పంతాలు పక్కనపెట్టి ప్రజలకు మేలు జరిగేలా పాలన చేయాలి. రాజధాని కోసం రైతులు వేలాది ఎకరాలు ఇచ్చారు. ఇప్పుడు రాజధాని మార్పుచేస్తే వారి పరిస్థితేం కావాలి. వారికి జరిగే నష్టం, భవిష్యత్తులో వారి జీవనోపాధి గురించి ఎవరు ఆలోచిస్తారు. రాజధాని మార్పు వల్ల యావత్ రాష్ట్ర ప్రజలకు నష్టం. ఇప్పటికే అమరావతిపై రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. అదంతా ప్రజల సొమ్మే కదా. ఇప్పుడు రాజధాని మార్పుచేసి రూ.పది వేల కోట్ల పెట్టుబడి పెడితే చాలు అంటున్నారు. మరి ఆ డబ్బు కూడా ప్రజలదే కదా. ఈ నష్టం ఎవరు భరించాలి? అసెంబ్లీ, సెక్రటేరియట్ ఒకేచోట ఉంటే సమావేశాల సమయంలో ప్రజా ప్రతినిధులు, మంత్రులు, అధికారులు అందుబాటులో ఉంటారు. నిర్ణయాలు వేగవంతంగా తీసుకుంటారు. ఇప్పుడు మూడు రాజధానులు అంటున్నారు. పాలన విశాఖలో ఉంటుంది. అసెంబ్లీ సమావేశాల సమయంలో కనీసం 50శాతం సెక్రటేరియేట్ అమరావతిలో ఉండాలి. టీఏలు, డీఏలు అన్నీ ఎంత ఖర్చు. టీడీపీ నాయకులు దీనిగురించి ప్రజల వద్ద ప్రస్తావించకపోవడం విచారకరం. చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఢిల్లీ నుంచి ఇక్కడకు రావాలంటే పది రోజులకు రూ.5 కోట్ల వరకు ఖర్చు అవుతుంది. ఈ లెక్కన అసెంబ్లీ సమావేశాలు నిర్వహించిన ప్రతిసారీ ఎంత ఖర్చవుతుందో ఆలోచించాలి. మూడు రాజధానుల నిర్మాణానికి అయ్యే ఖర్చుతో పాటు భవిష్యత్తులో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించినప్పుడల్లా జరగనున్న ఖర్చు గురించి కూడా ఆలోచించాలి. విశాఖకు సినీ ఇండస్ట్రీ షిఫ్ట్ అవుతుందేమో అని అనుకుంటున్నారు. ఇండస్ట్రీ ఇక్కడకు రావడం అంత తేలిక కాదు. మద్రాసు నుంచి హైదరాబాద్ వచ్చేందుకే సుమారు 20 ఏళ్లు పట్టింది. దానివెనుక నాడు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ వంటి ఎందరో పెద్దల కృషి ఉంది. ఇక విశాఖకు ఇండస్ట్రీ రావాలంటే చాలా సమయం పడుతుంది. అసలు వస్తుందా, రాదా అనేది భవిష్యత్తులో తెలుస్తుంది."

# పోరు ఆగదు

- ప్రభుత్వం దిగి రావాల్సిందే
- రాజధాని భూములు పంచితే సహించం
- ప్రభుత్వంపై రాజధాని రైతుల తీవ్ర ఆగ్రహం
- 71వ రోజు కొనసాగిన ఆందోళనలు

గుంటూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాజధాని విషయంలో ప్రభుత్వం దిగి వచ్చే వరకు పోరు సడలించేది లేదని అమరావతి రైతులు ముక్తకంఠంతో నినదించారు. "ఈ ప్రభుత్వం రోజుకోరకంగా మా గుండెల్లో శూలాలు గుచ్చుతోంది. రాజధానికి భూమి ఇవ్వటమే మేము చేసిన నేరమా? అమరావతిని చంపేయటానికే పేదలకు ఇక్కడ భూములు ఇస్తామంటున్నారు. 2 నెలల ముందు ఈ ప్రాంతానికి ముంపు ఉందని, మంగళగిరివైపు 10 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అక్కడ రాజధానిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ఆర్కే సీఎం జగన్‌కు లేఖ రాశారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ భూమిలో సెంటు కాదు రెండు సెంట్లు పేదలకు ఇచ్చుకోండి" అంటూ రైతులు ప్రభుత్వానికి తెగేసి చెప్పారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ ఆప్రాంత రైతులు చేస్తున్న ఆందోళనలు బుధవారం 71వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడంలో మహాధర్నాలను కొనసాగించారు. వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, పెనుమాక, ఎర్రబాలెం, గుంటూరు కలెక్టరేట్ ఎదుట, తాడికొండ అడ్డరోడ్డు, పేదపరిమి తదితర ప్రాంతాల్లో 24 గంటల రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు.

### వేడుక ఏదైనా జై అమరావతే!

రాజధాని గ్రామాల్లో ఏవేడుక జరిగినా 'జై అమరావతి' నినాదం మార్మోగుతోంది. వెంకటపాలెంలోని రామాలయానికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా 29 గ్రామాల రైతులు కార్యక్రమానికి హాజరై 'జై అమరావతి' అంటూ నినదించారు. తుళ్లూరు గ్రామానికి చెందిన నూతన వధూవరులు జుమ్మల సుధీర్, శ్రీలక్ష్మి తమ వివాహ వేడుకల్లో 'జై అమరావతి' ప్లకార్డులు ప్రదర్శించారు. వివాహానికి హాజరైనవారు పచ్చ కండువ మెడలో వేసుకుని నూతన దంపతులను ఆశీర్వదించారు. కాగా, గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భక్త బృందం రాజధాని ఉద్యమానికి రూ.1.4 లక్షల విరాళం అందజేసింది. సత్తెనపల్లి రఘురాంనగర్‌కు చెందిన ఎం.శారద ఆధ్వర్యంలో రూ1.20 లక్షలు అందించారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ప్రభుత్వాలపై రైతులకు నమ్మకం పోతుందని అనంతపురానికి చెందిన దివ్యాంగుడు కోట్ల రఘునాథ్ అన్నారు. రైతులపై జరుగుతున్న దాష్టీకాలను టీవీల్లో చూసి తన చిన్నపాటి వ్యాపారాన్ని వదిలేసి స్వచ్ఛందంగా వచ్చి మద్దతు తెలుపుతున్నానని చెప్పారు.

- రాజధాని రైతులను ఉద్దేశ్యపూర్వకంగానే ముఖ్యమంత్రి వేధింపులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు మండిపడ్డారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట జేఏసీ చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 60వ రోజుకు చేరుకున్నాయి. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు మాట్లాడుతూ, జగన్ అక్రమంగా సంపాదించిన భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.
- ప్రజల మధ్య గొడవలు పెట్టేందుకే రాజధానిలో 1,250 ఎకరాలను ప్రభుత్వం పంపిణీకి కేటాయించిందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి విమర్శించారు. మందడం దీక్షా శిబిరానికి వచ్చిన ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు జీవీఎల్ యూపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తూ ఏపీలో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తలకిందులుగా తపస్సు చేసినా రాజధాని మారదన్నారు.
- అమరావతి ఉద్యమానికి మద్దతుగా కృష్ణాజిల్లా చిన్న అవుటపల్లి 'శ్రీనివాసం హోం' ప్రతినిధులు రూ.లక్ష, డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు కలిసి రూ.50 వేలు, అదే కళాశాలలో పని చేసే నాన్‌టీచింగ్, ఆర్‌పీఎఫ్ సిబ్బంది రూ.10 వేలు అందజేశారు. ఈ మొత్తాన్ని గన్నవరం ఎయిర్‌పోర్టులో టీడీపీ అధినేత చంద్రబాబుకు చెక్కు రూపంలో అందించారు.



తుళ్లూరు ధర్నా శిబిరంలో మహిళలు, రైతుల నినాదాలు

### జేఏసీ సభ్యుడు అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు
- కేసుల వెల్లడిపై పోలీసులు మౌనం

సత్తెనపల్లి: అమరావతి జేఏసీ సభ్యుడు వాసిరెడ్డి వంశీకృష్ణను అమరావతి పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం గుంటూరు జిల్లా సత్తెనపల్లి కోర్టు న్యాయమూర్తి వద్ద హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు రిమాండ్ విధించారు. వంశీకృష్ణను ఏ కేసులో అరెస్ట్ చేశారు అనే వివరాలను పోలీసులు తెలుపలేదు. ఒక కేసులో అరెస్టు చేసినట్లు మాత్రం తెలిపారు. బాపట్ల ఎంపీ నందిగం సురేశ్‌పై ఇటీవల అమరావతి ప్రాంతంలో జరిగిన దాడి కేసులోనే వంశీకృష్ణను అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. వంశీకృష్ణ అరెస్టు విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు హుటాహుటిన వచ్చి ఆయనను పరామర్శించారు. నాయకులకు సైతం పోలీసులు పూర్తి వివరాలు తెలియజేయలేదు.

### గుంటూరు జైలు నుంచి 15 మంది రైతులు విడుదల

- రోజాను అడ్డగించిన ఘటనలో అరెస్టు

గుంటూరు: రాజధాని పరిధిలోని పెదపరిమి గ్రామంలో ఈ నెల 20న ఎమ్మెల్యే రోజాను అడ్డగించిన ఘటనలో అరెస్టు అయిన 15 మంది రాజధాని రైతులు బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు. గుంటూరు జిల్లా జైలు వద్ద రైతులకు టీడీపీ నాయకులు మన్నవ సుబ్బారావు, కంచర్ల శివరామయ్య తదితరులు స్వాగతం పలికారు. ఈ నెల 20న రాజధానిలో ఓ కార్యక్రమానికి వెళ్లి వస్తున్న రోజాను పెదపరిమిలో రైతులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఆ సమయంలో పోలీసు విధులకు ఆటంకం కలిగించారంటూ తుళ్లూరు ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపరిమి రైతులపై కేసు నమోదు చేశారు. ఆ కేసులో అత్తిపట్ల బాలయ్య, కన్నెదార శంకర్, ఘంటా సతీష్, రాయపాటి రాంబాబు, వెంకటరత్నం, పుట్టి పుల్లారావు, బాష్యం శ్రీధర్, ఘంటా ప్రసాద్, పుట్టి కృష్ణ, నంబూరు రాజారావు, బెల్లంకొండ శ్రీను, నూతలపాటి శ్రీను, బెల్లంకొండ శేషగిరిరావు, బెల్లంకొండ వెంకయ్య తదితరులను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. అయితే, బుధవారం వారికి బెయిల్ మంజూరు కావడంతో జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మన్నవ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం ప్రశ్నించే హక్కును కాలరాస్తోందని మండిపడ్డారు. పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసినా వారి తీరు మారడం లేదని విమర్శించారు.

### ఎస్సీ, ఎస్టీ చట్టం దుర్వినియోగం

- మహిళలపై ఎంపీ సురేశ్, అనుచరులు దాడి
- నిర్భయ కేసు పెట్టి అరెస్టు చేయాలి
- ఐజీ వినీత్‌కు టీడీపీ దళిత నేతల ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 26: "బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తప్పుడు కేసు పెట్టి అమాయకులైన యువకులను జైలుకు పంపారు. రాజధానిపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన మహిళా జేఏసీ ప్రతినిధులతో సురేశ్, ఆయన అనుచరులు విచక్షణ రహితంగా వ్యవహరించారు" అని టీడీపీ దళిత నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, జవహర్, టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, అమరావతి జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్, ఎస్టీ నాయకులు దారా నాయక్, ఎస్సీ సెల్ నాయకులు మానుకొండ శివప్రసాద్ తదితరులు గుంటూరులో సౌత్ కోస్టల్ జోన్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్‌ను కలిశారు. ఎంపీ సురేశ్‌పై ఫిర్యాదుతో కూడిన వినతిపత్రం అందించారు. మూడు రాజధానులను నిరసిస్తూ రాజధాని ప్రాంతంలో వివిధ వర్గాలు గత రెండు నెలలుగా చేస్తున్న శాంతియుత ఉద్యమాన్ని అణచివేసేందుకు నందిగం సురేశ్ అధికారాన్ని ఉపయోగిస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. పలు ఘటనలను ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఎంపీ తన అధికారాన్ని తప్పుడు కేసులు, అరెస్టులకు వినియోగించడం దుర్మార్గం అన్నారు. ఆయన ప్రజలందరికీ ఎంపీ అని, కేవలం దళితులకు మాత్రమే కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మహిళలపై దాడి చేసిన ఎంపీ నందిగం సురేశ్, ఆయన అనుచరులపై నిర్భయ చట్టం ప్రకారం నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. నిష్పాక్షికంగా విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఐజీ హామీ ఇచ్చారు.



హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న కోదండరామ్



బీజేపీ నేత మురళీధరరావుతో తమ గోడు చెప్పుకొంటున్న మహిళలు

### జగన్‌కు అభివృద్ధిపై ధ్యాస లేదు

- అమరావతికి బీజేపీ వ్యతిరేకం కాదు: మురళీధరరావు

గుంటూరు(సంగడిగుంట), తుళ్లూరు, ఫిబ్రవరి 26: "సీఎం జగన్‌కి రాజకీయాలు తప్ప అభివృద్ధి ధ్యాస లేదు. ప్రధానిని కలిసినా శాసన మండలి రద్దు, 3 రాజధానులు అంటూ రాజకీయాలే కానీ ఒక్క పథకానికి డబ్బులు అడిగింది లేదు" అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరరావు అన్నారు. గుంటూరులో బుధవారం ఎస్సీ, ఎస్టీ నేతలకు సీఏఏ, ఎన్ఆర్‌సీ చట్టంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు. తాళ్లాయపాలెం శైవ క్షేత్రంలో కోటిలింగాల స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మాట్లాడుతూ.. వైసీపీ నేతలకు దమ్ముంటే రాష్ట్రంలో ఒక్క పంచాయతీ నుంచి అయినా పాకిస్తాన్ ముస్లింలకు పౌరసత్వం ఇవ్వాలని తీర్మానం చేయించి సీఏఏను వ్యతిరేకిస్తూ మాట్లాడాలని సవాలు విసిరారు. రాజధాని మహిళలు శైవ క్షేత్రానికి చేరుకొని మురళీధరరావుకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలని ఆయన కాళ్ల మీద పడి వేడుకున్నారు. రాజధాని అమరావతికి బీజేపీ వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. రాజధాని అమరావతి విషయం అంతా కేంద్రానికి తెలుసునని తెలిపారు. రైతుల, కూలీల సమస్యలను, ప్రస్తుత పరిస్థితులను జాతీయ అధ్యక్షుడు, హోం మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళతామని మహిళలకు హామీ ఇచ్చారు.

### వివాదాలు లేని భూములివ్వండి: పవన్

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): "రాజధాని నిర్మాణం కోసం సమీకరించిన భూములను ఇళ్ల స్థలాల కోసం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం భవిష్యత్తులో వివాదాలకు ఆస్కారం ఇస్తుంది. ఇల్లు లేని పేదలకు స్థలం కేటాయించడాన్ని ఎవరూ తప్పు పట్టరు. కానీ చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి వివాదాలు లేని భూములనే వారికి ఇవ్వాలి" అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

### 'మూడు'తో అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యంకాదు

- విజయవాడలో పీసీసీ తొలి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సాకే

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): "మూడు రాజధానులతో అభివృద్ధి వికేంద్రీకరణ సాధ్యం కాదు. ఒకే రాష్ట్రం ఒకే రాజధాని ఉండాలి. అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలి. దీనికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది" అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వ్యవహారాల పరిశీలకుడు ఊమెన్ చాందీ చెప్పారు. విజయవాడలో బుధవారం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం అనంతరం ఆయన పీసీసీ అధ్యక్షుడు శైలజానాథ్, కార్య నిర్వాహక అధ్యక్షుడు మస్తాన్‌వలీ తదితరులతో కలసి మీడియాకు సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు అండగా ఉండాలని తీర్మానించామన్నారు. రాజధాని రైతులు చేస్తోన్న ఉద్యమానికి ఊతమిస్తామని హామీ ఇచ్చారు. సీఎంజగన్మోహన్‌రెడ్డి ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా ఎక్కడా మాట్లాడడం లేదన్నారు. రాష్ట్ర పర్యటనల సందర్భంగా ఏర్పాటు చేసే బహిరంగ సమావేశాల్లోనూ ఎన్ఆర్‌సీ ఊసెత్తడం లేదని విమర్శించారు. దీనిని పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకొని వెళ్తామన్నారు. బీజేపీ అజెండాను సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చాందీ ఆరోపించారు.

# రాజధానిపై ఏమంటారు?

- కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం
- హైకోర్టు తరలింపు, అభివృద్ధి పనుల పిటిషన్లపై విచారణ మార్చి 17కి వాయిదా
- బిల్లులు, కమిటీల నివేదికలపై 30న విచారణ





అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాజధాని వ్యవహారంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అదే విధంగా రాజధానిపై దాఖలైన పిటిషన్లను అంశాల వారీగా విభజించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు తరలింపు, రాజధానిలో అభివృద్ధి పనుల కొనసాగింపునకు సంబంధించిన పిటిషన్లపై విచారణను మార్చి 17కి.. పాలనా వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ చట్టం ఉపసంహరణకు సంబంధించిన బిల్లులు, జీఎన్‌రావు కమిటీ, బోస్టన్ కన్సల్టెన్సీ కమిటీ నివేదికలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను మార్చి 30కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు సీజే జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తితో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సీఆర్‌డీఏ చట్టం ఉపసంహరణ, పాలనా వికేంద్రీకరణ-సమగ్రాభివృద్ధి బిల్లుల్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లతో పాటు రాజధాని తరలింపు ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలను వ్యతిరేకిస్తూ దాఖలైన పలు పిటిషన్లపై ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు దేవదత్ కామత్, అశోక్‌భాన్ వాదనలు వినిపించారు. అమరావతి నుంచి హైకోర్టును రాష్ట్ర ప్రభుత్వం తరలించజాలదన్నారు. హైకోర్టు శాశ్వత భవన సముదాయాన్ని అమరావతిలో నిర్మిస్తున్నామని.. న్యాయమూర్తులకు బంగళాలు నిర్మిస్తున్నామని 2018లో రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఆ మేరకే ఉమ్మడి హైకోర్టు విభజనకు సుప్రీంకోర్టు చర్యలు తీసుకుందని తెలిపారు. హైకోర్టు వ్యవహారంతో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదని, ఇది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినదని పేర్కొన్నారు. అందువల్ల రాజధాని అమరావతిలోనే హైకోర్టు శాశ్వత నిర్మాణాలు కొనసాగించేలా ఆదేశించాలని అభ్యర్థించారు. రాజధాని అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే రూ.11,500 కోట్లు వ్యయం చేశారని, మరో రూ.40 వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్ని నిలిపేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రాజధాని నిర్మాణం కోసం కేంద్రం సైతం రూ.2 వేల కోట్లు ఇచ్చిందని.. అందుల్ల అభివృద్ధి పనులు కొనసాగించేలా ఆదేశించాలని కోరారు. పాలక పార్టీలు మారినప్పుడల్లా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు మారడానికి వీల్లేదని తెలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతుల అభిప్రాయాలను ఉన్నతస్థాయి కమిటీ పట్టించుకోలేదన్నారు. కేవలం దురుద్దేశంతోనే రాజధానిని తరలించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టిందని తెలిపారు. సీనియర్ న్యాయవాది ఎంఎస్ ప్రసాద్, న్యాయవాదులు అంబటి సుధాకర్‌రావు, మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. రాజధాని తరలింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఉమ్మడి హైకోర్టు ఉన్నప్పుడు.. తెలంగాణ హైకోర్టును హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటామన్న ఆ రాష్ట్ర అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించిందని గుర్తుచేశారు.

### బయటివారికి ఇక్కడ ఇళ్ల స్థలాలా?

- జీవో 107ను రద్దు చేయండి
- హైకోర్టుకు రాజధాని రైతుల విజ్ఞప్తి

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతానికి చెందని వారికి ఇక్కడ ఇళ్ల స్థలాలు కేటాయించడం సరి కాదని, దీనికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 107ను రద్దు చేయాలని అమరావతి రైతులు హైకోర్టును అభ్యర్థించారు. రాజధాని కోసం రైతుల నుంచి సమీకరించిన భూముల్లోని 1,251 ఎకరాలను.. 54,307 మందికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఈ నెల 25న జీవో 107ను జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ హైకోర్టులో లంచ్‌మోషన్‌లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై హైకోర్టు సీజే జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అశోక్‌భాన్, న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదించారు. రాజధాని ప్రాంతంలో ఇతర మండలాలకు చెందిన వారికి భూమిలివ్వడం సరి కాదని, ఇది సీఆర్‌డీఏ చట్ట నిబంధనలను ఉల్లంఘించడమేనని చెప్పారు. రైతులు భూమిలిచ్చింది రాజధాని కోసమని, ఇళ్లస్థలాల కోసం కాదన్నారు. భూసమీకరణ సమయంలో ఆ భూముల్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు దాని నుంచి తప్పుకొనేందుకు ప్రయత్నించడం సరికాదన్నారు. ప్రభుత్వం తరఫున ఏజే ఎస్.శ్రీరాం వాదనలు వినిపించేందుకు సమయం లేకపోవడంతో ధర్మాసనం విచారణను గురువారానికి వాయిదా వేసింది.

### 'మూడు' బిల్లు చెల్లదు

- విజయవాడలో అమరావతి జేఏసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో నేతలు

విజయవాడ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు రాజధానుల బిల్లు చెల్లదని, ఈ విషయంలో వెనక్కితగ్గి రాజధాని రైతుల డిమాండ్‌కు అనుగుణంగా వ్యవహరించాలని వివిధ పార్టీలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. అమరావతి పరిరక్షణ సమితి(జేఏసీ) నూతన కార్యాలయాన్ని బుధవారం విజయవాడలోని ఆటోనగర్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పార్టీలకు అతీతంగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జగన్ తుగ్లక్ విధానాలతో రాజధాని సమస్య ఇప్పుడు దేశం సమస్యగా మారిందని అమరావతి పరిరక్షణ సమితి(జేఏసీ) కన్వీనర్ ఎ.శివారెడ్డి అన్నారు. గతంలో జేఏసీ కార్యాలయం కోసం బెంజ్ సర్కిల్ వద్ద కల్యాణ మండపాన్ని తీసుకుంటే.. అనుమతి లేదంటూ పోలీసులు దాన్ని సీజ్ చేశారని, ఈ నేపథ్యంలో జేఏసీ కార్యాలయాన్ని తన ఇంట్లో నిర్వహించుకోవడానికి నారాయణప్రసాద్ అవకాశం కల్పించారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యమంలో చనిపోయిన రైతు కుటుంబాలకు రూ.15 లక్షలు, రైతుకూలీ కుటుంబాలకు రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజధానికోసం ఉద్యమం చేస్తుంటే.. సీఎం ఉద్యమకారులను మరింత రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ఈ అంశంపై కేంద్రం జోక్యం చేసుకోవాలన్నారు. రాజధాని కోసం ఉద్యమిస్తున్నవారిపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు పెట్టి ఉద్యమాన్ని నీరుగార్చాలని జగన్ చూస్తున్నారని ఎంపీ కేశినేని నాని మండిపడ్డారు.

### సుడిగుండంలో అమరావతి రైతులు

- మేధావులుగా మేం సహకరిస్తాం: కోదండరామ్

చిక్కడపల్లి(హైదరాబాద్): అమరావతి కోసం భూములిచ్చిన 29 గ్రామాల ప్రజలు సుడిగుండంలో చిక్కుకుని ఆగమయ్యే పరిస్థితి ఏర్పడిందని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ పోరాట వేదిక ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కోదండరామ్ మాట్లాడుతూ.. 'మీ బాధ అందరికీ తెలియడానికి అవసరమయ్యే భావవ్యాప్తికి మేధావులుగా సహకరిస్తాం. మీరు ఆందోళన చేసి రాజకీయాన్ని శాసిస్తారు' అని అన్నారు.

# 'పైడా' కాలేజీలో సచివాలయం?



పైడా ఇంజనీరింగ్ కళాశాల భవనాలు

- ఆ భవనాలు రోశయ్య అల్లుడివి
- నాలుగేళ్ల కిందే కౌశిక్ కాలేజీ మూసివేత
- వాటి యజమానితో మంత్రి అవంతి చర్చలు
- పరిశీలించి వెళ్లిన విజయసాయి బృందం

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటు కోసం ప్రభుత్వం మరో 2 భవనాలను పరిశీలించినట్లు తెలిసింది. అవి ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం కొణిజేటి రోశయ్య కుటుంబానికి చెందినవి కావడం విశేషం. ఈ ప్రాంతం మంత్రి అవంతి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నియోజకవర్గంలోనే ఉంది. విశాఖ నుంచి 20 కి.మీ. దూరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలో పైడా గ్రూపునకు చెందిన 2 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. అందులో ఒకటి పైడా ఇంజనీరింగ్ కాలేజీ కాగా.. మరొకటి కౌశిక్ ఇంజనీరింగ్ కాలేజీ. సుమారుగా 30 ఎకరాల్లో ఇవి ఉన్నాయి. వీటి యజమాని రోశయ్య అల్లుడు పైడా కృష్ణప్రసాద్. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోవడం, ప్లేస్‌మెంట్స్ ఆధారంగా విద్యార్థులు కాలేజీలను ఎంపిక చేసుకోవడంతో అడ్మిషన్లు బాగా తగ్గిపోయి నాలుగేళ్ల క్రితమే కౌశిక్ ఇంజనీరింగ్ కళాశాల మూతపడింది. ప్రస్తుతం పైడా ఇంజనీరింగ్ కళాశాల మాత్రమే నడుస్తోంది. అందులో కూడా రెండేళ్ల నుంచి అడ్మిషన్లను నిలిపివేశారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల కోర్సులు పూర్తయిపోతే దానిని కూడా మూసివేస్తారని ప్రచారం జరుగుతోంది. రాజధాని భవనాల కోసం ఉన్నతాధికారులు ఓపక్క అన్వేషిస్తుండగా.. విద్యా సంస్థల అధిపతి కూడా అయిన మంత్రి అవంతికి.. ఖాళీగా ఉన్న కౌశిక్ ఇంజనీరింగ్ కాలేజీ భవనాలను తీసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. వెంటనే కృష్ణప్రసాద్‌తో మాట్లాడి, భవనాలన్నీ పరిశీలించారు. విషయాన్ని విజయసాయిరెడ్డికి చెప్పాక మరోసారి ఆ ప్రాంతాన్ని చూసివచ్చారు. దీనిపై అమరావతిలో చర్చలు జరిగాయని.. అనంతరం విజయసాయిరెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, సీఎంవో ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, సీఎం అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డి, డీజీపీ గౌతంసవాంగ్ రెండ్రోజుల కింద విశాఖ వచ్చారు. ఈ భవనాలన్నింటినీ పరిశీలించి వెళ్లారు. ఇవి ఇంజనీరింగ్ కళాశాలల భవనాలు కావడంతో క్లాస్ రూములు, లేబొరేటరీలు, హాస్టల్ గదులు, అవసరమైనన్ని బాత్‌రూమ్‌లు ఉన్నాయి. విభాగాధిపతుల కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. విశాఖ నుంచి జాతీయ రహదారిపై అరగంట ప్రయాణంతో ఈ కళాశాలలను చేరుకోవచ్చు. విశాలమైన ప్రాంగణం ఉండడంతో పాటు ఎన్ని వాహనాలు వచ్చినా ఇబ్బంది లేకుండా పార్కింగ్ చేసుకునే సదుపాయం ఉందని అధికారులు చెబుతున్నారు.

# జగనన్నా... ఇంత దగానా!

(మొదటి పేజీ తరువాయి)

వర్తించేవి. ఇప్పుడు వాటినే గజిబిజిగా మార్చి, గందరగోళపరిచి... అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెనగా అమలు చేస్తున్నారు. అప్పుడు... ఒక ఇంట్లో ఎంతమంది విద్యార్థులున్నా, అందరికీ ఆయా పథకాలు వర్తించేవి. ఇప్పుడు... విద్యార్థులను కాదని, తల్లిని లబ్ధిదారుగా మార్చడంలోనే పెద్ద మాయ, మోసం దాగి ఉంది. "పిల్లల చదువులకు ఫీజు ఎంతైనా ఇస్తాం. హాస్టల్, మెస్ ఖర్చులకు రూ.20 వేలు ఇస్తాం' అని ఎంతో గొప్పగా ప్రకటిస్తున్న ప్రభుత్వం... షరతులు, ఆంక్షలతో లబ్ధిదారుల సంఖ్యకు భారీగా కోత పెట్టేసింది.. గత ప్రభుత్వ హయాంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఏటా 4విడతల్లో ఫీజు రీఇంబర్స్‌మెంట్ చేసే వాళ్లు. ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునే విద్యార్థులకు క్రమం తప్పకుండా స్కాలర్‌షిప్‌లు లభించేవి. ఎంటీఎఫ్ నెల వారీగా విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు, ఆర్టీఎఫ్ సొమ్ము కాలేజీల ఖాతాలకు జమయ్యేది. ఇప్పుడు... అమ్మ ఒడి ఇస్తున్నారంటూ ఇంటర్ విద్యార్థులకు ఆర్టీఎఫ్‌ను ఎత్తేశారు. విద్యా దీవెన కింద ఇచ్చే ఫీజును ఇంకా నిర్ణయించనే లేదు.

## ఏది మంచిది?

గతంలో 5 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఏడాదిలో పది నెలల పాటు ప్రతినెలా రూ.750 స్కాలర్‌షిప్ వచ్చేది. 8-9 తరగతుల విద్యార్థులకు రూ.850, 10వ తరగతి విద్యార్థులకు రూ.950 చొప్పున అందేది. సగటున ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ.14 వేలను విడతల వారీగా చెల్లించేవారు. అందులోనూ... ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే, అందరికీ డబ్బులు అందేవి. ఉదాహరణకు... ఒక ఇంట్లో ముగ్గురు పిల్లలు ఉండి ఒకరు 6వ తరగతి, మరొకరు 8వ తరగతి, ఇంకొకరు పదో తరగతి చదువుతుంటే... ముగ్గురికీ కలిపి 25,500 వచ్చేవి. ఇప్పుడు... అదే కుటుంబానికి 'అమ్మ ఒడి' కింద అందేది 15వేలు మాత్రమే! ఇంట్లో ఎందరు చదువుకుంటున్నా, తల్లికి మాత్రమే రూ.15 వేలు జమ చేయడమే దీనికి కారణం. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ అందరినీ 'అమ్మ ఒడి'ని వర్తింపచేస్తున్నారు. పరిధి విస్తరింపచేసినప్పటికీ... తల్లులను ప్రాతిపదికగా చేసుకోవడంతో లబ్ధిదారుల సంఖ్య దారుణంగా పడిపోయింది. ఒక్కో కుటుంబానికి జరిగే లబ్ధికీ కోత పడింది.

## 'విద్యా దీవెన' మాటేంటి?

ఫీజు రీ ఇంబర్స్‌మెంట్‌కే 'జగనన్న విద్యా దీవెన' అని పేరు పెట్టారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ... ఇంత వరకు ట్యూషన్ ఫీజులను తేల్చలేదు. పెండింగ్ బకాయిలు దాదాపు రూ.4 వేల కోట్ల వరకు చేరాయి. వాటి గురించి ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాలేజీ ఫీజులకు భారీగా కోత విధించేలా కసరత్తు జరుగుతోంది.

| టీడీపీ హయాంలో | వైసీపీ వచ్చాక! |
|---|---|
| ● 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల్లో 60 లక్షల మంది విద్యార్థులకు వివిధ పథకాలు వర్తించేవి. | ● విద్యార్థుల సంఖ్యను కాదని... తల్లులు అనే కొత్త కాన్సెప్ట్‌తో 'అమ్మ ఒడి' తెచ్చారు. లబ్ధి దారుల సంఖ్య 42 లక్షలకు తగ్గిపోయింది. |
| ● దాదాపు 11 లక్షల ఇంటర్ విద్యార్థులు ఉండగా... వీరిలో 8 నుంచి 9 లక్షల మందికి ప్రభుత్వ పథకాల కింద పారితోషికం అందేది. | ● ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో లబ్ధిదారుల సంఖ్య 4.5 లక్షలకు తగ్గిపోయింది. పలురకాల షరతులే దీనికి కారణం. |
| ● పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు దాదాపు 16 లక్షల మందికి అందేవి. | ● స్కాలర్ షిప్‌ల సంఖ్య 11 లక్షలకు పడిపోయింది. |
| ● అర్హతకు వార్షిక ఆదాయ పరిమితి ఒక్కటే ప్రాతిపదిక. కేటగిరీని బట్టి కనిష్ఠంగా రూ. ఒక లక్ష, గరిష్ఠంగా రూ.2 లక్షల వార్షిక ఆదాయ పరిమితి విధించారు. | ● వార్షికాదాయం రూ.2.50 లక్షలు దాటొద్దంటూనే రకరకాల షరతులు విధించారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు ఉండొద్దు. ప్రభుత్వ పథకాల ద్వారా ట్యాక్సీలు, ట్రాక్టర్లు, ఆటోలు తీసుకున్న వారూ అనర్హులే. పట్టణ ప్రాంతాల్లో 1500 చదరపు అడుగులకంటే ఎక్కువున్నా పథకం వర్తించదు. పదెకరాల మాగాణి, పాతిక ఎకరాలలోపు మెట్ట ఉన్న వారే అర్హులు. ఇక... విద్యార్థి కుటుంబంలో ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లించినా, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వాడినా పథకాలన్నీ కట్! |
| ● హాజరుపై ఎలాంటి షరతులు లేవు. | ● డే స్కాలర్, కాలేజ్ అటాచ్డ్ హాస్టల్, డిపార్ట్‌మెంట్ అటాచ్డ్ హాస్టల్ విద్యార్థులు కనీసం 75 శాతం హాజరు ఉండాల్సిందే. |

| పథకం | గత ప్రభుత్వం | ప్రస్తుత ప్రభుత్వం |
|---|---|---|
| స్కాలర్ షిప్ (ఎంటీఎఫ్) | 5-7 తరగతుల విద్యార్థులకు రూ.750<br>8-9 తరగతులకు రూ.850<br>10వ తరగతికి రూ.950<br>ఇంటర్ విద్యార్థికి రూ.1050 | అమ్మ ఒడి పథకం కింద ...<br>1 నుంచి ఇంటర్ వరకు రూ.15 వేలు ఏక మొత్తంగా చెల్లింపు<br>(పూర్తిగా తల్లుల బ్యాంక్ ఖాతాకు జమ) |
| | హాస్టల్‌లో ఉన్న వారికి కాస్మెటిక్ చార్జీల చెల్లింపు అదనం. | కాస్మెటిక్ చార్జీల చెల్లింపు ప్రస్తావన లేదు. |
| | డిగ్రీ విద్యార్థులకు ...<br>ఎస్సీ/ఎస్టీలకు రూ.800, మైనారిటీలకు రూ.600, | 'వసతి దీవెన' పేరిట ఏటా ఫిబ్రవరి-జూలైలో రెండు దఫాలుగా చెల్లింపు.<br>ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15వేలు, |
| | బీసీలకు రూ.500 స్కాలర్‌షిప్.<br>పూర్తిగా ఫీజు రీఇంబర్స్‌మెంట్. | డిగ్రీ ఆపైన చదివే వారికి రూ.20 వేలు ఇస్తారు. కాస్మెటిక్ చార్జీలూ ఇందులోనే.<br>ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఎంతో ఇంకా నిర్ణయించలేదు. |
| స్కాలర్‌షిప్ (ఆర్టీఎఫ్) | ఇంటర్ విద్యార్థుల కోసం రూ.3120<br>డిగ్రీ విద్యార్థుల కోసం నాలుగు దఫాలుగా<br>ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్<br>(ఒక్కో కాలేజీకి ఒక్కో రకంగా చెల్లింపు) | అమ్మ ఒడి ఇస్తున్నందున ... ఇంటర్ విద్యార్థులకు ఆర్టీఎఫ్ లేదు<br>జగనన్న విద్యా దీవెన కింద ..<br>డిగ్రీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ (2019-20<br>విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు ఫీజు నిర్ణయించ లేదు. |

## వసతి దీవెనా... శాపమా?

విద్యార్థుల కోసం వైసీపీ సర్కారు అమలు చేస్తున్న మరో పథకం... 'జగనన్న వసతి దీవెన'! దీని కింద వసతి గృహాల్లో ఉండి చదువుకునే ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ చదివే వారికి రూ.15 వేలు, డిగ్రీ/పీజీ విద్యార్థులకు రూ.20 వేలు చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని కూడా తల్లుల ఖాతాలోనే జమ చేస్తారు. అయితే, ఎంతమంది చదువుతుంటే అందరికీ ఈ పథకం వర్తిస్తుంది. ఏటా ఫిబ్రవరిలో ఒకసారి, జూలైలో ఒకసారి రెండు విడతల్లో సొమ్ము చెల్లిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ మొత్తాన్ని విద్యార్థులకే ప్రతి నెలా ఇచ్చే వారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఏడాదికి రూ.14వేలు చెల్లించేవారు. వారి నుంచి కాలేజీలు మెస్ చార్జీలుగా వసూలు చేసుకునేవి. అప్పట్లో 16 లక్షల మంది పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు సహాయం అందేది. ఇప్పుడు... ఆ సంఖ్య ఏకంగా 11 లక్షలకు పడిపోయింది. అదే సమయంలో... ఇస్తున్న సహాయాన్ని కూడా మూడు కేటగిరీలుగా విభజించి... 10వేలు, 15వేలు, 20 వేలుగా నిర్ణయించారు. కాస్మెటిక్ చార్జీలను ఎత్తివేశారు. ఈ మొత్తాన్ని నేరుగా తల్లుల ఖాతాల్లో వేయడంతో కాలేజీల యాజమాన్యాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పటి వరకు తాము పెట్టిన ఖర్చులను చెల్లించేదెవరని ప్రశ్నిస్తున్నాయి. విచిత్రం ఏమంటే .. 2019-20లో తొలి విడత కింద ఫిబ్రవరిలో సగం సొమ్ము విడుదల చేసి, మిగిలిన మొత్తాన్ని జూలైలో ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ, ఇప్పుడు ఫైనల్ ఇయర్ డిగ్రీ లేదా పీజీ చదువుకునే విద్యార్థులకు రెండో దఫా సొమ్ము వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెల్లించడంపై సందేహాలు కలుగుతున్నాయి.

# దావూదొస్తే జగన్‌ను పిలుస్తారు

▸▸ **బాబు ఉంటే ట్రంప్ ఆంధ్రాకే వచ్చేవారు: పంచుమర్తి**

▸▸ **తలకిందులుగా తపస్సు చేసినా మార్చలేరు: సోమిరెడ్డి**



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "ట్రంప్ వస్తే జగన్‌కు పిలుపురాదు. కానీ అండర్ మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం వస్తే మాత్రం జగన్మోహన్‌రెడ్డికి తప్పకుండా పిలుపు వస్తుంది. జగన్ నేర చరిత్ర, ఆర్థిక కేసుల వ్యవహారం ఆంధ్ర రాష్ట్రానికి అంటుకున్నందునే ఆయనకు పిలుపు రాలేదు. ఇందుకు వైసీపీ నాయకులు సిగ్గుపడాల్సింది పోయి వెకిలి నవ్వులు నవ్వుతున్నారు" అని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనూరాధ బుధవారం మంగళగిరిలో ఎద్దేవా చేశారు. చంద్రబాబు సీఎంగా ఉండి ఉంటే ట్రంప్ గుజరాత్‌కు బదులు ఆంధ్రకే వచ్చివుండేవారన్నారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకోమని పిలుపునిచ్చి జగన్ పాలనలో విషయం లేదని మంత్రి అవంతి ఒప్పుకొన్నారని వంగలపూడి అనిత ట్వీట్ చేశారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తుళ్లూరు, వెలగపూడి, మందడం దీక్షా శిబిరాలను సందర్శించి మాట్లాడారు. సీఎం జగన్ తలకిందులుగా తపస్సు చేసినా రాజధానిని మార్చలేడని అన్నారు. అమరావతిపై బీజేపీ నేతలు సునీల్ దేవధర్, కన్నా లక్ష్మీనారాయణ, జీవీఎల్ తలోమాట మాట్లాడుతూ గందరగోళం నెలకొల్పుతున్నారన్నారు.

### అమరావతిని నిర్వీర్యం చేసే యత్నమిది: లోకేశ్

"రాజధాని అమరావతి గ్రామాల్లో పేదలకు చంద్రబాబు కట్టించిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా... ఇప్పుడు కేవలం సెంటు స్థలం అంటూ అమరావతిని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తారా? అమరావతిని నిర్వీర్యం చేసే ప్రయత్నంలో జగన్ కుటిల అడుగులివి. చంద్రబాబు ముద్ర చెరపాలంటే చెరపలేరు జగన్" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అన్నారు. ఆయన బుధవారం ఓ ట్వీట్ చేశారు. దానికి అమరావతిలో చంద్రబాబు హయాంలో పేదల కోసం నిర్మించిన ఇళ్ల ఫోటోలను ట్యాగ్ చేశారు.

### జగన్ త్వరలో జైలుకు ఖాయం: దేవినేని ఉమా

"సీఎం జగన్ కేసులు చివరి దశలో ఉన్నాయి. త్వరలో ఆయన జైలుకు వెళ్లడం ఖాయం" అని మాజీ మంత్రి దేవినేని ఉమా మందడంలో అన్నారు. పోలీసులు నిబంధనలను తోసిరాజని అత్యుత్సాహం చూపిస్తే ఇబ్బందులు పడతారని దేవినేని హెచ్చరించారు. మరో టీడీపీ నేత నన్నపునేని రాజకుమారి కూడా రైతులకు సంఘీభావం తెలిపారు. దేవినేని విజయవాడలో ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు, మాజీ ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. హైకోర్టు వ్యాఖ్యలతో ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. 9 నెలల కాలంలో 42 చీవాట్లు తిన్న ఘనత జగన్ ప్రభుత్వానిదన్నారు.

## ట్రంప్‌తో విందుకు బలమైన నాయకత్వాలను పిలవలేదు

▸▸ **దీనిపై చంద్రబాబు విమర్శలు అర్థరహితం: బొత్స**



విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన విందుకు దేశంలో బలమైన నాయకత్వాలెవరికీ ఆహ్వానం అందలేదని పురపాలక మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అందులో భాగంగానే సీఎం జగన్‌కు కూడా ఆహ్వానం అందలేదని భావిస్తున్నామని తెలిపారు. బుధవారమిక్కడ వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రంప్‌కు ఇచ్చిన విందుకు కేంద్రం జగన్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించగా ఆయన పైవిధంగా స్పందించారు. 'నవీన్ పట్నాయక్ నాలుగోసారి ముఖ్యమంత్రి కదా! మరి ఆయన్ను ఎందుకు పిలవలేదు? మమతా బెనర్జీని ఎందుకు పిలవలేదు? చంద్రబాబు విమర్శలకు అర్థం పర్థం లేదు. తానొక్కడినే తెలివైనవాడిని.. ప్రజలంతా అమాయకులని అనుకుంటున్నారు..' అని ఎద్దేవాచేశారు. విశాఖ నగరాన్ని బెంగళూరు, ముంబై నగరాలకు దీటుగా అభివృద్ధి చేయాలని జగన్ పట్టుదలగా ఉన్నారన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటిస్తే దానిని అడ్డుకునేందుకు చంద్రబాబు నాయకత్వంలోని ప్రతిపక్షం యత్నిస్తోందని ఆరోపించారు. ఆయన ప్రజా చైతన్యయాత్ర పేరిట విశాఖపట్నం, విజయనగరంలో పర్యటించేందుకు వస్తున్నట్లు పత్రికల్లో చూశానని.. ఏ ముఖం పెట్టుకుని విజయనగరం వస్తారని బొత్స ప్రశ్నించారు.

**నేడు విశాఖకు బాబు**

# అడ్డుకోవాలన్న వైసీపీ

**పర్యటన మార్గంలో రోడ్డు తవ్వేసిన వైనం.. విమానాశ్రయంలోనే నిరసనలకు నిర్ణయం**

**చంద్రబాబు రాకను అడ్డుకోవాలని మంత్రి అవంతి బహిరంగ పిలుపు**

**కమిషనర్‌ను కలిసిన టీడీపీ నేతలు.. పర్యటనపై ఆంక్షలు విధించిన పోలీసులు**

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు విశాఖ పర్యటనను భగ్నం చేసేందుకు పాలక వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. విశాఖ విమానాశ్రయంలోనే నిరసన వ్యక్తంచేసేందుకు కార్యకర్తలను భారీగా సమీకరిస్తోంది. చంద్రబాబు గురు, శుక్రవారాల్లో విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో పర్యటించడానికి వస్తున్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయంలో దిగి.. అటు నుంచి పెందుర్తి మండలంలో భూసమీకరణ బాధితులైన రైతులను పరామర్శించడానికి వెళ్లనున్నారు. పనిలో పనిగా అక్కడికి సమీపంలోనే ఉన్న రాంపురం గ్రామానికి వెళ్లి...అధికార పార్టీ నాయకుడి కుటుంబం ఆక్రమించినట్లు ప్రచారం జరుగుతున్న వీర్రాజు చెరువును కూడా సందర్శించనున్నారు. అయితే చంద్రబాబు అక్కడకు వెళ్లకుండా అర కిలోమీటరు ముందు రోడ్డును రాత్రికి రాత్రి అడ్డంగా తవ్వేశారు. ఇది అధికార పార్టీ నాయకుల పనేనని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.



రాంపురం చెరువు సందర్శనకు చంద్రబాబు వెళ్లకుండా రోడ్డు తవ్వేసిన దృశ్యం

### బాబును వెనక్కిపంపాలని..!

విశాఖలో రాజధాని ఏర్పాటును చంద్రబాబు వ్యతిరేకిస్తున్నారని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఆయన పర్యటనను ఎలాగైనా అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. విశాఖ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి అక్కరమాని విజయనిర్మల.. కార్యకర్తలతో కలిసి విమానాశ్రయానికి వెళ్లి నిరసన వ్యక్తంచేయాలని నిర్ణయించారు. మంత్రి అవంతి శ్రీనివాసరావు వైసీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖలో రాజధానిని వ్యతిరేకిస్తున్న చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని ఇక్కడకు వస్తున్నారని ప్రశ్నించారు. ఇక్కడ ఆయన్ను అడ్డుకోకపోతే.. తిరిగి అమరావతికి వెళ్లి.. విశాఖలో అంతా రాజధానిని వద్దంటున్నారని ప్రచారం చేస్తారని, అలాంటి మాటలు ఆయన చెప్పకుండా ఉండాలంటే ఆయన రాకను అంతా వ్యతిరేకించాలని పార్టీ వర్గాలకు పిలుపివ్వడం గమనార్హం. చంద్రబాబు పర్యటనను అడ్డుకునేందుకు స్వయంగా మంత్రే పిలుపు ఇవ్వడం, అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తుండడంతో టీడీపీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వాసుపల్లి గణేశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత తదితరులు విశాఖ పోలీసు కమిషనర్ ఆర్కే మీనాను బుధవారం రాత్రి కలిశారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు వద్దకు పరిమితంగా మాత్రమే నేతలను అనుమతిస్తామని, విమానాశ్రయంలోకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలకే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. ఎయిర్‌పోర్టు నుంచి చంద్రబాబు వెనుక పార్టీ నేతల కాన్వాయ్ తప్ప మరే వాహనాన్నీ అనుమతించేది లేదని చెప్పారు. వైసీపీ నేతలు కూడా ఎయిర్‌పోర్టుకు వస్తున్నట్లు సమాచారం ఉందని.. ఈ నేపథ్యంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నందున.. టీడీపీ నేతలు తక్కువ సంఖ్యలో రావాలని సూచించారు. ఎమ్మెల్యే వెలగపూడి స్పందిస్తూ.. చంద్రబాబు రాకపై నిరసన తెలపడానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వైసీపీ నేతలు మెసేజ్‌లు పెట్టారని, ముందస్తుగా వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

### నా సంతకం లేకుండానే

## ప్రభుత్వానికి ప్రతిపాదనలా?

▸▸ **పైగా నేనే పంపినట్లు చూపుతారా?**

▸▸ **కుప్పం అధికారులపై చంద్రబాబు ఆగ్రహం**

కుప్పం, ఫిబ్రవరి 26: తన సంతకం లేకనే తన పేరుతో తాగునీటి పనులకు ప్రతిపాదనలు పంపడంపై మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి ఆయన అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో కొత్తగా తాగునీటి పనులే చేయడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. గ్రామీణ నీటి సరఫరా శాఖ డీఈ శ్రీకాంత్ తాగునీటి కోసం ప్రభుత్వానికి ఇటీవల పంపిన ప్రతిపాదనలను అధికారులు చదివి వినిపించారు. చంద్రబాబుకూ ఒక ప్రతిని అందజేశారు. ఆ పనుల జాబితాను ఎమ్మెల్యేగా తానే ప్రతిపాదించినట్లుగా అధికారులు ప్రభుత్వానికి పంపినట్లు ఉండడంతో ఆయన అవాక్కయ్యారు. 'ఈ ప్రతిపాదనలు నేనెప్పుడు మీకు సూచించాను? ఇందులో కనీసం నా సంతకమైనా ఉందా? అది లేకుండా నా పేరుతో ఎలా పంపుతారు' అని డీఈని నిలదీశారు. తనను కనీసం సంప్రదించకుండానే ప్రతిపాదనలెలా పంపుతారని ప్రశ్నించారు. పిచ్చిపనులు చేస్తే ఊరుకునేది లేదన్నారు.



## భూములు లాక్కొంటే చావే శరణ్యం!

▸▸ **పురుగుమందు డబ్బాలతో మహిళల నిరసన**

కలిదిండి, ఫిబ్రవరి 26: ఇళ్లస్థలాల కోసం పేదల భూములను అధికారులు బలవంతంగా లాక్కుంటున్నారంటూ పలువురు బాధితులు పురుగుమందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. కృష్ణా జిల్లా కలిదిండి మండలం మట్టగుంట గ్రామంలో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బాధితులు కోకా కాళికా దేవి, ధనలక్ష్మి తదితరులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఎకరం పోరంబోకు స్థలాన్ని రొయ్యల చెరువుగా సాగు చేసుకుంటున్నామన్నారు. సుమారు 50 ఏళ్లుగా ఈ భూమి తమ ఆధీనంలోనే ఉందని, ఇది తప్ప తమకు ఎటువంటి ఆధారమూ లేదన్నారు. భూమిని ఇళ్లస్థలాలకు కేటాయిస్తే ఇక తమకు చావే శరణ్యమంటూ పురుగు మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. వారిని నిలువరించేందుకు పోలీసులు ప్రయత్నించగా.. చెరువులో దిగి నిరసన వ్యక్తం చేయటంతోపాటు పురుగుమందు తాగేందుకు సిద్ధపడటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తహసీల్దార్ స్వామినాయుడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆ స్థలాలకు బదులుగా గ్రామంలో అందరికీ సరిపడేలా మూడు ప్లాట్లు కేటాయిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళనకారులు శాంతించారు.

మట్టగుంటలో పురుగుమందు డబ్బాలతో చెరువులో దిగి ఆందోళన చేస్తున్న మహిళలు



ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశమైన సినీ పరిశ్రమకు చెందిన ప్రతినిధులు, చిత్రంలో వల్లభనేని వంశీ

## సీమపై ప్రత్యేక కార్యాచరణ

▸▸ **జల వనరుల శాఖ అధికారులతో నేడు సీఎం జగన్ సమీక్ష**

▸▸ **రేపు పోలవరం పర్యటనకు ముఖ్యమంత్రి**

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితుల నివారణపై ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం జలవనరుల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్షను ఏర్పాటు చేసిన సీఎం జగన్ దీనిపై వారికి దిశా నిర్దేశం చేయనున్నారు. స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్పీవీ)ని ఏర్పాటు చేసి ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకోవడంపై చర్చించనున్నారు. సీమ దుర్భిక్ష నివారణకు ప్రత్యేక పథకం అమలుకు.. రూ.33,000 కోట్లు వ్యయం అవుతాయని అంచనా వేశారు. ఈ అంచనాలకు పూర్తిస్థాయి డీపీఆర్‌ను తయారు చేయాలని అధికారులను సీఎం జగన్ ఇప్పటికే ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్ శుక్రవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించాక పోలవరంలో పర్యటించడం ఇది రెండోసారి. సీఎం పర్యటన నేపథ్యంలో.. జల వనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సంబంధిత అధికారులతో గురువారం ప్రాజెక్టుపై సమీక్షించనున్నారు.

### సీఎంతో తెలుగు సినీ నిర్మాతల భేటీ

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌తో బుధవారం తెలుగు సినిమా అగ్ర నిర్మాతలు భేటీ అయ్యారు. ఐదేళ్ల క్రితం విశాఖను దెబ్బతీసిన హుద్‌హుద్ సమయంలో ఇళ్లు కోల్పోయినవారికి అప్పట్లో టాలీవుడ్ అండగా నిలిచింది. సుమారు 15కోట్ల రూపాయల విరాళాలు సేకరించి బాధితులకు 320 ఇళ్లు నిర్మించింది. వాటిని ప్రారంభించేందుకు రావాల్సిందిగా సీఎంను ఆహ్వానించేందుకు నిర్మాతలు దగ్గుబాటి సురేశ్ బాబు, శ్యాంప్రసాద్ రెడ్డి, నల్లమలపు బుజ్జి, జెమినీ కిరణ్‌లు, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో కలిసి వచ్చారు.

### విద్యుత్ విక్రయాలకు కొత్త పాలసీ: సీఎం

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్‌ను ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోవాలనుకొనే కంపెనీలకు వీలుగా కొత్త విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సూచించారు. తాడేపల్లిలోని తన నివాసంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో సీఎం సమీక్షించారు. పరిశ్రమలకు భూములను శాశ్వత ప్రాతిపదికన బదులు.. లీజుకు ఇస్తే, ఏటా రైతులకు ఆదాయం వస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. పదివేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన విధి విధానాలపైనా అధికారులతో సీఎం చర్చించారు. వీలైనంత త్వరగా ఈ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాగుకు 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు రెండేళ్లలో ఫీడర్ల ఆటోమేషన్ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

### విద్యుత్ సంస్థల బకాయిలకు రూ.3 వేల కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సౌర, పవన విద్యుత్ సంస్థల బకాయిలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. విద్యుత్ పీపీఏల వివాదంతో కొంత కాలంగా వీటి చెల్లింపులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఒక ఫార్ములా సూచించిన హైకోర్టు.. ఆ ప్రకారం వాటి బకాయిలను చెల్లించాలని డిస్కంలకు కొంత కాలం క్రితం ఆదేశాలు జారీ చేయడంతో కొద్ది మొత్తం చెల్లించారు. తాజాగా మరో విడతగా సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు కలిపి సుమారు రూ.మూడు వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఇంధన శాఖ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

### డీశాలినేషన్‌తో నీటి కొరతకు చెక్!

▸▸ **సీఎంతో ఇజ్రాయెల్ కంపెనీ ప్రతినిధులు**

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సముద్రపు నీటిని డీశాలినేషన్ చేసి రాష్ట్రంలో నీటి కొరతను ఎదుర్కోవచ్చని ఇజ్రాయెల్ ప్రతినిధులు ప్రభుత్వానికి సూచించారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఐడీఈ టెక్నాలజీస్ సంస్థ డిప్యూటీ సీఈవో లీహీ టొరెన్‌స్టైన్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి డీశాలినేషన్‌పై చర్చించింది. ఈ సందర్భంగా ఒక్క నీటి బొట్టును కూడా వృథా చేయకుండా డీశాలినేషన్‌పై దృష్టి పెట్టాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. ఎక్కడెక్కడ డీశాలినేషన్ ప్లాంట్లు పెట్టాలన్న అంశంపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులను సీఎం కోరారు. మొదట విశాఖపట్నంతో ప్రారంభించి.. దశలవారీగా దీన్ని విస్తరించుకుంటూ వెళ్లాలన్నారు. ప్రస్తుతం మురుగునీటి శుద్ధికి అవుతున్న ఖర్చు, టెక్నాలజీపై దృష్టి పెట్టాలన్నారు.

### కొత్తగా 'విలేజ్ క్లినిక్స్'... నేడు సీఎం సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలకు అనుబంధంగా 'విలేజ్ క్లినిక్స్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రోగుల సౌకర్యార్థం 7458 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇవి కాకుండా 4500 వరకూ విలేజ్ క్లినిక్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇవి పూర్తిగా గ్రామ సచివాలయ పరిధిలోనే ఉంటాయి. వీటి కోసం గ్రామ సచివాలయంలోనే ఒక గదిని ప్రత్యేకంగా నిర్మించనున్నారు. గురువారం సీఎం జగన్ సమక్షంలో జరిగే సమీక్షలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది.

### కియ తరలిపోదు: కొరియా ట్రేడ్ ఏజెన్సీ

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కియ మోటార్స్ కార్ల పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ నుంచి తరలిపోనుందన్న ప్రచారాన్ని దక్షిణ కొరియా ప్రభుత్వ అత్యున్నత వాణిజ్య విభాగం కొరియా-ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ(కోట్రా) ఖండించింది. ఆ వార్తలు, ప్రచారాలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉన్నాయని తెలిపింది.

### 3 లక్షల మందికి మళ్లీ పింఛన్లు

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో పింఛన్లకు అర్హులు కాదని ప్రభుత్వం తేల్చిన 3 లక్షల మంది పెన్షన్ దారులకు తిరిగి పెన్షన్లు మంజూరు చేశారు. వైసీపీ ప్రభుత్వం కొత్త పెన్షన్లు ఇచ్చే క్రమంలో ప్రస్తుతం తీసుకుంటున్న పెన్షన్‌దారుల అర్హతపై పరిశీలన చేసింది. దాంతో వివిధ కారణాలతో సుమారు 5 లక్షల మందికి పైగా పెన్షన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు అర్హులకు కూడా పెన్షన్ రద్దయ్యింది. ఎన్నికల మేనిఫెస్టోలోని '60 ఏళ్లకే పెన్షన్' అమలుకు, ఉన్న పెన్షన్లను తొలగించారంటూ రాష్ట్రవ్యాప్తంగా బాధితులు గగ్గోలు పెట్టారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అర్హులకు పెన్షన్లు రద్దయ్యాయంటూ 'ఆంధ్రజ్యోతి' సవివరంగా కథనాలు ప్రచురించింది. దీంతో స్పందించిన ప్రభుత్వం పెన్షన్ రద్దయిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వారిలో 3 లక్షల మందికి తిరిగి పెన్షన్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

### శ్రీశైలం టెలిమెట్రీలు భేష్: కేఆర్ఎంబీ చైర్మన్

శ్రీశైలం, ఫిబ్రవరి 26: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ చంద్రశేఖర అయ్యర్ బుధవారం శ్రీశైలం ప్రాజెక్టును సందర్శించారు. డ్యాం వద్ద రెండు టెలిమెట్రీలను పరిశీలించి, రీడింగ్‌ను తనిఖీ చేశారు. డ్యాం నిర్వహణ, డ్యాం నుంచి నీటి విడుదల, డ్యాం వద్ద ఉన్న రెండు టెలిమెట్రీల పనితీరు బాగున్నాయని తెలిపారు. గురువారం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను సందర్శిస్తామన్నారు.

### విపత్తులపై 'సైరన్' ప్రారంభం

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృత వైపరీత్యాలను ముందుగానే గుర్తించి, సైరన్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి మేకతోటి సుచరిత పేర్కొన్నారు. కుంచనపల్లిలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ముందస్తు హెచ్చరికల వ్యవస్థను బుధవారం ఆమె ఆవిష్కరించారు. 'ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు హెచ్చరికల జారీ వ్యవస్థను ప్రారంభించాం. ఈ సాంకేతిక ఆవిష్కరణల ద్వారా తుఫాన్లు, భూకంపాలు, భారీ అగ్నిప్రమాదాలు, రసాయనిక ప్రమాదాల వంటి విపత్తులను ముందుగానే గుర్తించే వీలుంది. దీంతో ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజల మొబైల్స్‌కు చేరవేయవచ్చు. ఈ సందేశాన్ని చూసే వరకూ హెచ్చరికలు వస్తూనే ఉండేలా ఈ వ్యవస్థను తీర్చిదిద్దాం' అని తెలిపారు.

## ఆక్సిజన్ అవసరం లేని ప్రాణి



ఆక్సిజన్ లేకపోతే ప్రాణుల్లో జీవం ఉండదని మనకు తెలుసు. కానీ, అసలు ఆక్సిజన్ అవసరమే లేకుండా జీవించే ఒక ప్రాణిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దాని పేరు 'హెన్నెగుయా సాల్మినికోలా'. ఇది పరాన్నజీవి. దీనిలోని కణాలు 10 కంటే తక్కువే ఉంటాయి. "జీవించాలంటే కణాలకు శక్తి కావాలి. దానికి ఆక్సిజనే ఏకైక వనరు. కానీ, అది అవసరమే లేని జంతువును కనుగొన్నాం" అని ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డొరొతీ హుచాన్ అన్నారు.

## 'యక్షగాన'ంలో ముస్లిం మహిళ





యక్షగాన కళాకారిణిగా ఓ ముస్లిం మహిళ ఆకట్టుకుంటున్నారు. దక్షిణ కన్నడ జిల్లా విట్టల్ ప్రాంతానికి చెందిన అర్షియా ఈ కళలోకి ప్రవేశించిన తొలి ముస్లిం మహిళ. ఆటోమొబైల్ షోరూంలో పనిచేస్తున్న ఆమె ఈ కళకు సంబంధించి శిక్షణ పొందుతున్నారు. బన్న డ వేష(విలన్ పాత్ర)ల్లో ప్రస్తుతం ఆమె 'తను విట్ల' పేరుతో రాణిస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రదర్శనల్లో ఆమె నటించి విశేష ఆదరణ పొందారు.





ప్రాణ భయంతో వలస వెళ్తున్న ఢిల్లీ వాసులు.. స్థానికులకు ధైర్యం చెబుతున్న జాతీయ భద్రతా సలహాదారుడు డోబాల్

# ఉద్రిక్తంగానే.. ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

అద్దాలు, తగలబెట్టిన ఇళ్లు, వాహనాలు, దుకాణాలు, రోడ్లపై రక్తపు చారికలు కనిపిస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తట్టాబుట్టా సర్దుకుని వెళ్లడం కనిపిస్తోంది. మయూర్ విహార్ సమీపంలోని అశోక్‌నగర్‌లో ఒక మసీదును దుండగులు ధ్వంసం చేశారు. భజన్‌పురాలో ఒక బ్యాటరీ దుకాణాన్ని తగులబెట్టారు. ఇంటెలిజెన్స్ బ్యూరోకు చెందిన అంకిత్ శర్మ (26) అనే యువ అధికారి సహా ఈ ఘర్షణల కారణంగా ఇప్పటిదాకా 27 మంది మరణించారు. 250 మందికిపైగా గాయపడ్డారు. గురుతేజ్ బహదూర్ ఆస్పత్రి (జీటీబీ) వందలాది క్షతగాత్రులతో నిండిపోయింది. తమ ఆస్పత్రిలో చేరినవారిలో 30% మందికి తూటాగాయాలయ్యాయని సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ తెలిపారు. కాగా.. మంగళవారం నుంచి కనిపించకుండా పోయిన అంకిత్ శర్మ అనే ఐబీ అధికారి.. బుధవారంనాడు ఒక డ్రైనేజీలో శవమై కనిపించారు. అంకిత్‌ను కొట్టి చంపిన దుండగులు ఆయన మృతదేహాన్ని మురుగు కాల్వలో పారేశారు. పోలీసులు ఆయన మృతదేహానికి జీటీబీ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టమ్ నిర్వహించారు. అంకిత్ శర్మ తండ్రి దేవేంద్ర శర్మ ఢిల్లీ పోలీసు శాఖలో అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా.. కొందరు వ్యక్తులు తన సోదరుణ్ని డ్రెయినేజీలోకి తోసేస్తుండగా చూశామని తమ కాలనీకి చెందిన మహిళలు చెబుతున్నారని అంకిత్ సోదరుడు అంకుర్ తెలిపారు. "ఈ విషయం ఎవరికైనా చెప్తే తీవ్ర పర్యవసానాలుంటాయని వారు మా కాలనీ మహిళలను బెదిరించారు. నా సోదరుణ్ని వాళ్లు చాలాసార్లు కత్తితో పొడిచారు" అని అంకుర్ వివరించాడు. అంకిత్ శరీరంలో తూటాలు దొరికినట్టు సమాచారం. అంకిత్ హత్య వెనుక ముస్తఫాబాద్‌కు చెందిన ఆమ్ ఆద్మీ పార్టీ నేత హాజీ తాహిర్ హుస్సేన్ హస్తం ఉందని అతడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఇక.. మంగళవారం మధ్యాహ్నం ఆందోళనకారులు గమ్రీ ప్రాంతంలో ఒక నాలుగు అంతస్తుల భవనాన్ని తగలబెట్టగా.. 85 ఏళ్ల వృద్ధురాలు సజీవదహనమైంది. రాహుల్ సోలంకి(26) అనే వ్యక్తి ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తుండగా.. అల్లరిమూకలు ఎదురై అతణ్ని పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్చి పొట్టనబెట్టుకున్నాయి. ఈ అల్లర్లకు సంబంధించి ఢిల్లీ పోలీసులు ఇప్పటిదాకా 18 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 106 మందిని అరెస్టు చేశారు. 'బుధవారం ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగలేదు. ఈశాన్య ఢిల్లీ నుంచి సాయంకోరుతూ మాకు వస్తున్న ఫోన్ కాల్స్ సంఖ్య తగ్గింది' అని ఏసీపీ (క్రైమ్స్) మన్‌దీప్‌సింగ్ వివరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నా.. పలువురు మహిళలు సీఏఏకు వ్యతిరేకంగా శీలంపూర్ వద్ద ధర్నాకు దిగారు. ఘర్షణలకు కారణమైనవారిని శిక్షించాలంటూ కేజ్రీవాల్ ఇంటి వద్ద నిరసనకు దిగిన జేఎన్‌యూ, జామియా మిలియా విద్యార్థులను పోలీసులు చెదరగొట్టారు. కాగా.. అల్లర్ల ప్రభావిత ప్రాంతాల్లోని 80 కేంద్రాల్లో గురువారం జరగాల్సిన సీబీఎస్ఈ 12వ తరగతి ఇంగ్లిష్ పరీక్ష వాయిదా పడింది.

### కానిస్టేబుల్ కుటుంబానికి రూ.కోటి పరిహారం

ఈ ఘర్షణల్లో చనిపోయిన తొలి వ్యక్తి, హెడ్‌కానిస్టేబుల్ రతన్‌లాల్ అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన రాజస్థాన్‌లోని సికర్‌లో జరిగాయి. తమ ప్రభుత్వ విధానం ప్రకారం.. రతన్‌లాల్ కుటుంబానికి రూ.కోటి పరిహారాన్ని అందించనున్నట్టు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించారు. ఐబీ అధికారి అంకిత్‌శర్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

### పరిస్థితి అదుపులోనే: డోబాల్

రాజధానిలో శాంతిభద్రతల పరిస్థితి అదుపుతప్పుతుండడంతో.. జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోబాల్‌ను ప్రధాని మోదీ రంగంలోకి దింపారు. ప్రధాని ఆదేశాల మేరకు ఢిల్లీలో ఘర్షణ జరిగిన ప్రాంతాల్లో డోబాల్ బుధవారం ఉదయం పర్యటించారు. వివిధ వర్గాలకు చెందిన నాయకులతో మాట్లాడారు. ప్రధాని నేతృత్వంలోని 'భద్రతపై కేబినెట్ కమిటీ'కి క్షేత్రస్థాయి పరిస్థితి గురించి వివరాలు తెలిపారు. మధ్యాహ్నం ఈశాన్య ఢిల్లీలో పర్యటించిన ఆయన.. జఫ్రాబాద్, మౌజ్‌పూర్‌లో స్థానికులతో మాట్లాడారు. శాంతి నెలకొనడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

#### నేను మాటిస్తున్నా..

అజిత్‌డోబాల్ జఫ్రాబాద్‌లో పర్యటిస్తున్నప్పుడు ఒక బాలిక ఆయన్ను గట్టిగా నిలదీసింది. "నేనో విద్యార్థిని. మేం రాత్రిపూట ప్రశాంతంగా పడుకోలేకపోతున్నాం. చదువుకోవడానికి వెళ్లలేకపోతున్నాను. పోలీసులు తమ విధులను సరిగ్గా నిర్వర్తించట్లేదు. మీరు కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఆమె ఆందోళన వ్యక్తం చేయగా.. "నేను మాటిస్తున్నా.. ఆందోళన చెందాల్సిన పని లేదు. అల్లర్లను నివారించడం ప్రభుత్వ, పోలీసుల బాధ్యత" అని డోబాల్ అన్నారు.

### ముస్లిం కుటుంబాన్ని కాపాడిన బీజేపీ నేత

ఢిల్లీ అల్లర్లలో చిక్కుకున్న ఒక ముస్లిం కుటుంబాన్ని.. బీజేపీకి చెందిన వార్డు కౌన్సిలర్ రక్షించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి 24న ఈ ఘటన జరిగింది. ఆ రోజు ఉదయం 11.30 గంటలకు 150 మందితో కూడిన అల్లరి మూక.. యమునావిహార్ ప్రాంతంలో విధ్వంసం సృష్టించింది. ఈ క్రమంలోనే ఆ మూక.. ఒక ముస్లిం కుటుంబం ఇంటిపై దాడి చేసింది. వారి కారును, మోటార్‌బైకును, కింది అంతస్తులో అద్దెకు ఉంటున్నవారి బొటిక్‌ను తగలబెట్టింది. ఆ ప్రాంత వార్డు కౌన్సిలర్.. ముస్లిం కుటుంబానికి స్నేహితుడు అయిన బీజేపీ నేతకు ఈ దాడి గురించి తెలియగానే గబగబా అక్కడికి చేరుకున్నారు. అల్లరిమూకను ఆపి ఆ కుటుంబాన్ని రక్షించారు. వారి ఇంటిని మరింత ధ్వంసం చేయకుండా అడ్డుకున్నారు.

### హిందువుకు ముస్లింల సీమంతం

చెన్నై, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): సీఏఏ వ్యతిరేక ధర్నాల్లో విశేష ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చెన్నై వాషర్‌మెన్‌పేటలోని ధర్నా వేదికపై భాగ్యలక్ష్మి అనే హిందూ మహిళకు సీమంతం జరిపించారు. కాగా, సీఏఏ అనుకూల ఫ్లెక్సీని తొలగించినందుకు తన ప్రతిష్ఠకు నష్టంచేకూర్చే విధంగా ప్రచారం చేస్తామని కొందరు బీజేపీ కార్యకర్తలు బెదిరించారని కోల్‌కతాకు చెందిన డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ కస్తూరి బసు ఆరోపించారు.

### శాంతి.. శాంతి.. ఢిల్లీపై మోదీ సమీక్ష

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీ అల్లర్లపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి పెదవి విప్పారు. శాంతి సౌభ్రాతృత్వాలతో మెలగాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. "సాధారణ పరిస్థితులు నెలకొల్పడానికి పోలీసు, భద్రతా యంత్రాంగాలు కృషి చేస్తున్నాయి. సంయమనం పాటించాలని నా సోదర సోదరీమణులకు విజ్ఞప్తి చేస్తున్నా" అని మోదీ ట్వీట్ చేశారు.

### పోలీసులకు స్వేచ్ఛ లేదు: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: పోలీసులకు స్వేచ్ఛ ఉంటే ఢిల్లీలో అల్లర్లు జరిగేవి కావని జస్టిస్ ఎస్కే కౌల్, కేఎం జోసెఫ్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. "పోలీసులకు స్వేచ్ఛ, వృత్తి నైపుణ్యం పూర్తిగా కొరవడింది. ఎంతలా అంటే భయంకర పరిస్థితులు తలెత్తినప్పుడు కూడా ఏ చర్య తీసుకోవాలన్నా వారికి అనుమతి కావాల్సి వస్తోంది" అని పేర్కొంది. ఆందోళనకర పరిస్థితులు తలెత్తినప్పుడు ఎవరి అనుమతి కోసమో పోలీసులు ఎదురుచూడకుండా తగు చర్యలు చేపట్టాలని ధర్మాసనం ఆదేశించింది. సీఏఏపై ఢిల్లీలో చెలరేగిన హింసపై దాఖలైన పిటిషన్ల విచారణకు నిరాకరించింది. కాగా ఢిల్లీ పోలీసులు కేంద్ర హోంశాఖ పరిధిలోకి వస్తారు.

### ఎవరీ కపిల్ మిశ్రా?



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీ ఘర్షణల నేపథ్యంలో బీజేపీ వివాదాస్పద నేత కపిల్ మిశ్రాపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఏఏ వ్యతిరేకులను ఉద్దేశించి 'గోలీ మారో సాలోంకో..' వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచిన మిశ్రా తాజా మతఘర్షణల్లోనూ కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈశాన్య ఢిల్లీలోని కరవల్ నగర్‌కు చెందిన ఆయన సోషల్ వర్క్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. ఆయన తల్లి అన్నపూర్ణ మిశ్రా మాజీ మేయర్. ఆమె బీజేపీ నాయకురాలు. అయితే, అన్నాహజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న కపిల్‌మిశ్రా తర్వాత ఆప్‌లో చేరారు. 2015లో కరవల్ నగర్ నుంచి ఎమ్మెల్యే గా గెలిచి మంత్రి పదవీ దక్కించుకున్నారు. 2017లో కేజ్రీవాల్‌పైనే అవినీతి ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలపై విచారణ జరిపిన సీబీఐ, లోకాయుక్త.. కేజ్రీవాల్‌కు క్లీన్‌చిట్ ఇవ్వడంతో కపిల్ మిశ్రాను పార్టీ నుంచి తొలగించారు. దీంతో 'మై పీఎం.. మై ప్రైడ్' పేరిట సోషల్ మీ డియాలో మోదీపై ప్రచారం ప్రారంభించారు. గతేడాది ఆగస్టులో బీజేపీలో చేరారు.

### షా రాజీనామా చేయాలి: సోనియా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఈశాన్య ఢిల్లీలో జరిగిన మత ఘర్షణలకు బాధ్యత వహించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణం వైదొలగాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ వర్కింగ్ కమిటీ బుధవారం సమావేశమై పరిస్థితిని సమీక్షించింది. జరిగిన ఘటనలను ఖండిస్తూ, శాంతి సామరస్యాలకు పిలుపునిచ్చింది. "వారం రోజులుగా షా ఎక్కడున్నారు? ఎందుకు వెంటనే పారా మిలటరీ బలగాలను దింపలేదు? ఈ దారుణానికి కేంద్రం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం రెండూ బాధ్యత వహించాలి" సోనియా గాంధీ డిమాండ్ చేశారు. 'పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉంది. వెంటనే అదనపు దళాలు మోహరించాలి. శాంతి కమిటీలు ఏర్పరచాలి" అని సీడబ్ల్యూసీ కోరింది. కాగా, సోనియా విమర్శలను బీజేపీ తిప్పికొట్టింది, 1984నాటి ఊచకోత తదనంతర అల్లర్లను గుర్తుకు తెచ్చుకోండని హితవు పలికింది. "అమిత్ షా రాజీనామా కోరడం హాస్యాస్పదం. సిక్కులను దారుణంగా హత్యచేసి, రక్తపు మరకలు అంటినవారు ఇపుడు హింసను ఆపాలని పిలుపునిస్తున్నారు. ఆ మచ్చ పడ్డ వారు ఇపుడు నీతులు చెబుతూ విమర్శలు చేస్తున్నారు" అని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ ఘాటుగా దాడి చేశారు.

### పేరు చెప్పమని.. దుస్తులు విప్పమని..

**▸▸ ఢిల్లీ అల్లర్లలో అమానవీయ కోణం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీలో సోమవారం రాత్రి ఓల్డ్ బ్రిజ్‌పురీకి చెందిన సర్ఫరాజ్ అనే వ్యక్తి తన తండ్రితో కలిసి ఇంటికి వెళ్తుండగా.. అల్లరి మూక వారిని చుట్టుముట్టింది. సర్ఫరాజ్‌ను పేరు చెప్పమని అడిగారు. అతడు తన పేరు మార్చి చెప్పినా వారికి నమ్మకం కుదరలేదు. అతడి దుస్తులు విప్పి చూపించమన్నారు. ఆ అవమానాన్ని భరించలేని అత డు తన అసలు పేరు చెప్పేశాడు. అంతే.. ఆ మత ఛాందసు లు చెలరేగిపోయారు. తన భార్య నిండు చూలాలని, ఇంటికి తానే ఆధారమని సర్ఫరాజ్ ఎంత వేడుకున్నా ఆ మూఢుల మనసు కరగలేదు. దారుణంగా కొట్టి మంటల్లో పడేశారు. ప్ర స్తుతం అతడు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. దేశ రాజధానిలో జరిగిన ఈ దారుణం.. మానవత్వానికి, మత సహనానికి సవాల్ విసురుతోంది.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

### అక్కడంతా 'ఆందోళన'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: 'మూడు రోజులుగా ఇంట్లోంచి బయటికి రాలేదు! భయంగా ఉంది'... ఒకరి ఆందోళన! 'గోలీ... గోలీ!' ఆగంతకుల కాల్పుల్లో గాయపడిన వ్యక్తి నోట పదే పదే అదే మాట! హింసాకాండపై బాధితులు ఏమన్నారంటే... "ఓ వ్యక్తి తన చేతిలో తుపాకీతో మా వీధిలోకి దూసుకొచ్చాడు. కొద్దిసేపటికి మరో ఇద్దరు సాయుధులు కనిపించారు. వారంతా ఓ గుంపును తరుముతున్నారు. వారిపై తుపాకులు గురిపెట్టి కాల్చుతున్నారు. కొన్ని గురి తప్పి అక్కడే నిలబడి ఉన్న మాకూ తగిలాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు స్పందించలేదు" అని ఒక బాధితుడు చెప్పాడు. దాడుల్లో గాయపడి కదలలేని స్థితిలో ఉన్న వారిని స్థానికుల్లోనే కొందరు బైకులు, ఆటోలు, రిక్షాల్లో ఆస్పత్రుల్లో చేర్చారు.

#### ఎలా ఉన్నావ్ దోస్త్...

జఫ్రాబాద్‌కు చెందిన అల్లాహ్నూ (60) మౌజ్‌పూర్‌లోని తన హిందూ స్నేహితుడికి ఫోన్‌చేసి, అక్కడి పరిస్థితులపై ఆరాతీశాడు. ఈ రెండు ప్రాంతాలను కలుపుతున్న ఒక కిలోమీటరు మార్గంలోనే దాడులు జరిగాయి. 'మిత్రమా! నేను ఇల్లు వదిలిపెట్టి మూడు రోజులైంది. నీ పరిస్థితి ఏమిటి? అని తన హిందూ స్నేహితుడి యోగక్షేమాలు అల్లాహ్నూ ఆరా తీశాడు. "కాల్పుల్లో నా అల్లుడు చనిపోయాడు. మృతదేహాన్ని కూడా ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి లేదు"... ఇది కర్దీమ్‌పురీకి చెందిన వ్యక్తి ఆవేదన.

### సరోగసీ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఓకే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: సరోగసీ(అద్దె గర్భం) నియంత్రణ బిల్లును కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారమిక్కడ సమావేశమైన కేబినెట్.. రాజ్యసభ సెలెక్ట్ కమిటీ ఈ బిల్లుకు చేసిన సిఫారసులకు ఆమోదముద్ర వేసింది. సంతానం లేని దంపతులతో పాటు వితంతువులు, విడాకులు పొందిన మహిళలు కూడా సంతానం పొందొచ్చు. పిల్లలను కోరుకొనే దంపతుల సన్నిహితులు, సమీప బంధువులే కాకుండా అద్దె గర్భం ధరించడానికి ముందుకొచ్చే ఎవరికైనా అనుమతించాలని సెలెక్ట్ కమిటీ సూచించింది. కేంద్రం, రాష్ట్రాల్లోనూ సరోగసీ బోర్డులను ఏర్పాటు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. అద్దె గర్భం ధరించే మహిళకు బీమా కవరేజీని మూడేళ్లకు పెంచాలని కూడా పేర్కొంది. కాగా.. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన ఉమ్మడి జాబితాలో కేంద్ర చట్టాలను చేర్చేందుకు కేంద్ర కేబినెట్ సమ్మతించింది. మొత్తంగా 37 కేంద్ర చట్టాలను ఉమ్మడి జాబితాలో అమలు చేయాలని తీర్మానించింది.

## మరో 1984 కానివ్వం

**అర్ధరాత్రి రంగంలోకి దిగిన ఢిల్లీ హైకోర్టు.. పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపాటు**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: దేశ రాజధానిలో ఇందిరా గాంధీ హత్యానంతరం చెలరేగిన అల్లర్ల నాటి పరిస్థితిని పునరావృతం కానివ్వబోమని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. "ఢిల్లీని మరో 1984 కానివ్వం.. ఈ కోర్టు కావలిలో, ఈ పోలీసుల నిఘాలో ఉన్నంతకాలం ఆనాటి పరిస్థితులు రానివ్వం. అందరం పూర్తి అప్రమత్తంగా ఉండాలి" అని పేర్కొంది. ఢిల్లీ అల్లర్లపై హర్ష్ మందర్ అనే సామాజికవేత్త దాఖలు చేసిన ఓ పిటిషన్‌పై మంగళవారం అర్ధరాత్రి దాటాక, మళ్లీ బుధవారంనాడు రెండు దఫాలు హైకోర్టు అత్యవసరంగా స్పందించి- నిర్దిష్టమైన ఆదేశాలిచ్చింది. ఢిల్లీ పోలీసుల నిష్క్రియాపరత్వాన్ని కడిగిపారేసింది. 'అల్లర్లలో గాయపడ్డవారిని చిన్నచిన్న ఆసుపత్రుల నుంచి జీటీబీ, ఎల్ఎన్‌జేపీ లాంటి పెద్దాసుపత్రులకు పంపే పరిస్థితులు లేవని, సురక్షితంగా బాధితులను చేర్చేందుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తొలుత సరూర్ మందర్ అనే న్యాయవాది ఢిల్లీ హైకోర్టును అర్థించారు. అపుడు సమయం రాత్రి ఒంటిగంట కావొస్తోంది. వెంటనే జస్టిస్ ఎస్.మురళీధర్, జస్టిస్ అనూప్ బంభానీలతో కూడిన బెంచ్ ఏర్పాటైంది. పోలీసు ఉన్నతాధికారులను ఉన్నపళంగా జస్టిస్ మురళీధర్ నివాసానికి రావలిసిందిగా కబురుపెట్టింది. వారు రాగానే- బాధితులను తక్షణం ఆసుపత్రులకు, ఇతర సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలిచ్చింది. అత్యవసర చికిత్సకు ఏర్పాట్లు చేయాలని కోరింది. న్యూ ముస్తాఫాబాద్‌లో ఉన్న అల్-హింద్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్వర్‌కు జడ్జీలు ఫోన్ చేశారు. ఆస్పత్రిలో రెండు మృతదేహాలున్నాయని, 22 మంది తీవ్రగాయాలతో పడి ఉన్నారని, వారిని ఇతర ఆస్పత్రులకు తరలించేందుకు సాయంత్రం 4గంటల నుంచీ తాము పోలీసు సాయం కోసం ఎదురుచూస్తున్నామని ఆయన జస్టిస్ మురళీధర్‌కు చెప్పారు. ఈ విషయాన్ని కోర్టు వెంటనే పోలీసులకు చెప్పడంతో వారు రంగంలోకి దిగి ఆ ఆసుపత్రి నుంచి అందరినీ తరలించడం మొదలెట్టారు.

#### 'కేసు అత్యవసరంగా వినక్కర్లేదా?'

రెండు క్లిప్పింగుల సంగతి తమకు తెలుసని, కపిల్ మిశ్రా వీడియో చూడలేదని కోర్టు హాల్లో ఉన్న ఓ పోలీసు అధికారి చెప్పారు. దీనిపై బెంచ్ పోలీసులకు చీవాట్లు పెట్టింది. 'మీ ఆఫీసులో చాలా టీవీలున్నాయిగా.. అన్ని చానెళ్లూ కపిల్ మిశ్రా ప్రసంగాన్ని టెలికాస్ట్ చేశాయి. అది కూడా ఓ పోలీసు ఉన్నతాధికారి సమక్షంలో చేసిన ప్రసంగం. ఢిల్లీ పోలీసు వ్యవస్థలో పరిస్థితులు ఇలా ఉన్నాయన్న మాట దిగ్భ్రాంతి కలిగిస్తోంది" అని జస్టిస్ మురళీధర్ తీవ్రంగా మందలించారు. కపిల్ మిశ్రా ప్రసంగ పాఠాన్ని కూడా బెంచ్ సొలిసిటర్ జనరల్‌కు అందజేసి 'ఇకనైనా మీ పోలీస్ కమిషనర్‌కు సలహా ఇవ్వండి. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చెప్పండి' అని వ్యాఖ్యానించింది. కపిల్ మిశ్రా, అనురాగ్ ఠాకూర్, పర్వేశ్ వర్మలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఆలస్యమెందుకని కోర్టు నిలదీసినపుడు 'ఇపుడు వారిపై కేసులు పెడితే పరిస్థితి మరింత విషమిస్తుంది. అన్నీ ఆలోచించి ఓ నిర్ణయానికి రావాలి' అని ఢిల్లీ ప్రభుత్వ తరపు న్యాయవాది రాహుల్ మెహ్రా చెప్పారు. బుధవారం ఉదయం కోర్టు మళ్లీ సమావేశం కాగానే హర్ష్ మందర్ కేసు విచారణకు వచ్చింది. కపిల్ మిశ్రా సహా బీజేపీ నేతలు చేసిన ద్వేషపూరిత ప్రసంగాల గురించి కోర్టు ప్రశ్నించింది. తెలియదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పగా జస్టిస్ మురళీధర్, జస్టిస్ తల్వంత్ సింగ్ బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. "దేశం మొత్తానికి తెలిసిన ఆ వీడియోల వ్యవహారం పోలీసులకు తెలియదా? మేమే ప్రదర్శిస్తాం చూడండి" అని 4 వీడియో క్లిప్పింగులను కోర్టు హాలులో చూపారు.

#### లాయర్ల కీచులాట

విచారణ ప్రారంభానికి ముందు ఢిల్లీ ప్రభుత్వ లాయర్‌తో సొలిసిటర్ జనరల్ కోర్టు హాల్లోనే గొడవ పడ్డారు. కేసులో పోలీసుల తరపున తనను వాదించాల్సిందిగా లెఫ్టినెంట్ జనరల్ కోరారని తుషార్ మెహతా చెప్పగా, తనను ప్రాతినిధ్యం వహించమని ఢిల్లీ ప్రభుత్వం కోరిందని ప్రభుత్వ తరపు న్యాయవాది రాహుల్ మెహ్రా వాదించారు. కాసేపయ్యాక ఇద్దరూ తమ తమ వాదనలు సమర్పించడానికి కోర్టు అనుమతించింది.

#### జస్టిస్ మురళీధర్ ఆకస్మిక బదిలీ

బీజేపీ నేతలపై నిశిత విమర్శలు చేసిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ మురళీధర్‌పై బదిలీ వేటు పడింది. ఆయనను పంజాబ్ హరియాణా హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయనను బదిలీ చేయాలని 2018 డిసెంబరు, 2019 జనవరిల్లో కేంద్రం చేసిన సిఫారసును అప్పటి సీజే జస్టిస్ రంజన్ గొగోయ్ తిరస్కరించారు. ఢిల్లీ అల్లర్ల కేసు విచారణ సాగుతున్న దశలో బదిలీ చేయడం వివాదాస్పదంగా మారింది. వాదనలు జరిగిన కొద్ది గంటలకే బదిలీ ఉత్తర్వులు వెలువడడాన్ని న్యాయవాదులు ప్రశ్నించారు. ఇది న్యాయ వ్యవస్థకే తీరనిలోటని ఢిల్లీ బార్ అసోసియేషన్ ఖండించింది.

## సారు సభకు చందాలేయండి

**▸▸ కర్నూలులో ముఖ్యమంత్రి పర్యటన**

**▸▸ ఏర్పాట్లు,వసూళ్ల పనీ అధికారులకే ఒక్కో కార్యాలయానికి రూ. 50వేలు**

**▸▸ భారం తాళలేక వాపోతున్న సిబ్బంది**

కర్నూలు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నారంటే ఆ హడావుడే వేరు! ఆయన వచ్చి తిరిగి వెళ్లేదాకా తహసీల్దార్లకు చేతినిండా పనే. ఆ ఒత్తిడి చాలదు అన్నట్టు సీఎం సభకు అయ్యే ఖర్చుల వసూలు పనినీ వారిపైనే పెట్టారు. టార్గెట్ పెట్టి మరీ లక్షల రూపాయలు సమీకరించి.. సభ జరిపించామనిపించారు. కర్నూలు జిల్లాలో ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తొలిసారి జరిపిన పర్యటన, కర్నూలు నగరంలో నిర్వహించిన సభ సందర్భంగా ఇలా చందాల బాగోతం సాగించారని సమాచారం. సీఎం సభకు అయ్యే ఖర్చు ఇంత అని తేల్చి.. ఆ మొత్తం రెవెన్యూతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల నుంచి కొందరు ఉన్నతాధికారులు బలవంతంగా గుంజినట్టు తెలుస్తోంది. ఈ సభకు సంబంధించి చేసే ఒక్కో ఏర్పాటును ఒక్కో తహసీల్దార్‌కు అప్పగించారు. దానికయ్యే ఖర్చులను కూడా 'మీరే చూసుకోండి' అని పురమాయించారట! బిల్లులు పెట్టుకొంటే క్లియర్ చేస్తామని చెబుతున్నా.. ఇలాంటివి ఎన్ని బిల్లులు పెట్టి, అవి పెండింగ్‌లో పడిపోలేదు అంటూ కొందరు తహసీల్దార్లు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సభకు తరలి వచ్చిన నాయకులు, వారి వెంట వచ్చిన గన్‌మెన్లు, ఇతర అనుచరగణానికి భోజనాలు, వసతులు తదితర ఖర్చులన్నీ అధికారుల నుంచే రాబట్టారు. దీనికోసం కొంత మంది జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు.. చాలా ఎమ్మార్వో కార్యాలయాల నుంచి స్థాయిని బట్టి రూ.30 వేలు మొదలు రూ. 50వేల వరకు వసూలు చేసినట్టు ప్రభుత్వ వర్గాలే చెబుతున్నాయి.

వాటర్ బాటిల్స్, పూల బొకేలు తదితరాలకు అయిన ఖర్చును కొన్ని రెవెన్యూ కార్యాలయాలకు అప్పగించారని తెలుస్తోంది. ఈ సభకు అధికారికంగా రూ.కోటికి పైగానే ఖర్చయిందని తెలుస్తుండగా, అందుకుగాను విడుదలైన ప్రభుత్వ నిధులపై మాత్రం అధికారులు నోరు మెదపడంలేదు. బలవంతపు వసూళ్ల భారం భరించలేని కొందరు ఆర్ఐలు, వీఆర్వోలు బహిరంగంగానే ఈ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### సభ కోసం స్కూలుకు ఎసరు

సీఎం బహిరంగ సభను కల్లూరు నియోజకవర్గంలోని పెదపాడు బాలికల హైస్కూలులో ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే కొందరు నాయకుల విముఖత కొద్దీ ఆ కార్యక్రమాన్ని అనూహ్యంగా కర్నూలుకు మార్చారు. అయితే ఈలోపే ఆ హైస్కూల్లోని మరుగుదొడ్లను తొలగించి, చదును చేయడమే గాక వనం-మనం కార్యక్రమంలో గతంలో నాటిన వందకు పైగా మొక్కలను కూడా అధికారులు పూర్తిగా తీసివేశారు. 'సీఎం సభ కోసం కూల్చిన టాయిలెట్లు పునర్నిర్మాణానికి ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రస్తుతం పాఠశాలలో ఒక టాయిలెట్ మాత్రమే అందుబాటులో ఉంది. నీటి వసతి లేదు. విద్యార్థినులు బకెట్లలో నీళ్లు తీసుకెళుతున్నారు" అని స్కూలు ప్రధానోపాధ్యాయురాలు కె.వసంత లక్ష్మీబాయి తెలిపారు.



ఉద్యోగులపై దాడి చేస్తున్న వైసీపీ నేత (చేయి చాచిన వ్యక్తి)

## చిత్తూరులో సచివాలయ ఉద్యోగులపై వైసీపీ నేత దాడి

**▸▸ బూతులు తిట్టి.. చెంపదెబ్బలు కొట్టిన వైనం**

చిత్తూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వరిగపల్లె సచివాలయ ఉద్యోగులపై స్థానిక వైసీపీ నాయకుడు దాడి చేశారు. వారిని అసభ్య పదజాలంతో దూషించారు. యాదమరి మండలం వరిగపల్లె సచివాలయంలో 10 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం సాయంత్రం వార్డు వైసీపీ ఇన్‌చార్జి జయప్రకాశ్ రెడ్డి తన స్నేహితుడు విజయ్‌కుమార్‌తో కలిసి వార్డు సచివాలయానికి వచ్చారు. వార్డు వెల్‌ఫేర్ సెక్రటరీ జ్యోతీశ్వర్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీ సతీశ్ ఎక్కడున్నారని రెవెన్యూ అధికారిని అడిగారు. వెంటనే వాళ్లను పిలవండంటూ బూతులు తిట్టారు. కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశంలో ఉన్న ఆ ఇద్దరికీ సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సచివాలయానికి చేరుకున్నారు. జయప్రకాశ్‌రెడ్డి, విజయ్‌కుమార్‌లిద్దరూ తమ కుర్చీల్లో కూర్చొని ఉండడంతో.. 'మా కుర్చీల్లో ఎందుకు కూర్చున్నారు.. లేవండి' అనగానే జ్యోతీశ్వర్, సతీశ్‌లను ఆ ఇద్దరూ బూతులు తిట్టారు. ఆ సమయంలో మహిళా వీఆర్వో, మరో మహిళా పోలీసూ అక్కడే ఉన్నారు. జయప్రకాశ్ వాళ్లిద్దరి మీదకు కూడా వెళ్లి అసభ్యంగా మాట్లాడడం ప్రారంభించారు. జయప్రకాశ్‌రెడ్డి కోపంతో సతీశ్ చెంపపై గట్టిగా కొట్టాడు. అడ్డుకున్న జ్యోతీశ్వర్‌పైనా చేయి చేసుకున్నాడు. తమ సహచరులపై దాడి జరగడంతో 50 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. యాదమరి ఎస్సై నాగేశ్వరరావును కలిసి ఫిర్యాదు చేశారు. జయప్రకాశ్‌రెడ్డిని అరెస్టు చేయాలని.. లేదంటే గురువారం ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఆయన నిత్యం తమను వేధిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' వద్ద బాధితులు వాపోయారు. 'ముఖ్యంగా మహిళా ఉద్యోగుల పట్ల ఆయన ప్రవర్తన మరీ దారుణంగా ఉంది. రోజూ సచివాలయానికి వస్తూ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు అడుగుతూ మాపై రుబాబు చేస్తున్నాడు. ఫలానా వలంటీర్లను తొలగించి ఇతరులను పెట్టుకోవాలని చెబుతున్నాడు. నేనీ వార్డుకు ఇన్‌చార్జిని, నన్ను ప్రసన్నం చేసుకోండని వేధిస్తున్నాడు. కొత్తగా విధుల్లో చేరాం.. రెండేళ్ల ప్రొబెషన్ పీరియడ్ ఉన్నందున గొడవలకు దూరంగా ఉండాలని ఇన్నాళ్లు ఊరుకున్నాం' అని చెప్పారు. కాగా, వరిగపల్లెలో పనిచేసే తులసి అనే వార్డు వలంటీర్‌ను తొలగించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పట్టుపట్టగా.. అతడినే కొనసాగించాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఎస్ బాబుకు మద్దతుగా జయప్రకాశ్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నాడని సమాచారం. దాడి గురించి చిత్తూరు కమిషనర్ చల్లా ఓబులేశు వద్ద ప్రస్తావించగా.. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

| భారత్ x న్యూజిలాండ్ | ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్ |
|---|---|
| (గ్రూప్-ఎ) | (గ్రూప్-ఎ) |
| ఉ.9.30 నుంచి | మ. 1.30 నుంచి |

స్టార్‌స్పోర్ట్స్ 2, 1 (తెలుగు)

ఆటకు అందం కలగలిపి..
రాకెట్‌కు గ్లామర్‌తో సొబగులు అద్ది..
ఆర్జనలో తనకుతానే సాటిగా నిలిచి..
కోర్టులో తనదైన అరుపులతో ప్రత్యర్థులకు బెంబేలు పుట్టించి..
బేస్‌లైన్ నుంచి జాలువారే తన
సొగసైన ఫోర్‌హ్యాండ్,
బ్యాక్‌హ్యాండ్ షాట్లతో
అభిమానులకు ఆనందాన్ని పంచిన
ఆరడుగుల సొగసరి.. ప్రపంచంలోనే అత్యంత
ఆకర్షణీయమైన, ఖరీదైన క్రీడాకారిణిగా
నీరాజనాలందుకున్న రష్యన్ సుందరి
మరియా షరపోవా ఆటకు వీడ్కోలు పలికింది.
'గుడ్‌బై టెన్నిస్.. నన్ను
క్షమించు' అంటూ
ఇకపై కోర్టులో
అడుగు
పెట్టనని
ప్రకటించింది.





# నిను వీడుతున్నా..
# నన్ను క్షమించు..!

## టెన్నిస్‌కు షరపోవా గుడ్‌బై

**పారిస్:** ఆటకు ఆట.. అందానికి అందంతో ప్రపంచ టెన్నిస్ అభిమానుల హృదయాలను కొల్లగొట్టిన మరియా షరపోవా కెరీర్‌కు గుడ్‌బై చెప్పింది. క్రీడాప్రపంచంలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న 32 ఏళ్ల ఈ రష్యన్ స్టార్.. టెన్నిస్ నుంచి తప్పుకొంటున్నట్టు బుధవారం 'వోగ్, వానిటీ ఫెయిర్' అనే వెబ్‌సైట్లకు రాసిన ఆర్టికల్‌లో ప్రకటించింది. ఒకప్పుడు ప్రపంచ నెంబర్‌వన్‌గా నిలిచిన షరపోవా.. ప్రస్తుతం 373వ ర్యాంకుతో కెరీర్‌ను ముగించింది. 2016లో డోప్ పరీక్షల్లో విఫలమై 15నెలలు సస్పెన్షన్‌కు గురైన షరపోవా.. ఆ తర్వాత పునరాగమనం చేసినా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. తీవ్రమైన భుజం నొప్పిలాంటి గాయాలతో సతమతమవడం కూడా ఆమె రిటైర్మెంట్ నిర్ణయం తీసుకోవడానికి కారణమైంది.

### అవన్నీ మిస్సవుతా!

టెన్నిస్‌కు నా జీవితాన్ని ధారపోశా. అది నాకు జీవితాన్నిచ్చింది. ఇకనుంచి శిక్షణ, రోజువారీ దినచర్య ఇలా.. అంతా మారిపోనుంది. కోచ్‌లతోపాటు నా టీమ్‌ను మిస్సవుతున్నా. ఓడినా, గెలిచినా ఇచ్చిపుచ్చుకునే షేక్ హ్యాండ్లు.. నాన్నతో కలిసి కోర్టు బెంచ్ మీద కూర్చునే క్షణాలను మిస్సవుతా. అనిర్వచనీయమైన ఆనందాలను పంచి.. కనిపించని కన్నీళ్లను మిగిల్చి.. ప్రేమించిన ఆటను మానేయాల్సి వస్తోంది. ఇన్నేళ్లుగా ఓ కొత్త కుటుంబాన్ని, నాకు అండగా నిలిచిన అభిమానులను అందించిన ఆటను వదిలేయాల్సి వస్తోంది. అందుకే.. నన్ను క్షమించు. టెన్నిస్.. నీకు వీడ్కోలు పలుకుతున్నా. 28 ఏళ్లు.. 5 గ్రాండ్‌స్లామ్స్ తర్వాత మరో శిఖరాన్ని అధిరోహించేందుకు సిద్ధమయ్యా. - మరియా షరపోవా


చిన్నప్పుడు..

### రివ్వున ఎగిసి..

ఆరడుగుల పొడవు.. కట్టిపడేసే అందం.. కోర్టులో ప్రత్యర్థులను తనదైన నైపుణ్యంతో చిత్తుచేసే వ్యూహం.. ఇలా టెన్నిస్‌లో షరపోవా ప్రవేశమే ఓ సంచలనం. 2001లో డబ్ల్యూటీఏ టూర్‌తో ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అరంగేట్రం చేసిన షరపోవా.. తనదైన ఆటతో అనతికాలంలోనే అగ్రశ్రేణి క్రీడాకారిణిగా ఎదిగింది. 2004 వింబుల్డన్ ఫైనల్లో అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్‌కు షాకిచ్చి 17 ఏళ్ల వయసులో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ముద్దాడిన షరపోవా అప్పటికప్పుడు సెలెబ్రిటీగా మారిపోయింది. 2005 ఆగస్టులో ప్రపంచ నెంబర్‌వన్‌గా అవతరించి 18 ఏళ్లకే ఈ ఘనత సాధించిన తొలి రష్యన్ ప్లేయర్‌గా రికార్డుకెక్కి టెన్నిస్‌లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 2006లో యూఎస్ ఓపెన్, 2008 లో ఆస్ట్రేలియన్ ఓపెన్, 2012, 2014లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు సాధించింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో రజత పతకం గెలుచుకుంది.

## జీవితం.. స్ఫూర్తిదాయకం

రష్యాలో మారుమూల ప్రాంతంలో జన్మించి.. చేతిలో పైసా లేని పరిస్థితి నుంచి కోట్లు సంపాదన దాకా ఎదిగిన మరియా షరపోవా జీవితం స్ఫూర్తిదాయకం.

- 1987 ఏప్రిల్ 19న రష్యాలోని న్యాగన్ పట్టణంలో యూరీ, యెలెనా దంపతులకు షరపోవా జన్మించింది. సొంతూరులో చెర్నోబిల్ అణు కర్మాగారంలో సంభవించిన విస్ఫోటనం ప్రభావంతో ఆరోగ్యం చెడుతుందనే కారణంగా షరపోవా కుటుంబం 1989లో సోచి నగరానికి మకాం మార్చింది.
- స్థానిక పార్క్‌లో తండ్రితో కలిసి టెన్నిస్ ప్రాక్టీస్ మొదలుపెట్టిన షరపోవా.. ఆ తర్వాత వెటరన్ కోచ్ యూరీ యుట్‌కిన్ వద్ద శిక్షణ తీసుకుంది.
- 1993లో మాస్కోలో ఓ టెన్నిస్ క్లినిక్‌కు హాజరైన దిగ్గజ క్రీడాకారిణి మార్టినా నవ్రతిలోవా.. షరపోవాలోని ప్రతిభను గుర్తించింది. ఆమెను ఫ్లోరిడా (అమెరికా)లోని ప్రసిద్ధ నిక్ బొలెటరీ టెన్నిస్ అకాడమీలో చేర్పిస్తే గొప్ప క్రీడాకారిణి అవుతుందని షరపోవా తండ్రి యూరీకి సలహా ఇచ్చింది.
- ఆర్థికంగా ఇబ్బందులున్నా, ఇంగ్లీష్ భాష తెలియకపోయినా, కూతురు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని యూరీ ఫ్లోరిడా బయలుదేరాడు.


నాన్నతో..

- కేవలం 700 డాలర్లతో ఫ్లోరిడా చేరిన యూరీ.. కొద్దిరోజుల్లోనే తాము తెచ్చుకున్న డబ్బులు అయిపోవడంతో చివరికి హోటళ్లలో ప్లేట్‌లు కడగడం లాంటి చిన్నాచితకా పనులు చేశాడు. తన కోసం తండ్రి పడుతున్న తాపత్రయాన్ని అర్థం చేసుకొని పూర్తిగా ఆటపైనే దృష్టి సారించిన షరపోవా.. తొలుత స్థానిక రిక్ మాకీ అకాడమీలో శిక్షణ తీసుకుంది.
- ఆటలో ప్రతిభతో 1995లో ప్రముఖ ఐఎంజీ సంస్థ దృష్టిని ఆకర్షించిన షరపోవా.. ఆ సంస్థ స్పాన్సర్‌షిప్‌తో నిక్ బొలెటరీ అకాడమీలో చేరింది. అక్కడి నుంచి ఎదురు లేకుండా దూసుకెళ్లిన షరపోవా అనతికాలంలోనే అగ్రశ్రేణి తారగా ఎదిగింది. తన విజయాలతో సొంతదేశంలో టెన్నిస్ విప్లవాన్ని తీసుకొచ్చింది.

- ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

### ఆర్జనలో రారాణి

మహిళల టెన్నిస్‌లో తనకంటూ ప్రత్యేకమైన పేజీని లిఖించుకున్న షరపోవా.. ఆటలో శిఖరాగ్రాన్ని అందుకోవడంతోపాటు ఆర్జన పరంగానూ ముందంజలో నిలిచింది. ఆటకు తోడు ఎండార్స్‌మెంట్ల పరంగా అత్యధిక ఆదాయాన్ని అందుకున్న క్రీడాకారిణిగా 2005 నుంచి వరుసగా 11 ఏళ్ల పాటు అగ్రస్థానంలో నిలిచింది. ఒక్క 2015లో ఏకంగా రూ. 200 కోట్లు ఆర్జించి ఔరా అనిపించింది.



### కెరీర్‌లో మరక

ఆట, అంతకుమించిన అందంతో టెన్నిస్ చరిత్రలోనే అత్యంత అరుదైన, ఖరీదైన క్రీడాకారిణిగా నీరాజనాలందుకున్న షరపోవా.. కెరీర్‌లో డోపింగ్‌కు పాల్పడి విమర్శల పాలైంది. 2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా నిషేధిత ఉత్ప్రేరకం 'మెల్డోనియం'ను షరపోవా వాడినట్టు నిర్ధారణ అయింది. అయితే, ఆ ఉత్ప్రేరకాన్ని తెలియకుండా తీసుకున్నా.. అది తప్పు కావడంతో ప్రపంచ టెన్నిస్ సమాఖ్య ఆమెపై 15 నెలల నిషేధాన్ని విధించింది. ఆ తర్వాత పునరాగమనం చేసినా.. మునుపటి స్థాయిలో సత్తా చాటలేకపోయింది. దీంతో కెరీర్‌కు వీడ్కోలు పలకక తప్పలేదు.

ప్రపంచకప్‌లో భారత మహిళలు అనూహ్య ప్రదర్శనతో అదరగొడుతున్నారు. ఆస్ట్రేలియా, బంగ్లాపై విజయాలతో గ్రూప్‌లో టాప్‌లో కొనసాగుతున్నారు. గురువారం గ్రూప్-ఎలో ప్రమాదకారి న్యూజిలాండ్‌పై హర్మన్‌ప్రీత్ సేన గెలిస్తే.. టోర్నీలో హ్యాట్రిక్ విజయాలతో సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొంటుంది.



నేడు కివీస్‌తో భారత్ పోరు
మహిళల టీ20 వరల్డ్‌కప్

# గెలిస్తే సెమీస్‌కు..!

**జట్లు (అంచనా)**

**భారత్:** షఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, వేద కృష్ణమూర్తి, శిఖా పాండే, తానియా భాటియా (వికెట్ కీపర్), అరుంధతి రెడ్డి, పూనమ్ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్.

**న్యూజిలాండ్:** సోఫీ డివైన్ (కెప్టెన్), రేచల్ ప్రీస్ట్ (వికెట్ కీపర్), సుజీ బేట్స్, మ్యాడీ గ్రీన్, కేటీ మార్టిన్, కేటీ పెర్కిన్స్, అమేలియా కెర్, జెన్సన్, లి కాస్పరెక్, లియా తహూహు, జెస్ కెర్/హోలీ హడల్‌స్టన్.


మంధాన

**మెల్‌బోర్న్:** మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో వరుస విజయాలతో జోరుమీదున్న టీమిండియా.. సెమీస్‌పై గురిపెట్టింది. గురువారం జరిగే మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. హాట్ ఫేవరెట్ ఆస్ట్రేలియాను 17 పరుగుల తేడాతో ఓడించి టోర్నీలో శుభారంభం చేసిన భారత మహిళలు.. రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై 18 పరుగులతో నెగ్గి గ్రూప్-ఎలో మొత్తం 4 పాయింట్లతో టాప్‌లో నిలిచారు. కివీస్‌పై విజయం సాధిస్తే హర్మన్‌ప్రీత్ సేన నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకొంటుంది. గత రెండు మ్యాచ్‌ల్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో భారత్ ఆకట్టుకొనే ప్రదర్శన చేసింది. చిచ్చర పిడుగు షఫాలీ వర్మ ధనాధన్ బ్యాటింగ్‌తో టీమ్ విజయాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. బంగ్లాతో మ్యాచ్‌లో 17 బంతుల్లో 39 పరుగుల సాధించిన వర్మ.. ఆసీస్‌పై 29 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో కూడా షఫాలీ నుంచి టీమిండియా అదేతరహా ఆటను ఆశిస్తోంది. వన్‌డౌన్‌లో జెమీమా కూడా విలువైన పరుగులు జోడిస్తోంది. అయితే, టాపార్డర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆశించిన స్థాయిలో బ్యాట్‌ను ఝళిపించకపోవడం ఆందోళనకరం. జ్వరం కారణంగా బంగ్లాతో మ్యాచ్‌కు దూరమైన స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం భారత్‌కు ఊరటనిచ్చే అంశం.


హర్మన్‌ప్రీత్
డివైన్

మిడిలార్డర్‌లో ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కీలకపాత్ర పోషిస్తోంది. బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ తురుపుముక్కగా మారింది. రెండు మ్యాచ్‌ల్లో 7 వికెట్లతో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. పేసర్ శిఖా పాండే.. పూనమ్‌కు మంచి సహకారం అందిస్తోంది.

**మెరుగ్గా కివీస్:** గత రికార్డుల ప్రకారం భారత్‌పై న్యూజిలాండ్‌దే పైచేయి. ఇటీవలి కాలంలో ఇరుజట్ల మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల్లోనూ కివీస్‌దే విజయం. న్యూజిలాండ్ జట్టు టాప్‌క్లాస్ ప్లేయర్లతో పటిష్ఠంగా కనిపిస్తోంది. కెప్టెన్, ఆల్‌రౌండర్ సోఫీ డివైన్, టాపార్డర్‌లో బ్యాట్స్‌వుమన్ సుజీ బేట్స్ మంచి ఫామ్‌లో ఉన్నారు. పేసర్ లియా తుహూహూ, లెగ్ స్పిన్నర్ అమేలియా కెర్ బౌలింగ్ విభాగాన్ని నడిపిస్తున్నారు. 7 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసిన న్యూజిలాండ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. టీమ్ పరంగా కివీస్ బలంగా కనిపిస్తున్నా.. గత రెండు మ్యాచ్‌ల్లో అదరగొట్టిన భారత అమ్మాయిలు అదే తరహాలో విజృంభిస్తే మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

### ప్రియురాలితో మాక్స్‌వెల్ నిశ్చితార్థం



**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా డాషింగ్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ భారత సంతతికి చెందిన తన ప్రియురాలు విని రామన్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. రామన్ వేలికి ఉంగరం తొడిగిన ఫొటోను మాక్స్‌వెల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో బుధవారం పోస్ట్ చేశాడు. రామన్ కూడా ఇదే చిత్రాన్ని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. 'కిందటి వారం మాక్స్‌వెల్ తనని పెళ్లి చేసుకోమని అడిగాడు. నేను వెంటనే అంగీకరించా' అని రామన్ ఇన్‌స్టాలో తెలిపింది.

### విరాట్ 'టాప్' చేజారె..!

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్

**దుబాయ్:** న్యూజిలాండ్‌తో టెస్ట్‌లో పేలవ ప్రదర్శన చేసిన విరాట్ కోహ్లీ టాప్ ర్యాంక్ చేజారింది. బుధవారం ప్రకటించిన టెస్ట్ బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీ రెండో స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ అగ్రస్థానాన్ని ఆక్రమించాడు. కాగా, రహానె, చటేశ్వర్ పుజార, మయాంక్ అగర్వాల్ 8,9,10 స్థానాల్లో నిలిచారు. బౌలర్ల జాబితాలో అశ్విన్ ఒక స్థానం దిగజారి 9వ ర్యాంక్ దక్కించుకున్నాడు. ఆసీస్ పేసర్ ప్యాట్ కమిన్స్ టాప్‌లో కొనసాగుతున్నాడు.

### ఒకటిన న్యాయమూర్తుల టీ20 మ్యాచ్

వేదిక నవులూరు ఏసీఏ స్టేడియం

**మంగళగిరి:** గుంటూరు జిల్లాలోని నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో వచ్చే నెల 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ లెవన్, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్స్ లెవెన్ జట్ల మధ్య టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఏసీఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 29వ తేదీ వరకూ ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రాక్టీస్ చేయనున్నారు. బుధవారం సాయంత్రం ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు రెండు గంటల పాటు బౌలింగ్, బ్యాటింగ్ సాధన చేశారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు సోమయాజులు, దుర్గాప్రసాదరావు, శ్యామ్‌ప్రసాద్, మానవేంద్రరాయ్, శేషసాయి, జయసూర్య, రాకేష్‌కుమార్‌తో పాటు హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవిప్రసాద్, టీడీడీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ మజ్జి సూరిబాబు తదితరులు ప్రాక్టీస్ చేసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి హరిహరనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.


సాధన చేస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ మహేశ్వరీ

### సాక్షికి సోనమ్ షాక్

ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ ట్రయల్స్‌లో ఓటమి
మాలిక్ 'టోక్యో' బెర్త్ ఆశలు ఆవిరి

**లఖ్‌నవ్:** రియో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సాక్షి మాలిక్‌కు ఈసారి టోక్యో విశ్వక్రీడల్లో ప్రాతినిధ్యం లేనట్టే! ఎందుకంటే.. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ కోసం నిర్వహించిన ట్రయల్స్‌లో సాక్షి పరాజయం పాలైంది. మహిళల 62 కిలోల విభాగం ట్రయల్స్‌లో 18 ఏళ్ల యువ రెజ్లర్ సోనమ్ మాలిక్ ఫైనల్లో సాక్షిని చిత్తుచేసి క్వాలిఫయర్స్ ఈవెంట్‌కు ఎంపికైంది. ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్ వచ్చేనెల 27 నుంచి 29 వరకు బిషెక్ (కిర్గిస్థాన్)లో జరగనుంది. ఇందులో ఫైనలిస్టులుగా నిలిచిన రెజ్లర్లు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. అయితే... తాజా ట్రయల్స్‌లో తొలుత రాధికను ఓడించిన సోనమ్.. సెమీస్‌లో సరితా మోర్‌పై, ఫైనల్లో సాక్షి మాలిక్‌కు షాకిచ్చి ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు జట్టులో చోటు దక్కించుకుంది. కిరణ్ 4-2తో గురుశరణ్ కౌర్‌పై, పురుషుల 60 కిలోల విభాగంలో జ్ఞానేంద్ర 4-1తో విజయ్‌పై గెలుపొంది ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు ఎంపికయ్యారు.

### విండీస్‌కు పాక్ షాక్

8 వికెట్లతో విజయం
టీ20 వరల్డ్‌కప్‌లో శుభారంభం



**కాన్‌బెర్రా:** కెప్టెన్ బిస్మా మారూఫ్ (38 నాటౌట్) రాణించడంతో మహిళల టీ20 వరల్డ్‌కప్‌లో పాకిస్థాన్ శుభారంభం చేసింది. గ్రూప్-బిలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాక్ 8 వికెట్ల తేడాతో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌కు షాకిచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 124/7 స్కోరు చేసింది. కెప్టెన్ స్టెఫానీ టేలర్ (43), షిమైన్ క్యాంప్‌బెల్ (43) ఆదుకొన్నారు. ఛేదనలో పాక్ 18.2 ఓవర్లలో 127/2 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు జవేరీ ఖాన్ (35), మునీబా అలీ (25) తొలి వికెట్‌కు 58 పరుగులు జోడించారు. ఆ తర్వాత మారూఫ్ మరో 10 బంతులు మిగిలుండగానే జట్టును విజయతీరాలకు చేర్చింది.

#### హీథర్ నైట్ సెంచరీ

కెప్టెన్ హీథర్ నైట్ (108 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో గ్రూప్-బిలో ఇంగ్లండ్ 98 పరుగులతో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఇంగ్లండ్ 2 వికెట్లకు 176 పరుగులు చేసింది. స్కివర్ (59 నాటౌట్) మూడో వికెట్‌కు అజేయంగా 169 పరుగుల రికార్డు భాగస్వామ్యంతో ఇంగ్లండ్‌కు భారీ స్కోరు అందించారు. ఛేదనలో థాయ్‌లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 78 రన్స్‌కే పరిమితమైంది.

### ఇషాంత్, మయాంక్ పోజులాపి..ఆడండి

సోషల్ మీడియాలో అభిమానుల ట్రోల్

**న్యూఢిల్లీ:** టీమిండియా ఆటగాళ్లు ఇషాంత్ శర్మ, మయాంక్ అగర్వాల్‌ను సోషల్ మీడియాలో అభిమానులు ట్రోల్ చేశారు. షాపింగ్ చేసి తిరిగొస్తూ కోహ్లీ, పంత్‌తో కలిసి దిగిన ఫొటోను ఇషాంత్, మయాంక్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత్ చిత్తుగా ఓడిపోవడంతో కోపంగా ఉన్న అభిమానులు తమ ఆగ్రహాన్ని కామెంట్ల రూపంలో వెల్లడించారు. 'షాపింగ్‌లు మానేసి ప్రాక్టీస్ చేయండి', 'పోజులాపి..ఆడండి', 90వ దశకంలో జట్లు పిచ్‌పై పోజులిస్తే 20వ దశకంలో టీమ్‌లు ఇంటర్నెట్‌లో పోజులిస్తున్నారని ట్రోల్ చేశారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.